
ఒంగోలు రంగారాయుడు చెరువులో చెన్నకేశవస్వామి తెప్పోత్సవం

ఊరూరా సంబరం

ఉత్సాహంగా సంక్రాంతి


ఒంగోలు గద్దలగుంటలో పార్వేటకు తరలివచ్చిన దేవతామూర్తులు, హాజరైన ప్రజలు


కొత్తపట్నంలో ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల


ఒంగోలులో తెప్పోత్సవం సందర్భంగా నృత్యప్రదర్శన


మార్కాపురంలో అయ్యప్ప ఆభరణాలను ఊరేగిస్తున్న భక్తులు



ఒంగోలు (కల్చరల్), జనవరి 16 : జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పండుగ సందర్భంగా పల్లె మొదలు నగరాల వరకు సందడి వాతావరణం నెలకొంది. తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతికి ఇతర రాష్ర్టాలు, దేశాలలో ఉన్న జిల్లావాసులు స్వగ్రామాలకు చేరుకోవడంతో ప్రతి ఊరిలో కోలాహలం కనిపించింది. మరోవైపు భోగి, సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని చిన్న, పెద్ద దేవాలయాలకు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి పూజలు చేశారు. ఆటపాటలు, ఎడ్ల, పొట్టేళ్ల పోటీలు చూడటానికి ప్రజలు ఉత్సాహం చూపారు. ఇక గాలిపటాలు ఎగురవేస్తూ చిన్నారులు ఆనందంతో కేరింతలు కొట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలలో యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేసింది. జిల్లాకేంద్రమైన ఒంగోలు నగరంలోని ప్రసిద్ధ ఆలయాలతోపాటు, మార్కాపురం, భైరవకోన, త్రిపురాంతకం, మిట్టపాలెం, సింగరాయకొండ, రామతీర్థం మొదలైన ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పలుచోట్ల తెప్పోత్సవాలు జరిగాయి. ఒంగోలులోని గద్దలగుంటలో మంగళవారం నిర్వహించిన పార్వేటకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.



పందెం కోడ్ఢీ

- జిల్లావ్యాప్తంగా పందేల జోరు
- యథేచ్ఛగా బరుల ఏర్పాటు
- కోడికి రూ.500, కత్తికి రూ.500 వసూలు
- కొన్నిచోట్ల ప్రవేశ రుసుం
- పోలీసుల ప్రేక్షకపాత్ర
- అధికారపార్టీ నేతల అండతోనే ఆట
- రూ.లక్షల్లో చేతులు మారిన వైనం
- భారీగానే పేకాట శిబిరాలు

జిల్లాలో పందెం కోళ్లు తొడకొట్టాయి. లక్షల్లో డబ్బులు చేతులు మారాయి. ఇంతస్థాయిలో బరులు ఏర్పాటు కావడం ఇదే తొలిసారి. పలు గ్రామాల్లో ఆది, సోమ, మంగళవారాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. అధికారపార్టీకి చెందిన నాయకుల అండతో పందెంరాయుళ్లు రెచ్చిపోయారు. 'మేముండగా మీకెందుకు భయం.. ఏం జరిగినా మేం చేసుకుంటాం.. మీరు మమ్మల్ని చూసుకోండి' అంటూ పెద్ద నేతలు అభయమివ్వడంతో మూడు రోజులుగా పలు గ్రామాల్లో గోదావరి జిల్లాల స్థాయిలోనే బరులు నడిచాయి. కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పండుగకు ముందురోజు చేసిన హెచ్చరికలను ఎవరూ లెక్క చేయలేదు. తమ అనుయాయులతో ఎక్కడికక్కడ యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట శిబిరాలను వైసీపీ నేతలు దగ్గరుండి ఏర్పాటు చేశారు.


చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో జరుగుతున్న కోడిపందెం

అధికార పార్టీ నాయకుల అండతో.

పీసీపల్లి : మండలంలోని లక్ష్మక్కపల్లి, భట్టుపల్లి, ఇర్లపాడు పరిసర ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. కోడిని తెచ్చిన వ్యక్తి నుంచి రూ.500, కత్తి కడితే రూ.500 చొప్పున నిర్వాహకులు వసూలు చేశారు. పందేలు జరుగుతున్న సమయంలో చూసేందుకు వెళ్లిన వారు పందెం కాసి వేలల్లో నష్టపోయినట్లు చెప్తున్నారు. కొన్ని బరుల వద్ద ప్రవేశ రుసుం పేరుతో నగదు వసూలు చేశారు. లక్షల్లో పందేలు సాగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. బరుల వ్యవహారాన్ని కొంతమంది సోషల్ మీడియాలో పెట్టడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం పీసీపల్లి ఎస్‌ఐ జి.కోటయ్య సిబ్బందితో భట్టుపల్లి సమీపంలో జరుగుతున్న పందెం వద్దకు వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేవలం రెండు కోళ్లు, రూ.2,250 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఒంగోలు (క్రైం), జనవరి 16 : సంప్రదాయం ఆటలు కాదని జిల్లాలో కోడి పందేలు, పేకాట తదితరాలతో సంక్రాంతి పండుగ జోరుగా హుషారుగా సాగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎక్కడ చూసినా బరులను బాహాటంగా ఏర్పాటు చేసి పందేలు వేశారు. పైపెచ్చు మద్యం ఏరులై పారింది. ప్రధానంగా ఒంగోలు నగరానికి సమీపంలోనే పందేలను యథేచ్ఛగా నిర్వహించారు. వేల మంది అక్కడకు చేరినా కనీసం పట్టించుకునేవారు కరువయ్యారు. ఎస్పీ మలికగర్గ్ కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినా పందేల నిర్వాహకులు లెక్క పెట్టలేదు. ఆధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతోనే బరితెగించి బరులు నిర్వహించారు. చోటామోటా నాయకుల కనుసన్నలలో కోడిపందేలు వేయడం గమనార్హం. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పందేలు వరుసగా మూడు రోజులు వేశారు. పెద్దఎత్తున పైపందేలు నడిచాయి. లక్షల్లో నగదు చేతులు మారింది. ఉదాహరణకు కొత్తపట్నం మండలం గవండ్లపాలెంలో మూడు రోజులపాటు కోడి పందేలు జోరుగా సాగాయి. చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో బరి ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారులకు తెలిసినప్పటికీ మిన్నకుండటం చర్చనీయాంశమైంది. వరుసగా బరులు ఏర్పాటు చేసి పైపందేలు వేస్తుంటే చూస్తూ ఉండిపోవడం నిస్సహాయతా? లేక పచ్చజెండా ఊపడమా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బరులు వేసేవారి నుంచి పోలీసులకు ప్యాకేజీలు ముట్టాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

రూ.లక్షల్లో పైపందేలు

కోడి పందేల కంటే పైపందేలు లక్షల్లో నడిచాయి. బరి వద్ద సకల సౌకర్యాలు కల్పించారు. అక్రమంగా మద్యం విక్రయించారు. అందుకు అనుమతిచ్చినందుకు రోజుకు రూ.10వేలకుపైనే బరి నిర్వాహకుడికి ముట్టజెప్పినట్లు సమాచారం. బిర్యానీలు, మటన్, చికెన్ వంటకాలు బండ్లపై పెట్టుకుని విక్రయించేవారు రూ.10వేలు చెల్లించారు. ఇతర వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి. ఇలా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా బరులు మారినా, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పండుగకు ముందు రోజు ఎస్పీ మలికగర్గ్ ఓ ప్రకటన విడుదల చేశారు. కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. అయితే మూడు రోజులు వరుసగా ఒకేచోట పందేలు అధికారబలంతో నిర్వహించినా చర్యలు కరువయ్యాయి. అసలు సమాచారం ఇచ్చిన వారికి ఎదురైన మర్యాద ఏమిటి అన్నది కూడా చర్చనీయాంశమైంది. అంతేకాదు కోడి పందేలలో పై పందేలు వేసి లక్షలు పోగొట్టుకున్నవారు అనేక మంది ఉన్నారు.

పశ్చిమ ప్రాంతంలోనూ భారీగా..

జిల్లాలో పశ్చిమ ప్రాంతంతోపాటు మైదానాలు, సముద్ర తీరప్రాంతాలలో కోడి పందేల జోరు సాగింది. ముందుగా పందెంరాయుళ్లకు సమాచారం ఇచ్చి పందేలు వేయడం విశేషం. అయితే 'పండుగ కదా పోనివ్వండి' అని పోలీసు అధికారులు చెప్పడం చూస్తే కోడి పందేలకు వారే పచ్చజెండా ఊపారన్న అనుమానాలు ఉన్నాయి. సింగరాయకొండ మండలం పాకల సమీపంలోని పట్టపుపాలెం, నాగులుప్పలపాడు మండలం కనపర్తి, కొత్తపట్నం మండలం గవండ్లపాలెం, మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు, చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడు ఇలా అనేక ప్రాంతాల్లో కోడి పందేలు భారీ ఎత్తున సాగాయి. వందలమంది రోజంతా అక్కడే తిష్ట వేసి పందేలను తిలకించారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే జిల్లావ్యాప్తంగా పేకాట శిబిరాలు కూడా మూడు రోజులపాటు కోలాహలంగా సాగాయి. రూ.లక్షల్లో నగదు చేతులు మారింది.

వెలిగండ్లలో జోరుగా కోడి పందేలు

వెలిగండ్ల : పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా వైసీపీ నాయకులు కోడి పందేలను జోరుగా నిర్వహించారు. పందేలు వేస్తే చర్యలు తప్పవని చెప్పిన పోలీసు, రెవెన్యూ అధికారులు పరోక్షంగా చూసీచూడనట్లు వ్యవహరించడంతో అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పందేలు యథేచ్ఛగా సాగాయి. వెదుళ్లచెరువు, రాళ్లపల్లి, కవ్వంపాడు గ్రామాల శివారులో మూడు రోజులుగా కోడి పందేలు, జూదం జరిగినా అటువైపు పోలీసులు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్థులు అంటున్నారు. లక్షలు ఇచ్చి కోడి పందేలకు అనుమతి తెచ్చుకున్నట్లు నిర్వాహకులు బహిరంగంగా చెప్తున్నారు.


ఒంగోలులో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి గారెలు వండుతున్న శ్రీనివాసరావు

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

- వేతనాల పెంపుపై హామీ కాదు.. జీవో ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్
- కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళనలు
- 36వ రోజుకు చేరిన సమ్మె

ఒంగోలు నగరం, జనవరి 16: వేతనాల పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల పట్ల రాష్ట్రప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న అంగన్‌వాడీల శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. మంగళవారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 36వ రోజుకు చేరింది. 24గంటల నిరవధిక దీక్షలు కూడా కొనసాగుతున్నాయి. సోమవారం పొదిలి శిబిరాన్ని సందర్శించి మాట్లాడిన శ్రీనివాసరావు, మంగళవారం ఒంగోలులో అంగన్‌వాడీల ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం ఎంత పెంచుతుందో చెప్పడం లేదన్నారు. జూలైలో పెంచుతామని ప్రభుత్వం ఎన్నికల హామీలా చెబుతుందే కానీ ఎంత అన్నది స్పష్టంగా చెప్పడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నిర్దిష్టమైన హామీని ఇవ్వాలన్నారు. పండుగలను కుటుంబసభ్యులతో కాకుండా బజారులో జరుపుకునే దుస్థితిని అంగన్‌వాడీలకు ప్రభుత్వం కల్పించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి అంగన్‌వాడీల ఉసురు తగలకుండా ఉండాలంటే వెంటనే ముఖ్యమంత్రితో మంత్రులు చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని శ్రీనివాసరావు సూచించారు. కాగా అంగన్‌వాడీలు మంగళవారం జిల్లావ్యాప్తంగా తమ ఆందోళనను కొనసాగించారు. ఒంగోలులో శిబిరం వద్ద గారెలు వండి నిరసనను తెలియజేశారు. గిద్దలూరు, పొదిలి తదితర ప్రాంతాల్లో ఒంటి కాలిపై నిల్చొని నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా కొనసాగించారు. ఒంగోలులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్ తదతరులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నపూర్ణ, సుబ్బమ్మ, ప్రశాంతి, నిర్మల, హేమీమా తదితరులు పాల్గొన్నారు.

మద్దిశెట్టి దారెటు?

- ప్రత్యామ్నాయ అవకాశాలపై అన్వేషణ
- అనుచరులతో స్వగ్రామంలో సమావేశం
- సోదరులిక్కడ, తాడేపల్లిలో వేణుగోపాల్
- ఎంపీ లేదు.. ఒంగోలు ఎమ్మెల్యే అయితే పరిశీలిస్తాం
- మూడురోజుల్లో నిర్ణయం అంటూ అనుచరులకు సంకేతం
- నేడు బూచేపల్లి సమావేశంతో వేడెక్కిన దర్శి రాజకీయం


లక్ష్మీనరసాపురంలో అనుచరులతో మద్దిశెట్టి సోదరుడు శ్రీధర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సిటింగ్ సీటు లేదనడం, మరో సీటు అడిగితే సానుకూలంగా స్పందించకపోవటం, చివరికి కొత్త ఇన్‌చార్జికి సహకరించాలన్న విజ్ఞప్తి లేకపోవటం.. వెరసి తీవ్ర అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఎలా ముందుకుపోవాలన్న అంశంపై దృష్టిసారించారు. అటు ప్రత్యామ్నాయంగా వేరే అవకాశం ఇవ్వమని అధిష్ఠానాన్ని కోరుతూనే, ఇటు నియోజకవర్గంలో అనుచరులు చేజారిపోకుండా చూసుకునే ప్రయత్నం ప్రారంభించారు. మరోవైపు వైపాలెంలో ప్రస్తుత ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఫొటోల వరకు ఫ్లెక్సీలలో కనిపించకుండా చించివేయడం వైసీపీలో సరికొత్త వివాదానికి దారితీసింది.

స్వగ్రామంలో అనుచరులతో సమావేశం

తన స్వగ్రామమైన పామూరు మండలం లక్ష్మీనరసాపురంలో మద్దిశెట్టి దర్శి నియోజకవర్గంలోని అనుచరులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. అయితే చివరిక్షణంలో ఆయన కాకుండా సోదరుడు శ్రీధర్, మరో సోదరుడు హాజరయ్యారు. ఎంపీ విజయసాయిరెడ్డి నుంచి వచ్చిన పిలుపుతో ఎమ్మెల్యే వేణుగోపాల్ తాడేపల్లి వెళ్లారని సమావేశానికి వచ్చిన అనుచరులతో శ్రీధర్ తెలిపారు. ముండ్లమూరు, తాళ్లూరు ఎంపీపీలతోపాటు కురిచేడులో అనధికారికంగా ఎంపీపీ పాత్ర పోషిస్తున్న నాయకుడు, దర్శి ఏఎంసీ ఛైర్మన్, మాజీ ఛైర్మన్లతోపాటు ఆయా మండలాల పార్టీ కన్వీనర్లు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు సర్పంచ్‌లు హాజరైన వారిలో ఉన్నారు. 'మనకు దర్శిలో తిరిగి టికెట్ ఇవ్వలేదు. ఇక్కడ చూస్తే శివప్రసాద్‌రెడ్డి నుంచి కనీస పలకరింపు కూడా లేదు. అందుకే మనందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుందాం. వేచి ఉండండి' అని శ్రీధర్ ఆ సమావేశానికి వెళ్లిన నాయకులతో స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వేణుగోపాల్ రాజకీయంగా ఎలాంటి ముందడుగు వేసినా మీరందరూ సహకరించాలి అంటూ దర్శి నియోజకవర్గాన్ని వదిలే ప్రసక్తేలేదని తేల్చిచెప్పినట్లు కూడా తెలుస్తోంది. గురు, శుక్రవారాల్లోనే ఎమ్మెల్యే నియోజకవర్గానికి వచ్చి అందరినీ కలుస్తారని వారు చెప్పినట్లు తెలిసింది.

ఎంపీ సీటుకు అవకాశం లేదని సంకేతం

ఒంగోలు ఎంపీ టికెట్ రెడ్డికే ఇవ్వాలన్న దృఢ నిర్ణయంతో జగన్ ఉన్నట్లు తెలిసింది. తనకు ఒంగోలు ఎంపీగా పోటీచేసే అవకాశం ఇవ్వాలని మద్దిశెట్టి కోరినప్పుడే జగన్ ఆవిధమైన సంకేతం ఇచ్చారని తెలుస్తోంది. అదే సమయంలో ఒంగోలు అసెంబ్లీ స్థానం అయితే పరిశీలిస్తానని చెప్పినట్లు తెలిసింది. అయితే ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీచేసే ఆలోచన లేదని, అవకాశం ఇస్తే ఎంపీగానే బరిలోకి దిగుతానని మద్దిశెట్టి పార్టీ నేతలకు సమాచారం పంపారు. పార్టీలో ముఖ్యనేతల్లో ఒకరైన మంత్రి బొత్స మద్దతు వేణుగోపాల్‌కు ఉంది. దీంతో బుధ, గురువారాల్లో మరో ప్రయత్నం చేసి తదనంతరం నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో వేణుగోపాల్ ఉన్నారు. ఇదే సమయంలో మంగళవారం తాడేపల్లిలో ఒకరిద్దరు నాయకులను ఆయన కలిసినప్పుడు బూచేపల్లి నుంచి ఇంతవరకు తన సహకారం కావాలన్న విజ్ఞప్తి రాలేదని, పార్టీ అధిష్ఠానం కూడా మా ఇద్దరినీ కూర్చోబెట్టి కలిసి పనిచేయండన్న సంకేతం కూడా ఇవ్వలేదని చెప్పినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా వేరే ప్రధాన పార్టీలలో అవకాశం ఇస్తే పోటీకి సిద్ధపడటమా? అదీ కుదరకపోతే కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉండటమా? అన్న సంశయంలో ఆయన ఉన్నట్లు తెలిసింది. ఏది జరిగినా దర్శిలోని అనుచరులకు అండగా నిలబడాలన్న భావనతో ఉన్నారని తెలుస్తోంది. బూచేపల్లికి మాత్రం సహకరించకూడదన్న అభిప్రాయంతో ఉన్నారని సమాచారం.

నేడు బూచేపల్లి సమావేశం

దర్శిలో బుధవారం బూచేపల్లి పార్టీ సమావేశం ఏర్పాటుచేసి మద్దిశెట్టి అనుచరులను కూడా పిలిచారు. మంగళవారం సమావేశానికి వెళ్లిన వారికి కూడా ఈ సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానాలు వెళ్లాయి. విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి ప్రజలను తీసుకెళ్లే పేరుతో బూచేపల్లి ఈ సమావేశం ఏర్పాటుచేశారు. మద్దిశెట్టి ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లినవారిలో అత్యధికులు బూచేపల్లి ఏర్పాటుచేస్తున్న సమావేశానికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు.



ఎర్రగొండపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు చింపేసిన వైసీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఫ్లెక్సీ

వైపాలెంలో ఫ్లెక్సీల రగడ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఎర్రగొండపాలెంలో వైసీపీ నూతన ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఫొటోలను ఫ్లెక్సీలలో చించివేయడంతో ఆ నియోజకవర్గంలోని అధికార పార్టీలో అంతర్గతంగా ఉన్న కుమ్ములాటలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల ఆయన.. మంత్రి సురేష్ లేకుండానే నియోజకవర్గంలోకి వెళ్లి పార్టీ నాయకుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైపాలెంలో ఒకరోజు మకాంవేసి నాయకులను కలిశారు. ఆ సందర్భంగా ఆయనకు స్వాగతం పలికే ఫ్లెక్సీలను వైపాలెంలో ఏర్పాటు చేశారు. అందులో మంత్రి సురేష్ కార్యాలయానికి వెళ్లేమార్గంలో ఉన్న ఐదింటిని గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. అదీ సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లోని ఫ్లెక్సీలలో ఇతర నాయకుల ఫొటోలకు ఇబ్బందిలేకుండా కేవలం చంద్రశేఖర్‌వి మాత్రమే కట్ చేశారు. దీంతో ఆ నియోజకవర్గ వైసీపీలో అంతర్గతంగా నెలకొన్న పోరు బయటపడింది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో కొత్త మలుపు తిరిగే అవకాశం కూడా లేకపోలేదు.





బహుమతులను ప్రదానం చేస్తున్న ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి



చంద్రపాడులో బహుమతులను అందజేస్తున్న బీఎన్



కె.అగ్రహారం జరిగిన రథోత్సవంలో పాల్గొన్న శిద్దా కుటుంబసభ్యులు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- గ్రామగ్రామానా వేడుకలు
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- కనుమ సందర్భంగా తెప్పోత్సవాలు
- అలరించిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాలు, నగరాలు జన సందడితో కళకళలాడాయి. తమ కుటుంబసభ్యులతో ఎంతో సంతోషంగా గడిపారు. మరోవైపు కనుమపండుగ సందర్భంగా పలుచోట్ల స్వామివార్ల పార్వేట, తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి. ఒంగోలు నగరం గద్దలగుంటపాలెంలో వందేళ్లకు పైగా ఆనవాయితీగా వస్తున్న పార్వేట ఉత్సవంలో



శ్రీగిరిలో సంగీత విభావరి

ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు. వివిధ దేవాలయాల నుంచి దేవతామూర్తులను మేళతాళాల నడుమ ఉత్సవం వరకు తీసుకురాగా భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు అర్పించారు. అదేవిధంగా స్థానిక రంగారాయుడు చెరువులో శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి, శ్రీకాశీవిశ్వేశ్వర స్వామివార్ల తెప్పోత్సవం నిర్వహించగా, అప్పాయగుంటలో శ్రీ సీతారామచంద్రమూర్తి తెప్పోత్సంగా వైభవంగా జరిగింది. తెప్పోత్సవాలను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇక టంగుటూరు, కొప్పోలులో, కరవది మొదలైన ప్రాంతాల్ల తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి.

రాజకీయ పార్టీల సందడి

ఇక ఇది ఎన్నికల సంవత్సరం కావటంతో సంక్రాంతి, కనుమపండుగ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో స్థానిక రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఒంగోలు నగరం గద్దలగుంటపాలెంలో పార్వేట సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీలైన వైసీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు భారీస్థాయిలో ఆయా పార్టీల నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటుచేశాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యువత పోటీపోటీగా కార్యక్రమాలను నిర్వహించారు. ఇక సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో ఎక్కడికక్కడ స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా అలరించాయి. క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి క్రీడలు, ముగ్గుల పోటీలు, ఎడ్ల బలప్రదర్శనలు అనేక చోట్ల జరిగాయి.

పిండివంటల ఘుమఘుమలు

సంక్రాంతి పండుగ అంటేనే పిండివంటలు. ఈ ఇంటా చూసినా ఘుమఘుమలే. అనేకచోట్ల మహిళలు వారం రోజుల ముందునుంచే అరిశలు, చక్కిలాలు, కారప్పూస, బొబ్బట్లు, కజ్జికాయలు వంటి సంప్రదాయ పిండివంటలను తయారుచేస్తూ బిజీబిజీగా గడిపారు. మరోవైపు ఇళ్లలో తయారుచేసుకోలేని వారి కోసం ఎక్కడికక్కడ తయారీ కేంద్రాలు, అమ్మకాల కేంద్రాలు వెలిశాయి. వీటి ద్వారా పిండివంటలను ప్రజలు పెద్దఎత్తున కొనుగోలు చేశారు.

భారీగా మద్యం, మాంసం కొనుగోళ్లు

కనుమ పండుగ సందర్భంగా మంగళవారం జిల్లాలో మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. పండుగను ఆసరా చేసుకొని చికెన్, మటన్ ధరలు పెంచి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. అదేవిధంగా మద్యం కొనుగోలు కోసం మద్యం దుకాణాల దగ్గర ప్రజలు, ముఖ్యంగా యువత బారులుతీరి కనిపించారు. ఇక జిల్లాలో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో గ్రామాలకు దూరంగా బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు, జూదం వంటివాటిని నిర్వహించారు.

గద్దలగుంటలో..

సంక్రాంతి పండుగ సంబరాలను సోమవారం స్థానిక గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగ్గులు, ఆటల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కమిటీ అధ్యక్షుడు ఓగిరాల రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభకు కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు సంచాలకులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి పలు పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, ఈదుపల్లి గురునాథం, కుర్రా ప్రసాద్ బాబు, ఈదుపల్లి అంకబాబు, లేళ్ల సుమన్, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి.

శ్రీగిరి దేవస్థానంలో..

స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కనుమపండుగ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ఆస్థాన విద్వాంసులు వీవీఎస్.వినోద్‌కుమార్ బృందంచే ఏర్పాటుచేసిన భక్తి సంగీత విభావరి భక్తులను తన్మయులను చేసింది. పలు అన్నమాచార్య సంకీర్తనలు విశేసంగా అలరించాయి. అనంతరం శ్రీవారి తిరువీధి ఉత్సవాన్ని మేళతాళాలతో నేత్రపర్వంగా నిర్వహించారు. అదేవిధంగా అద్దంకి స్వర్ణ సుబ్బారావు బృంద కళాకారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో చైర్మన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్చిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, జైశంకర్‌లు పాల్గొన్నారు. కళాకారులను ఘనంగా సత్కరించారు.

వృద్ధాశ్రమంలో..

స్థానిక బలరాం కాలనీ ఉషోదయ వృద్ధాశ్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మారెళ్ల వివేకానంద, మారెళ్ల సుబ్బారావుల ఆధ్వర్యంలో సంక్రాంతి పిండివంటలను వృద్ధులకు పంచిపెట్టారు. ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవప్రసాద్, నిర్వాహకురాలు కోటమ్మ పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ గ్రామానా సంప్రదాయబద్ధంగా సంక్రాంతి ,కనుమ పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చంద్రపాడులో జరిగిన ముగ్గులపోటీల్లో విజేతలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎస్.విజయ్‌కుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిపాటి రాఘవరావు, దొడ్డా సుబ్బారావు, గాలి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కె.అగ్రహారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం కనులపండవగా జరిపారు .కృష్ణసాయి గ్రూపు ఆఫ్ కంపెనీస్ అధినేతలు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్ కుటుంబసభ్యులతో కలిసి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

అనంతవరంలో..

టంగుటూరు: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల పండుగను ఊరూరా ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతవరంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అభినవ గద్దర్ నృత్యాలు ప్రజలను అలరించాయి. పలు గ్రామాల్లో నాటికలు, డ్యాన్స్‌లు, పాట కచ్చేరీలు నిర్వహించారు.



అభినవ అంబేడ్కర్ ప్రదర్శన

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

కొండపి, జనవరి 16 : మండలంలోని చినవెంకన్నపాలెం గ్రామానికి చెందిన 30 ఎస్సీ కుటుంబాల వారు మంగళవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొండసింగు చంద్రశేఖరరావు, కాకి వెంకటేశ్వర్లు, విస్తర్ల క్రాంతికుమార్, కాకి బ్రహ్మయ్య, హనుమంతరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకుడు పోటు మోహన్‌రావు పాల్గొన్నారు.

పెట్రోల్ లేక ఇబ్బందులు

కొండపి, జనవరి 16 : మండల కేంద్రమైన కొండపిలోని ఐవోసీ, బీపీ, హెచ్‌పీ పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్‌లేక వినియోగదారులు రెండు రోజులుగా ఇబ్బందులు పడ్డారు. రైతులు ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. పొగాకు తోటలకు నీళ్లపెడుతున్నారు. ఇంజన్లు ఆడాలంటే డీజిల్ అవసరం ఉంది. అయితే కొండపిలోని బంకుల నిర్వాహకులు నోస్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో పొరుగు మండలాలకు వెళ్లాల్సి వచ్చింది.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

కొండపి, జనవరి 16 : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొండపిలో సోమవారం మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముగ్గులు, కుర్చీలాట, ఉండమ్మాబొట్టుపెడతా తదితర పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం విజేతలకు సీపీఎం మండల నాయకుడు కేజీ మస్తాన్ బహుమతులను అందజేశారు.

345 మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుబడిన మద్యంబాటిళ్లు చూపుతున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జనవరి 16 : మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ పరిధి దేవళంపల్లెపాలెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై సోమవారం ఎస్సై టి.శ్రీరామ్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. వివిధ బ్రాండ్లకు చెందిన 328 క్వార్టర్ బాటిళ్లు, 17 బీర్ బాటిళ్లు కలిపి 345 బాటిళ్లను పట్టుకున్నారు. వీటిని సీజ్ చేసి నిర్వాహకుడు కారం సుబ్బారావును అదుపులోకి తీసుకొన్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ షాకీర్, కానిస్టేబుళ్లు సుమన్, విజయ్, రమణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభానికి తరలిరండి

టంగుటూరు, జనవరి 16: విజయవాడలో ఈనెల 19న జరగనున్న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి వేలాదిగా ప్రజలు తరలిరావాలని వైసీపీ బీసీ విభాగం జోన్-5 ఇన్‌చార్జి, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బొట్లా రామారావు పిలుపునిచ్చారు. టంగుటూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం రూ.400 కోట్లు వెచ్చించి ఈ విగ్రహాన్ని నిర్మించిందని తెలిపారు.



మాట్లాడుతున్న రామారావు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి16: నాగులుప్పలపాడు బస్టాండ్‌సెంటర్‌లో జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బమ్మ, దుర్గాభవాని, అరుణ, రమ, రజనీ, కౌలు రైతు సంఘ నాయకులు టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎడ్ల రాదాడి పోటీలు

ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

చూసేందుకు భారీగా తరలివచ్చిన జనం



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

కొత్తపట్నం(ఒంగోలునగరం), జనవరి 16 : రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల రాదాడి పోటీలు మంగళవారం సాయంత్రం కొత్తపట్నంలో ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేయగా పోటీలను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. కనుమ పండుగ కావటంతో ఎడ్ల పందేలను తిలకించేందుకు మండలంలోని అన్ని ప్రాంతాల నుంచి, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. దీంతో ఈ ఈ ప్రాంతం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ అంతరించి పోతున్న ఒంగోలు జాతి ఎడ్ల గొప్పతనాన్ని చాటిచెప్పేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒంగోలు జాతి ఎడ్లను కాపాడుకోవటం మనందరి కర్తవ్యం కావాలని కోరారు. తెలుగువారి పండుగ సంక్రాంతిని వైభవంగా జరుపుకోవటం, ఇందులో భాగంగా ఎడ్ల రాదాడి పోటీలు నిర్వహించటం సంతోషకరమన్నారు. తెలుగు ప్రజలకు మంచి రోజులు రానున్నాయని చెప్పారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 10 జతల ఎద్దు పాల్గొన్నాయి. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు గేనం సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేడా సుబ్బారావు, బలగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారిలో ఉద్యోగోన్నతిని పొందడంతో రివర్షన్

- డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 16: సీనియారిటీ జాబితాను ప్రచురించకుండా అడ్డదారిలో ఉద్యోగోన్నతి పొందడంతో సదరు ఉద్యోగినికి రివర్షన్ ఇచ్చినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న ఎస్.సురేషిణికి 2019లో అప్పటి వైద్యాధికారి, సిబ్బంది ఎటువంటి సీనియారిటీ ప్రచురించకుండా అడ్డదారిలో దివ్యాంగుల కోటాకు సంబంధించిన పోస్టులో ఉద్యోగోన్నతిపై నియమించారని పేర్కొన్నారు. 2017లోనే ఆ పోస్టును దివ్యాంగుల కోటా కింద బ్యాక్‌లాగ్ పోస్టుగా పరిగణించి ఆ శాఖకు ఆ స్పెషల్ డ్రైవ్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియించుకోవాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. తదనుగుణంగా ఆ పోస్టును నియమించేందుకు నోటిఫికేషన్ కూడా ఇచ్చారన్నారు. అయితే 2019లో సురేషిణికి దివ్యాంగుల పత్రం లేకపోయినా ఉద్యోగోన్నతిపై నియమించి బ్యాక్‌లాగ్ చేసిన పోస్టును నియించారన్నారు. ఈ పోస్టు నియామకంపై సమాచార హక్కు చట్టం ద్వారా సురేషిణి అర్హతలను కోరారాని, ఇంకొక వైపు దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ శాఖ కూడా నోటిపై చేసిన ఖాళీని దివ్యాంగులు కాని వ్యక్తితో భర్తీ చేసినందుకు సంజాయిషీని వైద్యశాఖను కోరారని తెలిపారు. ఇంకొక వైపు దివ్యాంగుల సంఘాలు కూడా వివరణ కోరడంతో పాటు అన్ని అర్హతలతో పాటు సీనియారిటీ జాబితాలను కూడా పరిశీలించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి పొందడంతో గత ఏడాది జూన్ 13న సురేషిణికి సంజాయిషీ నోటీసును ఇచ్చినట్లు తెలిపారు. సదరు ఉద్యోగి సురేషిణి తాను దివ్యాంగురాలిని కాదని, ఇందులో తన తప్పేమిలేదని రాతపూర్వకంగా ఇచ్చిందని, ఆమె సంజాయిషీని పరిగణలోకి తీసుకొని గత ఏడాది డిసెంబరు 29న తన ఒరిజనల్ పోస్టు ఆఫీసు సబార్డినేట్‌గా రివర్షన్ చేస్తూ కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఖాళీలో నియమించినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ మొత్తం కలెక్టర్ అనుమతితో జరిగిందని, ఈ నెల 3వతేదీన తనకు ఇచ్చిన సంజాయిషీ నోటీసుపై హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తీసుకొని కాపీ జత చేసివైద్యశాఖలో ఇచ్చిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులో సురేషిణి షోకాజ్ నోటీసులో ఇచ్చిన ప్రకారం జూనియర్ స్టెనోగా కొనసాగించాలని ఇచ్చిందన్నారు. కానీ అప్పటికే తనను రివర్షన్ ఇచ్చి ఆఫీసు సబార్డినేట్‌గా నియమించిన విషయం కోర్టుకు తెలియజేయకుండా దాచారని, దీనిపై ప్రభుత్వ న్యాయవాదిని సంప్రదించి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు కృషి చేయాలి

- మంత్రి ఆదిమూలపు సురేష్



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మద్దిపూడి, జనవరి 16: అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు. మండలంలోని గుండ్లసముద్రంలో స్పేస్ విజన్ సంస్థ అధినేత తూమాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు చారిత్రక సంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులను ప్రోత్సహించేందుకు ఎడ్ల పోటీలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఒంగోలు జాతి పశు సంపదను కాపాడేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఏపీఆర్ సంస్థల అధిపతులు ఆవుల కృష్ణారెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధా వెంకట్రావు, మద్దిపూడి సొసైటీ అధ్యక్షుడు బి.విజయభాస్కర్‌రెడ్డి, మద్దిపూడి సర్పంచ్ కదిరి భాస్కర్, నాయకులు బీవీ భాస్కర్ రెడ్డి, బి.రమణారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 12 జతల ఎడ్లు పాల్గొంటున్నాయి. వీటిని తిలకించేందుకు పొదిలి, మద్దిపూడి మండలాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

10న అంబేడ్కర్‌వాదుల మహాసభ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 16: ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో వచ్చేనెల 10వతేదీన అంబేడ్కర్‌వాదుల మహాసభ నిర్వహిస్తున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు తెలిపారు. స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో మహాసభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ దారా అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంగళరావు మాట్లాడుతూ ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అంబేడ్కర్ కలలను సాకారం చేసేందుకు అంబేడ్కర్‌వాదుల మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జంద్రాజుపల్లి ఆంజనేయులు, దండేల కృష్ణ, కందుల శ్రీనివాసరావు, దిలీప్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

18 నుంచి ఎన్టీఆర్ కల్చరల్ నాటకోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దామచర్ల జనార్దన్, రియాజ్

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి రెండు రోజులపాటు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా నాటకోత్సవాలను నిర్వహించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం సూదనగుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో 18వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, రాత్రి 8.30 నుంచి హెచ్చరిక నాటిక ప్రదర్శితమవుతుందన్నారు. అదేవిధంగా 19వ తేదీ రాత్రి 7.15 గంటలకు స్వప్నం రాల్చిన అమృతం, 9 గంటలకు నాన్నా నే వచ్చేస్తా నాటికలు ఉంటాయని, కళాకారులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కామేపల్లి శ్రీనివాసరావు, అచ్యుత్, నల్లమల్లి పాండురంగారావు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత



సరుకులను అందజేస్తున్న డాక్టర్ సుధాకర్

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలో మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న శక్తి సదన్ మహిళా షెల్టర్ హోమ్‌కు రూ.40 వేల విలువైన నిత్యావసర వస్తువులను ప్రకాశం జిల్లా గ్లోబల్ ఎన్ఆర్ఐస్ ఫోరం సంస్థ మంగళవారం అందజేసింది. సంస్థ జిల్లా ప్రతినిధిగా ప్రముఖ వైద్యులు కొర్రపాటి సుధాకర్ సరుకులను సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణకు అందజేశారు. కార్యక్రమంలో బీరం అరుణ, నాళం నరసమ్మ, గుంటుపల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధాశ్రమం ప్రారంభం



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న శీనారెడ్డి

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: ఒంగోలు నగరం సంతపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన శాంతికోవెల మహిళా వృద్ధాశ్రమాన్ని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కొత్త శీనారెడ్డి మంగళవారం ప్రారంభించారు. టిసీబెల్స్ కిడ్స్ స్కూలు చైర్మన్ సుజితశేఖర్ ఏర్పాటుచేసిన ఈ వృద్ధాశ్రమంలో మహిళలకు ఆశ్రయం కల్పిస్తామని చెప్పారు. అనంతరం శీనారెడ్డి జన్మదినం సందర్భంగా 20 మందికి చీరలు పంపిణీ చేసి భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సుంకర అంజిరెడ్డి, సుహారి ఫౌండేషన్ చైర్మన్ సాదనాల సురేష్‌బాబు, వరదారెడ్డి, వెంకటస్వామి, బొడ్డు సురేష్, ఖాదర్ బాషా, ఫరూఖ్, ఉష, శేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామస్వామి జయంతి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 16: హేతువాదసంఘం, ఆసరా సంస్థల ఆధ్వర్యంలో ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో సోమవారం కవిరాజు త్రిపురనేని రామస్వామి 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసరా కార్యదర్శి ఎంసీ.వెంకటేశ్వర్లు, హేతువాద సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్యల అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ముత్తేవి రవీంద్రనాథ్, బీరం సుందరరావు పాల్గొని మాట్లాడారు. ఒక రైతు కుటుంబంలో పుట్టిన రామస్వామి సంస్కృతం నేర్చుకొని బాల్యంలోనే శతావధానాలు చేశారని తెలిపారు. బాల్యంలోనే మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఎన్నో గ్రంథాలు రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషాబేగ్, సీపీఐ నాయకులు పీవీఆర్.చౌదరి, ఉప్పుటూరి ప్రకాశరావు, వివిధ సంఘాల నాయకులు ప్రగతి రామయ్య, గుమళ్ల నరసింహారావు, చుంచు శేషయ్య, చుండూరి రంగారావు, సుభాణి, నాగభైరవ ఆదినారాయణ, గోరంట్ల పిచ్చయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయబాటలో నడవాలి



నివాళులర్పిస్తున్న.జేబీ.రాజు, నాయకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఆశయబాటలో నడవాలని దళితసేన జాతీయ అధ్యక్షుడు జేబీ.రాజు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సేవాస్తంభ్ సమావేశాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సేవాస్తంభ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీకా మధుసూదనరావు, ఐనంపూడి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానమే జాతి విముక్తికి శరణ్యమన్నారు. సేవాస్తంభ్ జాతీయ అధ్యక్షుడు కందుల నాగేశ్వర రావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ల వల్లనే ఎంతోమంది జీవితాలు బాగుపడ్డాయన్నారు. సోషల్ వెల్ఫేర్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పోతురాజు మాట్లాడుతూ ఈనాటి యువత అంబేడ్కర్ ఆలోచనతో నడవాలన్నారు. కార్యక్రమంలో రచయిత జాలాది మోహన్, డీహెచ్‌పీఎస్ కరవది సుబ్బారావు, దళిత మహాసభ నూకతోటి బాబూరావు, వద్దిముక్కల సురేష్, పాలడుగు రమేష్, చిట్టిమాల సంపత్, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

ఒంగోలు(విద్య), జనవరి 16: ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఉద్యోగోన్నతుల అవకాశం కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎల్‌కే.చిన్నప్ప విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ టీచర్లకు సర్వీసు కేటాయించాలని, డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలకు కూడా ప్రభుత్వం టీవీలు సరఫరా చేయాలని, జీవో నెం.50 ప్రకారం ప్రభుత్వంలో విలీనమైన టీచర్లకు పీఎఫ్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు అవసరమైన ఉత్తర్వులను డీఈవో జారీ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, ఓగిరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 16 : సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఒంగోలులోని కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల ఐక్యత, కార్మిక వర్గం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్.రాంబాబు, దామా శ్రీనివాసులు, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, దాసరి రమేష్, కె.సామ్రాజ్యం, కె.శ్రీనివాసరావు, యు.రత్నకుమారి, ఆర్.రాములు, ఎం.శ్రీలక్ష్మి, టి.విజయ, పి.కోటేశ్వరరావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి16: ఉప్పుగుండూరులో గత మూడు రోజుల నుంచి మాజీసర్పంచ్ రాదాసు కృష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుత్ను మండలస్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలలో మాదాసు మెమోరియల్ టీమ్ విజేతగా నిలిచి రూ.10,116లను కైవసం చేసుకుంది. కనపర్తి టీమ్ ద్వితీయ బహుమతి రూ.7116 సాధించింది. క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాదాసు రాంబాబు, కొణిజేటి సురేష్‌బాబు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, పెంట్యాల శ్రీనివాసరావు, నాగరాజు, అమరా సుబ్బారావు, పి.యానాది, వజ్రంబాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దేవుని ఊరేగింపును

అడ్డుకున్న ఆకతాయిలు

ఉత్సవ విగ్రహాలపై మద్యం చల్లిన దుండగులు

అడ్డుకున్న భక్తుడిపై దాడి.. గాయాలు

పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు

ఒంగోలు(క్రైం), జనవరి16: పూటుగా మద్యం తాగిన ఆకతాయిలు దేవుని ఊరేగింపును అడ్డుకోవడమే కాకుండా ఉత్సవ విగ్రహాలపై మద్యం చల్లారు. ఈ సంఘటన సోమవారం రాత్రి ఒంగోలు నగర శివారు ప్రాంతంలో గల అప్పాయికుంట సమీపంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. అప్పాయికుంటలో తెప్పోత్సవం అయిన తరువాత ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కమ్మపాలెం వైపు తీసుకెళ్ళుతున్నారు. మార్గమధ్యలో ఐదుగురు యువకులు పూటుగా మద్యం తాగి ఊరేగింపులో ఉన్న డీజేని ఆపివేయించారు. అంతటితో ఆగకుండా అక్కడ మద్యం బాటిళ్ళతో బీభత్సం సృష్టించారు. దీంతో ఉత్సవ విగ్రహాల పైన కూడ మద్యం సీసాలు పగిలి మద్యం పడింది. అదే సమయంలో అక్కడ ఐదుగురు యువకులు నానయాగి చేశారు. భక్తులను అడ్డగించారు. ఈక్రమంలో భక్తులపై దాడి చేయడంతో ఓ భక్తుడి తలకి గాయం కావడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. ఆకతాయిలను అదుపులోకి తీసుకొని తాలుకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జిల్లాకు ముగ్గురు తహసీల్దార్ల నియామకం

● ఇక్కడ నుంచి నెల్లూరు జిల్లాకు నలుగురు బదిలీలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 16: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీలు ప్రారంభమయ్యాయి. జోన్-3 పరిధిలో 19 మంది తహసీల్దార్లను బదిలీలు చేస్తూ చీఫ్ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా నుంచి ముగ్గురు తహసీల్దార్లను మన జిల్లాకు నియమించగా, ఇక్కడ నుంచి నలుగురు తహసీల్దార్లను నెల్లూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న టి.శ్రీనివాసులు(ఒంగోలు), ఎస్‌కే.మీరావలి(సంతనూతలపాడు), వైవీబీ. కుటుంబరావు(గిద్దలూరు)ను నియమించారు. ఇక నెల్లూరు జిల్లాకు కలెక్టరేట్ ఏవో కె.చిరంజీవి(మనబోలు), ఎం.రాజ్యలక్ష్మి(నెల్లూరు కలెక్టరేట్), సీహెచ్.శ్రీనివాసరావు(కలువాయి), డి.శ్రావణ్‌కుమార్(కొండాపురం)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యువతకు చంద్రబాబుతోనే భవిత



మాట్లాడుతున్న తేజస్విని

కొండపి, జనవరి 16 : రాష్ట్రంలోని యువత భవిత చంద్రబాబు పైనే ఆధారపడి ఉందని టీడీపీ ఐటీ, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ విభాగం అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని అన్నారు. పొన్నలూరులో సోమవారం నిర్వహించిన ఐటీ, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యువతీయువకులు రాబోయే రోజుల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు అన్ని విధాలా అన్యాయం జరిగిందని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు ఆనుమోలు సాంబశివరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మద్దిపాడు, జనవరి 16 : సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. రామాయపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆర్భాటంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ మలసాని నాగేశ్వరరావు, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి మలసాని కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఏటా మాదిరిగానే రామాయపాలెంలో సంక్రాంతి వేడుకలకు ప్రవాసాంధ్రులు, ప్రవాస భారతీయులు పెద్దఎత్తున తరలివచ్చారు. టీడీపీ, జనసేన పతాకాల రూపంలో అతివలు వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. సైకిల్ గుర్తుకే మీ ఓటు అంటూ వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుండ్లసముద్రంలో స్పేస్ విజన్ అధిపతి తూమాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తెలుగు యువత ఆధ్వర్యంలో కూడా రంగవల్లుల పోటీలు జరిగాయి. గుండ్లసముద్రం ఎస్సీ కాలనీలోనూ ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పని చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నాగులుప్పలపాడు(ఒంగోల్‌రూరల్), జనవరి16: ఎస్సీ వర్గీకరణకే ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్‌మాదిగా పిలుపునిచ్చారు. నాగులుప్పలపాడులోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్‌కాలనీలో మంగళవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులతో మహజన సోషలిస్ట్ పార్టీ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్‌మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీరణను చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. మందకృష్ణ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణను సాధించుకోవాలని, ఇందుకోసం గ్రామాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం బొంత ఏసుదాసు ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్, నాయకులు జాలారావుమాదిగ, బాబురావు, ఎల్.కోటేశ్వరరావు, గద్దె పెదసుబ్బారావు, పసుమర్తి విజయ్‌కుమార్, నలుకుర్తి రాజు, టెలికాం అబ్రహం, పాలపర్తి రత్నాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూటా అంగన్‌వాడీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

టంగుటూరు, జనవరి 16 : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. పండుగ రోజులైన సోమ, మంగళవారాల్లోనూ వారు తమ నిరసనను కొనసాగించారు. సీఎం జగన్ పండుగ పూట తమను బజారున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టంగుటూరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ నేతలు మాట్లాడారు. ప్రభుత్వ మొండివైఖరితో పండుగలను సమ్మె శిబిరాల్లోనే జరుపుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారడంతోనే తాము సమ్మె బాటపట్టామని తెలిపారు. తమ డిమాండ్లను పరిశీలించి పరిష్కారానికి ముందుకు రావలసిన ప్రభుత్వం ఈఅంశాన్ని పూర్తిగా విస్మరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్, అంగన్‌వాడీ నాయకులు బి.శేషమ్మ, పి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సంక్రాంతి సందర్భంగా సోమ, మంగళవారాలు కూడా నిరసన కొనసాగించారు. కొండపిలోని దీక్షా శిబిరంలోనే పొంగలి పెట్టారు.



పార్వేటకు భారీగా తరలివచ్చిన జనం



తెప్పోత్సవానికి తరలివెళుతున్న చెన్నకేశవుడు



గాంధీపార్కులో తెప్పోత్సవాన్ని చూసేందుకు తరలివచ్చిన భక్తులు

ఘనంగా పార్వేట!

తరలివచ్చిన దేవతామూర్తుల ప్రతిమలు

వేడుకల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్

కన్నులపండుగగా తెప్పోత్సవం ● వేలాదిగా హాజరైన ప్రజలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: కనుమపండుగ సందర్భంగా మంగళవారం రాత్రి ఒంగోలు నగరం గద్దలగుంటపాలెంలో నిర్వహించిన పార్వేట ఉత్సవం, అటు గాంధీపార్కులో ఏర్పాటుచేసిన శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి, శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. దాదాపు 100 సంవత్సరాలకు పైగా స్థానిక గద్దలగుంటపాలెంలో కనుమపండుగ రోజున పార్వేట ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ఈ సంవత్సరం నిర్వహించిన వేడుకకు నగరంలోని పలు దేవాలయాల నుంచి ప్రత్యేక వాహనాలపై విశేష అలంకరణ చేసిన దేవతామూర్తులు తరలివచ్చారు. వారికి ప్రజలు అడుగడుగునా కర్పూర హారతులతో మంగళనీరాజనాలు సమర్పించారు. అన్ని దేవతామూర్తులు గద్దలగుంటపాలెంకు చేరుకుని తిరిగి ఆయా దేవాలయాలకు మంగళవారం రాత్రికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా గద్దలగుంటలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ సంగీత విభావరి ప్రజలను ఉర్రూతలూగించాయి. పార్వేటకు తరలివచ్చే ప్రజలు, వాహనాలతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, స్థానిక కార్పొరేటర్లు పాల్గొని ప్రజలకు కనుమ శుభాకాంక్షలు అందజేశారు. అటు దామచర్ల, షేక్ రియాజ్‌లు స్థానిక జయరాం థియేటర్ వద్ద నుంచి కాలి నడకన బయలుదేరి కొణిజేడు బస్టాండ్ రామాలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వినాయకుడు, ఆంజనేయస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు దేవస్థానాలలో సైతం వారు పూజలో పాల్గొని ఆశీర్వచనం అందుకున్నారు. అదేవిధంగా పార్వేట సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, యువత ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో సైతం దామచర్ల జనార్దన్, రియాజ్‌లు పాల్గొన్నారు.



గంగిరెద్దును పట్టుకున్న దామచర్ల జనార్దన్, రియాజ్, మంత్రి శ్రీనివాసులు తదితరులు

తెప్పోత్సవాన్ని తిలకించేందుకు గాంధీపార్కుకు చేరుకున్న జనం

స్థానిక గాంధీపార్కులో శ్రీ భూదేవీ, శ్రీదేవి సహిత ప్రసన్న చెన్నకేశవ స్వామి, గంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవం మంగళవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. ఇందుకోసం గత మూడు రోజులుగా ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పను విద్యుద్దీపాలు, పుష్పమాలలతో విశేషంగా అలంకరించి అందులో స్వామి వారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి, ఆయా దేవస్థానాల ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం వైసీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాతలు తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి, పాలకమండలి సభ్యులు పి.గోవర్ధనరెడ్డి, కుర్రా ప్రసాద్‌బాబు, నెమ్మాని హరిప్రియాదేవి, దార్ల వెంకటరమణమ్మ, కరేటి కిరణ్, ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన నృత్య విభావరి

అటు తెప్పోత్సవం సందర్భంగా శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గాంధీపార్కులో ఏర్పాటుచేసిన శాస్త్రీయ నృత్య విభావరి ప్రజలను విశేషంగా అలరించింది. నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ విద్యార్థులు పలు శాస్త్రీయ గీతాలకు ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకుంది. నృత్య శిక్షకురాలు పి.శివకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా తెప్పోత్సవాలు





వల్లూరమ్మ తల్లికి పూజలు చేస్తున్న మంత్రి సురేష్‌బాబు (ఇన్‌సెట్లో), అనంతరం జరిగిన అమ్మవారి తెప్పోత్సవం

టంగుటూరు ఊర చెరువులో జరుగుతున్న తెప్పోత్సవం (పక్కన)

టంగుటూరు, జనవరి 16 : కనుమ పండుగ సందర్భంగా మండలంలోని టంగుటూరు, వల్లూరులలో తెప్పోత్సవాలను వైభవంగా నిర్వహించారు. టంగుటూరు ఊరచెరువులో, వల్లూరులోని వల్లూరమ్మ దేవస్థానం వద్ద ఉన్న చెరువులో ఈ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. టంగుటూరులో జరిగిన వేడుకకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ హాజరయ్యారు. వారంతా ముందుగా తెప్ప ఎక్కి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. టంగుటూరుతోపాటుగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై ఉత్సవాన్ని తిలకించారు.

వల్లూరులో.. వల్లూరమ్మ దేవస్థానం చెంతనే ఉన్న చెరువులో తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ముందుగా మంత్రి తెప్పలో అమర్చిన ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వల్లూరు, సూరారెడ్డిపాలెం గ్రామాల ప్రజలతోపాటు వల్లూరమ్మ భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తెప్పోత్సవాన్ని తిలకించారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్ కాలే శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): ఉప్పుగుండూరులో సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం శ్రీవేణుగోపాల ఆళ్వారస్వాములు వారి తెప్పోత్సవం ఆలయానికి చెందిన ఊరచెరువులో అర్చకులు దివి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా రోజ్ స్టడీసర్కిల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం స్టడిసర్కిల్ ప్రిన్స్‌పాల్ శామ్యూల్ మాట్లాడుతూ తెలుగువారి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సంక్రాంతిని పెద్ద పండగని, దీని విలువను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాలలో సర్పంచ్ దేవర కొండ జయమ్మ, ఎంపీపీ అంజమ్మ, నలమలపు కృష్ణారెడ్డి, మాదాసు రాంబాబు, కొణిజేటి సురేష్‌బాబు, పెంట్యాల శ్రీనివాసరావు, ఈవో మినిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో విహరిస్తున్న శ్రీవేణుగోపాల ఆళ్వారస్వామి



కోలాటం ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సింగరాయకొండ, జనవరి 16: సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకొని పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహస్వామితోపాటు అమ్మవార్లు రాజ్యలక్ష్మి, గోదాదేవిలను, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడును పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం పార్వేట నిర్వహించారు. విగ్రహాలను దేవస్థానం నుంచి సోమరాజుపల్లెకు మోతకాపులు మోసుకెళ్లారు. గ్రామోత్సవాన్ని నిర్వహించారు. చైర్మన్ మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి, అర్చకుడు వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు



విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న అతిథులు

ఒంగోలు(రూరల్), జనవరి16: ఒంగోలు మండలం కరవది గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ క్రీడా పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలను డీఎస్పీ అన్న వేణుగోపాల్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో మెలగాలని కోరారు. బీచ్ కబడ్డీపోటీలను తిలకించేందుకు భారీగాల జనం తరలివచ్చారు. క్రీడాపరిషత్ అధ్యక్షుడు శిరిగిరి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, అంచెపోగుల వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారులు గడ్డం శ్రీనివాసరావు, వై.పూర్ణచంద్రరావు, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజేత ప్రకాశం జట్టు

గత రెండురోజుల నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. విశాఖ జట్టు ద్వితీయ, తృతీయ విజేతగా ఇంకొల్లు, నాల్గో విజేతగా మార్కాపురం జట్టు, ఐదో విజేతగా ఓడరేవు జట్లు నిలిచాయి. జిల్లా సివిల్ అండ్ సెషన్స్ న్యాయాధికారి టి.రాజా వెంకటాద్రి, జిల్లా సివిల్ అండ్ సెషన్స్ న్యాయాధికారి అమ్మన్నరాజా క్రీడాకారులుకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గడ్డం శ్రీనివాసరావు, ఎన్టీఆర్ క్రీడాపరిషత్ చైర్మన్ శిరిగిరి రంగారావు, హైకోర్టు అడ్వకేట్ ఎం.సుధార్‌బాబు, నిర్వాహకులు ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఒంగోలు(రూరల్), జనవరి16: ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని బృందావన్‌గార్డన్స్ కాలనీలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు రెండు రోజుల నుంచి వివిధ పోటీలు నిర్వహించగా మంగళవారంతో ముగిశాయి. ముగ్గులు పోటీలు, తదితర క్రీడలను నిర్వహించారు. చిన్నపిల్లలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీను, దివి బ్రహ్మానందం, పోస్టల్ మోహనరావు, సుబ్బారావు, రాజు పాల్గొన్నారు.



బహుమతులను అందజేసిన నిర్వాహకులు

పెచ్చరిల్లిన కోడిపందెంరాయుళ్లు..!

● చేష్టలుడిగి చూసిన అధికార యంత్రాంగం

చీమకుర్తి, జనవరి 16 : కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పండగకు ముందు పోలీసుశాఖ ఉన్నతాధికారులు పత్రికాముఖంగా ఇచ్చిన ప్రకటనలు నీటిమీద రాతలయ్యాయి. కోడిపందెంరాయుళ్లు పెచ్చరిల్లి యథేచ్ఛగా కోడిపందాలు నిబంధనలు, సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి మరీ నిర్వహించిన అధికారయంత్రాంగం చేష్టలుడిగి చూస్తూ ఉందే తప్ప కనీసం ప్రతిఘటించిన దాఖలాలు లేకపోవటం గమనర్హం. చీమకుర్తి, ఎర్రగుడిపాడు, మర్రిచెట్లపాలెం, తొర్రగుడిపాడు తదితర ప్రాంతాల్లో పెద్దస్థాయిలో బరిలు ఏర్పాటు చేసి మరి పందేలు నిర్వహించారు. చుట్టుపక్క మండలాల నుంచి కూడా పందెంరాయుళ్లు ఇక్కడకి విచ్చేసి పెద్దఎత్తున బెట్టింగ్‌లకు పాల్పడటం బహిరంగంగానే జరగటం విశేషం. కాగా మంచికలపాడు గ్రామ శివార్లలో కోడిపందాలు నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులు, రెండు కోళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2200 నగదును స్వాధీనపరచుకున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



సరుకులను అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 16: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ ఆదేశాలతో ప్రకాశం జిల్లా బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నగరం లోని బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువులు, పిండివంటల పంపిణీ జరిగింది. స్థానిక లాయర్‌పేట ప్రకాశంపంతులు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షురాలు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కామరాజుగడ్డ కుసుమకుమారి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణులకు ఎప్పుడూ అండగా ఉంటుందని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చీమకుర్తి రాఘవేంద్రరావు(రాము) మాట్లాడుతూ బ్రాహ్మణులు సంతోషంగా ఉన్నప్పుడే సమాజం బాగుంటుం దన్నారు. అందువల్ల కాంబోడియాకు చెందిన చీమకుర్తి రవి సుబ్రహ్మణ్యం సహకారంతో బియ్యం, అరిసెలు, చెరుకుగడలు వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సేవా ట్రస్ట్ నాయకులు రామరాజు మల్లిఖార్జునశర్మ, ప్రసన్నకుమార్‌శర్మ, పి.నరసింహారావు, వరప్రసాదశర్మ, పురోహితులు ప్రసాదశర్మ, మురళీకృష్ణశర్మ, దాదాపు 100 మంది బ్రాహ్మణులు పాల్గొన్నారు.






మార్కాపురంలో విశేష అలంకరణలో చెన్నకేశవుడు, హాజరైన భక్తులు, రాచర్లలో కోలాటం ఆడుతున్న భక్తులు, కంభంలో స్వామివారి రథోత్సవం

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి

- పల్లెకు చేరిన పట్నం వాసులు
- కుటుంబ సభ్యులతో గ్రామాలు కళకళ
- పారువేట కార్యక్రమం పూర్తి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 16: సంక్రాంతి పర్వదినాన్ని మార్కాపురంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రజలు నూతనవస్త్రాలు ధరించి ఇళ్లు, ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి సంక్రాంతి పూజల అనంతరం పార్వేట ఉత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి ధనుర్బాణాలు ధరించి చెరువులోని సంక్రాంతి మండపం వద్దకు చేరుకున్నారు. భక్తులు మోతకావుల చెన్నకేశవ నామ స్మరణల మధ్య చేరుకున్న అనంతరం ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచుర్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి మండపంలో చెన్నకేశవస్వామిని దర్శించుకున్న భక్తులు పులకరించిపోయారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

వైభవంగా పారువేట

గిద్దలూరు : సంక్రాంతి పర్వదినాన్ని గిద్దలూరుతోపాటు పలు గ్రామాల్లో పారువేట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గిద్దలూరులో అమ్మవారిశాల, వేంకటేశ్వర స్వామి, ఇతర దేవస్థానాల నుంచి స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రాచర్ల : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణాల నుంచి స్వగ్రామాలకు ప్రజలు తరలివచ్చారు. దీంతో పల్లెల్లో నూతన శోభ సంతరించుకొంది. మండలంలో అనుమలవీడులో కోలన్న నిర్వహించారు. విగ్రహ మహోత్సవ కార్యక్రమంలో పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. రాచర్లలో ముగ్గుల పోటీలను రాక్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్, జి.రంగస్వామిరెడ్డి, షేక్ తాహర్‌బాషా, దప్పిలి కాశిరెడ్డి, కళ్యాణ్‌రెడ్డి మహిళలకు బహుమతులు అందజేశారు. కనుమ సందర్భంగా స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో మాజీసర్పంచ్ కన్నెసాని ఓబులేసు (బుజ్జి), జేపీ.చెరువులో సర్పంచ్ షేక్ మౌలాలి, గౌతవరం సర్పంచ్ మార్తోటి లక్ష్మీదేవి, చోళ్లవీడులో సర్పంచ్ గోతం వెంకటనారాయణ, సోమిదేవిపల్లెలో సర్పంచ్ రేగలగడ్డ రమాదేవి, మాజీసర్పంచ్ శీలం వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో మంగళవారం పారువేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, రాములవారి దేవస్థానం నుండి ఉత్సవమూర్తులను పల్లకిలలో ఊరేగించారు. పారువేటలో భక్తులు ఉత్సవ మూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొమరోలు : గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డిలు స్వగ్రామమైన కొమరోలు మండలంలోని హనుమంతురాయునిపల్లిలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ పండితులు గౌరిపెద్ది హరిశర్మ ఆధ్వర్యంలో ముత్తుముల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంక్రాంతి సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం స్వగ్రామంలోని పెద్దలను, స్నేహితులతో కలసికొద్దిసేపు గడిపారు. వీరి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : తెలుగు వారి సంప్రదాయ పండుగ భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటు ఉత్సాహంగా ప్రజలు పండగ చేసుకున్నారు. స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు మణిస్వామి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరిమలైలో జ్యోతి కనిపించే సమయంలోనే స్థానిక ఆలయంలో మకరజ్యోతిని వెలిగించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు, మహిళలు విశేషంగా హాజరై మకరజ్యోతిని తిలకించి స్వామివారిని సేవించారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి పెద్దలు బొగ్గరపు చంద్రశేఖర్, రమేష్, శేషయ్య సుబ్బనారాయణ, గాదె బ్రహ్మారెడ్డి, వేణు, గురుస్వాములు పండు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.




పొదిలి అయ్యప్పస్వామి ఆలయంలో పడిభజన, పూజల్లో పాల్గొన్న అశోక్‌రెడ్డి

కొమరోలు: మండలంలోని సంక్రాంతి పర్వదినాల్లో చివరి రోజైన కనుమ రోజు అన్ని గ్రామాల్లో సీతారాముల స్వాముల పారువేట కార్యాక్రమాలను ప్రజలు ఉల్లాసంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయాలు ఉట్టిపడే ఆటలు, పాటలు నిర్వహించారు. మండలంలోని బాదినేనిపల్లి, కొమరోలు, చింతలపల్లి, అల్లీనగరం తదితర గ్రామాల్లోని సీతారాముల దేవాలయంలో స్వాములను అలంకరించి, వడపప్పు పానకాన్ని ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం పారువేట కార్యక్రమానికి వెళ్లి అక్కడ చిన్న, పెద్ద తేడాలు లేకుండా పరుగెత్తి గొర్రెను తాకడం కార్యాక్రమాన్ని నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి పూజాకైంకర్యాలు నిర్వహించారు. అదే విధంగా మార్కాపురంలో కూడా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి మకర జ్యోతి దర్శన కార్యక్రమం నిర్వహించారు. పెద్దఎత్తున కాయాకర్పూరాలు సమర్పించారు. భక్తులు మకరజ్యోతిని దర్శించుకున్నారు. అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షులు మల్లికార్జునరావు, కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి మోహన్ రావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షిం చారు.

పొదిలి : అయ్యప్పస్వామి దేవస్థానంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం భారీ పడిపూజ ఏర్పాటు చేశారు. శబరిమలలో స్వామివారి జ్యోతిని తిలకించేందుకు ప్రత్యేకంగా టీవీ ఏర్పాటు చేసి భక్తులకు జ్యోతిదర్శనం కల్పించారు. అనంతరం అయ్యప్ప దేవస్థానంలో జ్యోతిని ఏర్పాటు చేశారు. అయ్యప్ప మాలధారణ చివరి ఇరుముడి కార్యాక్రమం కావడంతో స్వాములు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉద్యోగులను తొలగించడం అంత తేలిక కాదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పొదిలి, జనవరి 16 : ప్రభుత్వ ఉద్యోగం ఏదైనా సరే తొలగించడం అంత సులువు కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పాద యాత్రలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 35 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న దీక్షలకు ఆయన మంగళవారం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల విషయంలో ఒంటెత్తు పోకడలతో వెళ్లడం మంచిది కాదన్నారు. ఆయన ఇచ్చిన హామీలు అమలుజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతుంటే అందుకు ప్రతిగా ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో 4500 ఉన్న అంగన్వాడి కార్యకర్తల జీతం ఐదేళ్లలో రెండుసార్లు పెంచి రూ.10,500లు చేశారని గుర్తు చేశారు. వైసీపీ ఏర్పడిన తరువాత ఒక్కరూపాయికూడా పెంచకుండా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అధికార దాహంతో పాదయాత్రలో తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ ఇస్తానని చెప్పి ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలను ఎందుకు బయట పడేశారని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తల చిన్న సమస్యను తీర్చడానికి ప్రభుత్వం వద్ద నిధులు లేకపోయినా, విశాఖపట్నంలో రూ.500 కోట్లతో విలాసవంతమైన నిర్మాణాలకు నిధులు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. చిరుఉద్యోగులను, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలు, రాజకీయ పక్షాల పరిస్థితి ఎలా ఉందో జగన్ సమీక్షించుకోవాలన్నారు. ఎస్మా పేరు చెప్పి లక్షమందికి పైగా ఉన్న ఉద్యోగులను తీసేయడం అంత తేలిక కాదన్నారు. సుప్రీంకోర్టు కనీస గ్రాడ్యూటీ రూ.5 లక్షలు కల్పించాలని తీర్పు కూడా ఇచ్చిందన్నారు. 'నేను ఉన్నాను, నేను విన్నాను, నేను చూశాను' అని బురిడి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడన్నారు. ఇప్పుడు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా పొదిలి యూటీఎఫ్‌శాఖ, కెల్లంపల్లికి చెందిన వంకాయలపాటి శాంత అంగన్వాడీల సమ్మెకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం రమేష్, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్‌హై, జిల్లా కార్యదర్శి పెమ్మని బాల వెంకటేశ్వర్లు, బుజ్జిబాబు, నాసర్ అహమ్మద్, పెన్షన్‌దారుల సంఘం అధ్యక్షుడు ఏ బాదుల్లా, తదితర ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సర్పంచుల హక్కులను కాలరాసిన జగన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- పాపినేనిపల్లె వైసీపీ సర్పంచ్ టీడీపీలో చేరిక



కండువాకప్పి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 16 : జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వ్యవస్థలను నాశనం చేశాడని, అదేకోవలో సర్పంచుల హక్కులను కాలరాసి అప్రజాస్వామికంగా పాలన చేస్తున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం అర్ధవీడు మండలం పాపినేనిపల్లె సర్పంచ్ కొమిరె అచ్చమ్మ టీడీపీలో చేరారు. వారికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఆమెతోపాటు భర్త పుల్లారావు, 100 మంది అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డికి సర్పంచులంటే చిన్నచూపన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీ పతనానికి అడుగులు మొదలయ్యాయని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో మీనిగె పెద్దకంబగిరి, చిన్నకంబయ్య, ఓరా ఆంజనేయులు, కొమిరె వెంకటేశ్వర్లు, నారపోయిన వెంగయ్య, నల్లబోతుల ఏడుకొండలు, షేక్ ఖాశింవలి, మీనిగె నాయుడు, మాజీ ఎంపిటిసి మండ్ల రంగయ్య మండలపార్టీ ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి, మాజీ సర్పంచ్ బండి నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మారెడ్డి రంగారెడ్డి, రమణయాదవ్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిళ్లు దగ్ధం

- పూర్తిగా కాలిన సామాగ్రి
- బాధితులకు ఎరిక్షన్‌బాబు సాయం



దగ్ధమౌతున్న పూరిళ్లు

త్రిపురాంతకం, జనవరి 16: గ్యాస్ సిలెండర్ పేలి నాలుగు పూరిళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని లేళ్లపల్లిలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన చేవూరి గురమ్మ ఇంటిలో పూజలో భాగంగా దీపం వెలిగించి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆ దీపానికి పేపర్లు అంటుకొని మంటుఉ సిలెండర్ వద్దకు చేరాయి. దీంతో గ్యాస్ సిలిండర్ పేలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ ఇంటితో పాటు పక్కనే ఉన్న చేవూరి శ్రీను, దూదేకుల హసాన్, ఖాశీంల ఇళ్లు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఇళ్లలోని నిత్యావసరాలు, దుస్తులు, మంచాలు కాలి బూడిదయ్యాయి. గురమ్మ ఇంట్లో కూలీలకు ఇచ్చేందుకు ఉంచిన రూ.లక్ష నగదు అగ్నికి ఆహుతైంది. ఎదురుగా ఉన్న సిద్ధయ్య ఇల్లు పాక్షికంగా కాలింది. రైతులు డి.నాగిరెడ్డి, డి.సుబ్బారెడ్డి వేసుకున్న వరిగడ్డి వాములు కాలిపోయాయి. సమాచారం అందుకున్న వె.పాలెం అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. కుటుంబానికి రూ. 5 వేల చొప్పున రూ. 25 వేలను తక్షణ సాయం అందించారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పక్కా ఇళ్ళు నిర్మాణానికి సహకరిస్తానన్నారు. మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ. 3 వేలు, వైసీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు.

జూదరుల అరెస్టు

కొమరోలు, జనవరి16: పేకాటాడుతున్న పలువురు జూదరులను అదుపులోనికి తీసుకొని వారివద్దనున్న నగదును స్వాధినంచేసుకున్నట్లు ఎస్సై సుబ్బరాజు మంగళవారం తెలిపారు. మండలంలోని తాటిచర్ల గ్రామ పంచాయతీలోని హసనాపురం వ్యవసాయ భూముల్లో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్దనున్న రూ.7610ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచిరూ.2 వేలు నగదును స్వాధీనం చేసుకొన్నారు. మొత్తం 13 మంది అరెస్టు అయ్యారు.

అక్రమ మద్యం పట్టివేత

- 106 క్వార్టర్స్ సీసాలు స్వాధీనం, ఇద్దరు నిందితుల అరెస్టు

గిద్దలూరు టౌన్, జనవరి 16 : అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిని మంగళవారం పోలీసులు అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. మండలంలోని అంకనాంపల్లి గ్రామంలో మోడిగారి శ్రీరాములు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద ఉన్న 88 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సోమవారం కుమ్మరాంకట్ట సమీపంలో దిగువమెట్ట గ్రామానికి చెందిన దేశావత్ వెంకటేశ్వరనాయక్ వద్ద 18 క్వార్టర్స్ సీసాలను గుర్తించారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న కిషోర్ అనే వ్యక్తిని ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న 54 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రతి చెంచు గిరిజన కుటుంబానికి సహకారం

సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

ఎర్రగొండపాలెం, జనవరి 16 : ప్రకాశం జిల్లాలోని అర్హులైన ప్రతి చెంచుగిరిజనుడికి ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకాల్లో భాగంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని మార్కాపురం డివిజన్ ఉపకలెక్టరు రాహుల్‌మీనా అన్నారు.సోమవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని 100 జిల్లాల్లోని చెంచుగిరిజనులతో దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు.ఇందులో బాగంగా ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెంలో జిల్లాలోని చెంచుగిరిజనులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లాలోని 7 మండలాల పరిధిలోని 88 ఆవాస ప్రాంతాల నుంచి 500 మంది చెంచుగిరిజనులు ప్రధాన మంత్రి సందేశాన్ని విన్నారు.ఈ కార్యక్రమంలో ఉప కలెక్టరు రాహుల్‌మీనా మాట్లాడుతూ పిఎం జన్ మాన్ పథకం ద్వారా 11 పథకాలను చెంచు గిరిజనులనకు అందింజయనున్నట్లు తెలపారు. 7 మండలాల్లో 54 క్యాంపులు నిర్వహించి లబ్దిదారులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రగిరిజన సక్షేమశాఖలోని కంపెనీ సెక్రటరి కేబీ ముగ్దల్ మాట్లాడుతూ జిల్లాలో జన్‌మాన్ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారని అన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ పథకం లో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరావు, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ ఈ మర్దన్‌అలి, హౌసింగ్ డియం పేరయ్య, జిల్యా వ్యవసాయాధికారి జె శ్రీనివాసరావు,మార్కాపురం డిఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, సర్పంచులు, గిరిజనులు పాల్గొన్నారు.



గ్యాస్ స్టౌవ్ పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

గిరిజన తాండాల నుంచే వైసీపీ పాలనకు ఉద్వాసన

టీడీపీలోకి భారీగా చేరికలు

పుల్లలచెరువు, జనవరి 16: గత ఎన్నికల్లో గిరిజ నులకు బోగస్ మాటలు చెప్పి ఓట్లు వేయించుకోని గిరిజనులకు వైసీపీ చేసిందేమీలేదని, త్వరలోనే గిరిజన తండాల నుంచి వైసీపీకి పూర్తి ఉద్వాసన పలుకుతారని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు .మంగళవారం పుల్లలచెరువు మండలం పీఆర్‌సీ తాండలో వైసీపీపై విరక్తితో 38 కుంటుంబాలకు టీడీపీలో చేరాయి.ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4.5 ఏళ్లకు పైగా పాలన చేసిన మంత్రి సురేష్‌కు పీఆర్‌సీ తాండ ఎక్కడ వుందో తెలుసా అని పశ్నించారు. తాండలో మంచినీటీ సమస్య వున్న పట్టించుకున్న పాపన పాలకులు లేరని విమర్శించారు.తాండలో సీసీ రోడ్డులు, డ్రేనేజీ లేక తాండలో అభివృద్ధి కనిపించడంలేదని అన్నారు. మార్కాపురంను జిల్లా చేస్తామని మంత్రి ఇచ్చిన హామి ఏమైందని ప్రశ్నించారు.అక్టోబరు మొదటి వారంలో వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీళ్ళు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.ఇక్కడ పోటీ చేస్తే ఓడిపోతారన్న భయంతోనే మంత్రి సురేష్ ఇక్కడ నుంచి పరారయ్యారని ఎద్దేవా చేశారు.గిరిజన గూడేంలలో నిశబ్ధ విప్లవం మొదలైందని వైసీపీ త్వరలోనే బొందపెట్టుకోని పోతుందని అన్నారు.గిరిజనులకు వైసీపీ చేసిన అభివృద్ధిపై వైసీపీకి దమ్ముంటే చర్చలకు రావాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో చంద్రబాబు వేలాది మందికి ఐటి రంగం ద్వారా ఉద్యోగాలు కల్పిం చారని అన్నారు. సీఎం జగన్‌రాష్టానికి ఒక్క ఐటి పరిశ్రమ అయినా తెచ్చారని ప్రశ్నించారు. స్కిల్ డెవలంప్‌మెంటు ద్వారా లక్షలాది మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇస్తే అందులో అవినీతీ జరిగిం దని చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపడం దారుణమని అన్నారు.స్వంత బాబాయిని చంపిన అవినాశ్‌రెడ్డిని వదిలేసి ఆ నింద చంద్రబాబుపై మోపి గత ఎన్నికల్లో సానుబూతి పొందారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్,టీడీపీ మాజీ మండలాధ్య క్షుడు శనగా నారాయణరెడ్డి, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య,మేడికొండ లక్ష్మినారయణ,మంత్రు నాయక్, సేవ్యా నాయక్, బద్దు నాయక్, గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎరిక్షన్‌బాబు

ఆర్మీజవాన్ అదృశ్యం

- ఆర్మీ, పోలీసులు గాలింపు

కొమరోలు, జనవరి 16: ఆర్మీ ఉద్యోగి అనూహ్యంగా అదృశ్యమైన ఘటన మండలంలోని యర్రపల్లి గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మారం బ్రాహ్మానందరెడ్డి కొన్ని సంవత్సరాలుగా మద్రాసు రెజిమెట్స్‌లో జవానుగా పనిచేస్తున్నారు. ఇటీవల స్వగ్రామమైన యర్రపల్లికి సెలవుపై వచ్చారు. సెలవులు ముగించుకొని ఈ నెల 8న ఒంగోలుకు వెళ్లాడు. అక్కడి నుంచి విజయవాడ మీదుగా బంగ్లాదేశ్ సరిహద్దులోని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని న్యూ జలసాయి గుడి(ఎన్‌జీపీ) రైల్వే స్టేషన్‌కు ఈ నెల 10న చేరుకున్నాడు. అక్కడి నుంచి ఆర్మీయూనిట్‌కు వెళ్తుండగా మార్గ మధ్యంలో అదృశ్యమ య్యారు. అదే సమయంలో రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం ఉంది. దానికి 30మీటర్ల దూరంలో బ్రాహ్మానందరెడ్డికి చెందిన లగేజి బ్యాగు, పత్రాలను రైల్వే పోలీసులు గుర్తించారు. మద్రాసు యూనిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తుపటేందుకు వీలు లేకపోవడంతో జవాను కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు హుటాహుటీన ఎన్‌జీపీ రైల్వే స్టేషన్‌కు కుటుంబసభ్యులు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి బ్రాహ్మానందరెడ్డిది కాదని ధ్రువీకరించారు. దీంతో మద్రాసు యునిట్ అధికారులు, పశ్చిమ బెంగా ల్ పోలీసులు, రైల్వే పోలీసులు, జవాను కుటుంబ సభ్యులు గాలించినా ఇప్పటి వరకు ఎ లాంటి అచూకీ దొరక లేదు. ఇటీవ లే బ్రహ్మానంద రెడ్డి వివాహం కావడంతో భార్య, తల్లి దండ్రులు శోక సముద్రంలో మునిగిపోయారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి యర్రపల్లి గ్రామానికి వెళ్లి ఆర్మీ జవాను కుటుంబానికి ధైర్యం చెప్పి ఓదార్చారు.



బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

అవీ..ఇవీ..

కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

కొమరోలు, జనవరి 16: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గిద్దలూరు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ఆ గ్రామస్థులు నిర్వహించారు. విజేతగా నిలిచిన గిద్దలూరు టీంకు మొదటి బహుమతి రూ.10వేలను కొమరోలు టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ అందజేశారు. రాచర్ల మండలంలోని ఎగ్గన్నపల్లిటీం ద్వితీయ బహుమతి రూ.6 వేలను గెలుపొందింది. మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీం తృతీయ బహుమతి రూ.5వేలను దక్కించుకొంది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో సంస్కృతి, సాంప్రదాయాలను మర్చిపోకుండా గ్రామీణ క్రీడలను యువత అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పందరబోయిన భూపాల్, తిరుమలయ్య, నరేంద్ర, మహేష్, అంజి, బాలరాజు, కొండయ్య పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

గిద్దలూరు టౌన్, జనవరి 16 : సంక్రాంతి సందర్భంగా మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ బాడ్మింటన్ టోర్నమెంటును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, టీడీపీ నాయకులు పఠాన్ హుస్సేన్‌ఖాన్, జంగాల బాలగురువయ్య గజ్జా పెద్దయ్య, గుడిమెళ్ల వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలి, పసుపుల పోలిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ పోటీలు

త్రిపురాంతకం, జనవరి 16: మండల కేంద్రంలోని బీటీఆర్ చౌదరి ఇండోర్ షటిల్ కోర్టులో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' షటిల్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈవోఆర్డీ మురళీమోహన్ ఆధ్వర్యంలో అన్ని సచివాలయాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. ఎంఈవో టి.రాజశేఖరరెడ్డి క్రీడలను ప్రారంభించారు. పీడీలు రాంమోహన్‌రెడ్డి, బాలరాజు, కోటేశ్వరరావు క్రీడలను నిర్వహించారు. త్రిపురాంతకం-2 సచివాలయం క్రీడాకారులు విజేతలుగా నిలిచారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

బేస్తవారపేట, జనవరి16 : వైస్ షర్మిలకు ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షత బాధ్యతలు అధిష్ఠానం అప్పగించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలకల వెంకటేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బేస్తవారపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్.షర్మిలకు అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించడంతో కాంగ్రెస్ కేడర్‌లో నూతన ఉత్తేజం నిండిందన్నారు. రానున్న ఎన్నికల్లో షర్మిల నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీ కీలకంగా మారనున్నట్లు వారు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలో కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయడానికి ముందుకు వస్తున్నారన్నారు.

సుబ్బయ్య సేవలు మరువలేనివి

రాచర్ల, జనవరి 16 : గౌతవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సుబ్బయ్య అటు విద్యారంగానికి, ఇటు సమాజానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాచర్ల గ్రామంలో నామనందస్వామి ఆశ్రమంలో స్థలదాత సుబ్బయ్య విగ్రహాని అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్, సుబ్బయ్య కుమారులు శంకర్, రమేష్, శేఖర్, మాజీ సర్పంచ్ రామకోటయ్య, శంకరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 16: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మిట్టమీదపల్లెకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణారావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీజేపీలో చేరేందుకు అనేకమంది సిద్ధంగా ఉన్నారని, వారందరిని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పైడిమర్రి రామ చంద్ర, రమణ, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో 'స్వచ్ఛ దేవాలయం'



దేవాలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, జనవరి 16 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు మండ లంలోని దిగువమెట్ట దేవాలయంలోని రా మాలయంలో స్వచ్ఛ రామాలయం కార్యక్రమాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షులు ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేవాలయాన్ని శుభ్రపరిచారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎం.వీ.రమణ, పట్టణ మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, నియోజకవర్గ ఎస్సీ మోర్చ ఇన్‌చార్జ్ బండారు జయప్రసాద్, రామాలయ ధర్మకర్త కృష్ణనాయక్ పాల్గొన్నారు.

కన్నడ సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి..!

- హీరో రాజ్‌పాలా



రాచర్ల, జనవరి 16 : తెలుగు చిత్రపరిశ్రమలోనే కాకుండా కన్నడ సినిమాల్లో కూడా హీరోగా తనకు అవకాశాలు వస్తున్నాయని తెలుగు హీరో రాజ్‌పాలా అన్నారు. రాచర్ల మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన రాజ్‌పాలా కొన్ని సంవత్సరాలలో తెలుగు సినిమాలలో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామమైన యడవల్లి గ్రామానికి వచ్చి గ్రామస్థులతో, అభిమానులతో సంక్రాంతి వేడకల్లో పాల్గొన్నారు. ఇటీవల కన్నడలో కూడా అవకాశాలు వచ్చాయని, అందులో భాగంగా కన్నడలో నునుగు హెండిబేగ్ (నాకు పెళ్లాం కావాలి) సినిమాలో నటించినట్లు తెలిపారరు. ఈ సినిమా తెలుగు రాష్ట్రాలలో ఫిబ్రవరి నెలలో రిలీజ్ కానుందన్నారు. 'వన్ డే విత్ హీరోయిన్' సినిమా 50శాతం పూర్తయిందని, శివుడు బ్యాక్‌గ్రౌండ్‌లో మరో సినిమాలో నటిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీలో ఫ్లెక్సీల చించివేత కలకలం

ఎర్రగొండపాలెం, జనవరి 16 : ఎర్రగొండపాలెం వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నుంచి ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు వరకు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బ్లేడుతో కట్ చేశారు. ఈ నెల 13న కార్యకర్తల పరిచయ కార్యక్రమం సందర్భంగా ఎర్రగొండపాలెంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం మార్కాపురం రోడ్‌లో ఉన్న ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఎవరో చించారో వైసీపీ నాయకులకు అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ హైదరాబాద్ వెళ్లారని ఆయన వచ్చిన తర్వాత ఈ అంశాన్ని ఆయనతో చర్చిస్తామని కార్యకర్తలు తెలిపారు. సీసీ కెమెరాలు లేని చోట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించారని వివరించారు. ఫ్లెక్సీల చించివేత స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఊరూరా సంక్రాంతి పండుగ

- ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- విజేతలకు బహుమతుల అందజేత

దర్శి, జనవరి 16 : మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు సరదాగా జరుపుకున్నారు. పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

దొనకొండ : సంక్రాంతి పండుగ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ సహకారంతో దేవాలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు వివిధ ప్రాంతాలకు చెందిన 126 మంది పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. వీరిలో దొనకొండకు చెందిన దండె బోయిన స్వప్న వేసిన ముగ్గు ప్రథమ బహుమతిని, నరసింహనాయునిపాలెంకు చెందిన నిమ్మకాయల ఐశ్వర్య వేసిన ముగ్గుకు ద్వితీయ, దొనకొండకు చెందిన ఐలూరి భామనారెడ్డి వేసిన ముగ్గుకు తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. విజేతలకు జనసేన పార్టీ ఇన్‌చార్జి బొటుకు రమేష్, గరికపాటి వెంకట్ సోదరుడు పుల్లారావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుండాల నాగేంద్రప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎం షఫిఉల్లాఖాన్ (బాజీ) బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సొలేషన్ బహుమతిగా స్టీల్ బిందెలను అందజేశారు. ధర్మకర్త బాలిరెడ్డి దాతల సహకారంతో రాత్రి భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

కురిచేడు : సంక్రాంతి సంబరాలు మండలంలో కోలాహలంగా జరిగాయి. సంక్రాంతి రోజున ఉదయం పిల్లలు, పెద్దలు అందరూ నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు గ్రామాలలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు, స్లో బైక్ పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ దేవకుమార్, శ్రీ రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జేబీ రామారావు హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. పట్టణాల నుంచి గ్రామాలకు యువకులు ఎక్కువగా వచ్చారు. కనుము పండుగరోజే ఎక్కువ మంది తిరుగుప్రయాణమయ్యారు.

ముండ్లమూరు : సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా ముండ్లమూరు, మారెళ్ల, జమ్మలమడక గ్రామాల్లో కబడ్డీ, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, వాలీబాల్, క్రికెట్, రన్నింగ్ రేస్, స్లో బైక్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. నా ఊరే నా ఇల్లు కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించగా పాలెం ఫ్రెండ్స్ విన్నర్స్‌గా, అంబేడ్కర్-1 రన్నర్స్‌గాను నిలిచాయి. క్రికెట్‌లో జనతా బాయిస్ విన్నర్స్ గాను, ముండ్లమూరు ఫ్రెండ్స్ యూత్ రన్నర్స్‌గా నిలిచాయి. ముగ్గుల పోటీల్లో కావూరి సునీత ప్రథమ స్థానం, సోమేపల్లి అనూష ద్వితీయ స్థానం, దద్దాల స్వప్న తృతీయ స్థానంలో నిలిచారు. పురుషుల స్లో బైక్ పోటీల్లో చావా సాయి ప్రథమ, కుమ్మెత శివ మోహన్‌రెడ్డి ద్వితీయ స్థానం, స్త్రీల విభాగంలో సోమేపల్లి అనూష ప్రథమ, కావూరి ఇంద్రాదేవి ద్వితీయ స్థానం, ట్రాక్టర్స్ రివర్స్ సీనియర్స్ విభాగంలో కుమ్మెత చెంచిరెడ్డి ప్రథమ స్థానం, గుంటుపల్లి వెంకటేశ్వర్లు ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగంలో గుంటుపల్లి రమేష్ ప్రథమ స్థానం, అంబటి ఉపేంద్రరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. 10వ తరగతి, ఇంటర్ టాపర్లుగా నిలిచిన వారిలో సంద్ర మేఘ సాయి, వలేటి దీక్షిత, ఇంటర్‌లో స్త్రీ నిధి, యక్షిత, గోపనబోయిన ధనూష విజేతలుగా నిలిచారు. మారెళ్ల కబడ్డీ పోటీల్లో ముప్పవరం, గంగన్నపాలెం ఆడగా ముప్పవరం జట్టు విజయం సాధించింది. ద్వితీయ స్థానంలో గంగన్నపాలెం జట్టు, తృతీయ స్థానంలో కొప్పెరపాడు జట్టు నిలిచాయి. జమ్మలమడకలో జరిగిన ట్రాక్టర్స్ రివర్స్ పోటీల్లో పలువురు విజేతలుగా నిలిచారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మామ కాపా రమణారెడ్డి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మూడు రోజులుగా జరిగిన వివిధ రకాల ఆటల పోటీల వల్ల గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది.

సంప్రదాయాలకు చిహ్నం : ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్

పామూరు : సంప్రదాయ ఆటలకు సంక్రాంతి పండుగ చిహ్నమని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తెలిపారు. సూర్య చంద్ర సేవా సంస్థ అధ్యక్షుడు, పామూరు మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ ఆధ్వర్యంలో స్థానిక ఆక్సిజన్ సిటీ వెంచర్‌లో వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు మంగళవారం ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సీహెచ్ సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్, షేక్ చాంద్‌బాషా, ఏఎంసీ మాజీ చైర్మన్ దరిశి రాము, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీటీసీ షేక్ అబ్దుల్లా, కోఆప్షన్ షేక్ ఖాజానాయబ్ రసూల్, జీవీ భాస్కర్‌రెడ్డి, మధు, దరిశి సుబ్రమణ్యం, రవి, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. పట్టణంలోని ఛత్రపతి శివాజీ నగర్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు టీడీపీ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ జాజాం వెంకటేశ్వర్లు బహుమతులను అందజేశారు.

పామూరు : సంక్రాంతి పండుగ సందర్భగా మండలంలోని బొట్లగూడూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. యువకులకు బాల్‌బ్యాడ్మింటన్, విద్యార్థులకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ లాంటి ఆటల పోటీలు నిర్వహించారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో గెచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ రూ.2వేలు, ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి వరసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000 బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. విరాట్ కాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘం వారు ముగ్గుల పోటీని నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కమిటీ సభ్యులు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు బాలకొండలరావు తెలిపారు. అంకాలమ్మ వీధిలో జనసేన పార్టీ ధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించగా విజేతలకు నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికూటి నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, వై రహీముల్లా, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, దరిశి ఏడుకొండలు, బాబూరావు, షేక్ సందాని, గోస్టు సునీల్, పగడాలమాలి, ఈ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు : సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కొత్తపాలెంలో జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కిరాణా మర్చంట్ అసోసియేషన్, సంతూర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.


తాళ్లూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ

నాగంబొట్లపాలెంలో ప్రభలు

మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో టీడీపీ సీనియర్ నేతలు పిన్నిక రమేష్, పాశంసూరిబాబు ఆధ్వర్యంలో ఒకటి, యాతం శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నరసింహస్వామికి మొక్కుబడి ప్రభలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైసీపీ నాయకులు అనీల్‌రెడ్డి, చిమటసుబ్బారావు ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు.


పామూరులో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తున్న టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా, దర్శిలో బహుమతులను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి


సూపర్ సిక్స్ పథకాలపై వేసిన ముగ్గు

అభివృద్ధి, సంక్షేమానికి పుట్టినిల్లు టీడీపీ

పామూరు, జనవరి 16 : అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి టీడీపీ పుట్టినిల్లు లాంటిదని ఆ రెండూ పార్టీకి కళ్లలాంటివని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు అన్నారు. మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ వేడుకల కోసం సొంత ఊళ్లకు వచ్చిన వారిని టీడీపీ నేతలు కలిసి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధిని, నాలుగన్నరేళ్ల వైసీపీ అరాచక, అవినీతి పాలనను వివరించారు. మహిళాశక్తి, సూపర్‌సిక్స్ పథకాలపై ముగ్గుల రూపంలో వేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోకా మాట్లాడుతు టీడీపీ ఆరు పథకాలతో కలిగే ప్రయోజనాలపై చైతన్యం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల కష్టాలు తీర్చేందుకు చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబును, కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వామికి బంగారు తొడుగు



పామూరు, జనవరి 16 : అయ్యప్పస్వామి దేవస్థానంలో మూలవిరాట్‌కు, స్వామి వారి 18 మెట్లకు దాతలు సమకూర్చిన బంగారు తొడుగును మకర సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం తొడిగారు. సుమారు 500 గ్రాముల బంగారం రూ.40 లక్షలతో తొడుగును తయారు చేయించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజు తెలిపారు. ఆలయ అధ్యక్షులు తెలిపారు. ముందుగా శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద నుంచి స్వామి ఆభరణాలను శిరస్సు మీద పెట్టుకొని ఆలయల ప్రధాన అర్చకులు చిమట పట్టాభి స్వామి, చిమట కార్తికేయ స్వామి, సత్యబాబు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. మకర జ్యోతి దర్శనాన్ని పురస్కరించుకొని స్వర్ణ కవచధారియై అయ్యప్ప భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, కేవీ రమణయ్య, మంచికంటి సుబ్బారావు, సుబ్బారావు, సభ్యులు రాచూరి సురేష్, కంభాలరోశయ్య, ఓగూరి నరసింహారావు, మాల్యాద్రి, గద్దె రత్తయ్య, గుత్తిరమణయ్య, సుధాకర్‌రావు, రాఘవులు, పీ నరసింహారావు, దేవకి వీరాంజనేయులు, చెంచురామయ్య, కొండయ్య పాల్గొన్నారు.

బంగారు చీరతో వాసవీమాత దర్శనం

పామూరు, జనవరి 16 : కనుమ పండుగ సందర్భంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు బంగారు చీరతో దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రం బొమ్మల కొలువుతోపాటు రేగుపళ్లతో పూజ నిర్వహించినట్లు కమిటీ అధ్యక్షుడు వై.బాలకొండలు తెలిపారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులును అందజేశారు. రాత్రి అమ్మవారికి ఊంజల్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో, వైవీ సాయికిరణ్, దరిశి రాము, సుబ్బారావు, గోస్టు రామారావు, పాబోలు రమేష్, దరిశి మస్తాన్‌రావు, శేగు కృష్ణయ్య, రాచమడుగు వేణుగోపాల్, హరగోపాల్, సురేష్ పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షతల పంపిణీ

పామూరు, జనవరి 16 : మండలంలోని రేణిమడుగు గ్రాకమ శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరాముని పవిత్ర అక్షతలను ఆలయ పూజారి వేమూరివెంకన్న శాస్త్రి పూజలు నిర్వహించి సింగిల్ విండో మాజీ చైర్మన్ గద్దె గంగయ్యచౌదరి ద్వారా భక్తులకు అందజేశారు. 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో భాగంగా ప్రతిఇంట్లో ఆరోజున దీపాలు వెలిగించి పూజలు చేయాలని సూచించారు. గద్దె వెంకటేశ్వర్లు, కమ్మబాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

లారీ, వాటర్‌ట్యాంకర్ ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన కిషోర్

కనిగిరి, జనవరి 16: లారీ ఢీకొట్టిన ఘటనలో రోడ్డుపై పడి వాటర్ టాంకర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం పామూరు రోడ్డులోని పీర్లబావి వద్ద జరిగింది. ఎస్ఐ మాధవరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పాతూరుకు చెందిన వల్లపు కిషోర్ వాటర్ ట్యాంకర్‌కు డ్రైవర్‌గా వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమవారం భోగి పండుగ రోజున నగరంలో వాటర్ సరఫరా చేసేందుకు పామూరు రోడ్డులోని పీర్లబావి వద్ద ఉన్న బోరు నుంచి వాటర్ ట్యాంకర్‌కు నీటిని నింపుకుకొని అనంతరం ట్యాంకర్‌ను పామూరు రోడ్డుపైకి మళ్లించారు. అదేరోడ్డులో కనిగిరి నుంచి పామూరు వైపులోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ వల్లపు కిషోర్ భయంతో ఒక్కసారిగా రోడ్డుపైకి దూకాడు. దూకే క్రమంలో ఇనుప రాడ్ కోసుకుపోయింది. ప్రాణాపాయ స్థితికి చేరుకోగా ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతనికి ప్రాణాపాయం తప్పిందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


జనార్దన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

దామచర్లను కలిసిన టీడీపీ నాయకులు

దొనకొండ, జనవరి 16 : మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను టీడీపీ మండల నాయకులు సోమవారం కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 18వ తేదీన దొనకొండలో భారీస్థాయిలో నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని దామచర్లను వారు ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, వీవీకే చౌదరి, తోటా కేటేశ్వరరావు, బత్తుల గాలయ్య, షేక్ సుభాని, పణిదపు అనంతరాములు, వల్లపునేని ఆదినారాయణ, బోయపాటి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

దొనకొండ, జనవరి 16 : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు కోరారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శివకోటేశ్వరరావు మాట్లాడుతూ అందరూ ఐక్యతతో వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు వల్లపునేని వెంకటస్వామి, కొత్తం రఘునాథరెడ్డి, షేక్ తోహీద్, పత్తి వెంకటేశ్వర్లు, యగ్గోని యల్లారెడ్డి, మన్నెం గాలెయ్య, యరగొర్ల బసవయ్య, దుగ్గెంపూ డి చెంచయ్య, వల్లపునేని కేశవ, పెమ్మసాని లక్ష్మీనారాయణ, శృంగారపు నాగసుబ్బారెడ్డి, అంకాల మల్లికార్జున, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25 బాటిళ్లు స్వాధీనం

ముండ్లమూరు, జనవరి 16 : మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీలో బెల్టు షాపుపై సోమవారం రాత్రి దాడి చేసి, 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ యూ వెంకట కృష్ణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన అజ్ఞాత వ్యక్తి సమాచారం ఇవ్వడంతో వారి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామన్నారు. సిబ్బంది మహేష్, కాశీరాజు పాల్గొన్నారు.

మండలంలోని బొప్పూడివారిపాలెంలో పేకాట స్థావరంపై మంగళవారం ఏఎస్ఐ బీ పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి, నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,730 స్వాధీనం చేసుకున్నారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

శంకరాపురం, నూజెండ్లపల్లి గ్రామాల మధ్య సోమవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఉమ్మడి బోయిన గురునాథం తీవ్రంగా గాయ పడ్డాడు. గురునాథం అద్దంకి నుంచి మారెళ్ల వస్తుండగా కంభంపాడు నుంచి అద్దంకి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది.

పండుగను దూరం చేసిన జగన్

- 36వ రోజు ధర్నాలో అంగన్‌వాడీలు


పండుగ రోజు ధర్నాలో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దర్శి, జనవరి 16 : డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు తలపెట్టిన సమ్మె 36వ రోజు సాగింది. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ధర్నాలో సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీలు పండుగను కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యేలకు ప్రతినెల రూ.2.5 లక్షల జీతం ఇస్తున్న ప్రభుత్వం అంగన్‌వాడీల విషయంలో దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో యూ నియన్ నాయకులు నాగమణి, నిర్మల, పార్వతి, నర్సమ్మ, విజయ, సుశీల, చైతన్యభారతి, వెంకరమణ, సీఐటీయూ నాయకుడు టి రంగారావు పాల్గొన్నారు.


చీరలను అందజేస్తున్న డాక్టర్ రామయ్య, ఆదిలక్ష్మి

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

కనిగిరి, జనవరి 16: పేదలకు ఇతోధికంగా తమ వంతు సహాయ సహకారాలు, సేవ చేయడం ఆనందంగా ఉంటుందని ప్రముఖ వైద్యులు, నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రామయ్య నాయుడు ఆయన సతీమణి డాక్టర్ ఆదిలక్ష్మీ అన్నారు. పండుగ సందర్భంగా శ్రీదేవి నర్సింగ్‌హోంలో మంగళవారం పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. శివారు కాలనీలకు చెందిన పేదలు 150 మందికి దుప్పట్లు, మహిళలకు చీరలను అందచేశారు. కార్యక్రమంలో సిబ్బంది, విజేత కళాశాల కరస్పాండెంట్ అరుణోదర్, కాపు సంఘ నాయకులు చమిడిశెట్టి శ్రీనివాసులు, బేదంశెట్టి వీరయ్యనాయుడు, ముండ్లమూరి మాలకొండయ్య, ఎస్ పుల్లయ్య, నరసయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీటీసీ భర్తపై కులదూషణ కేసు

తాళ్లూరు, జనవరి 16 : పాత కక్షల నేపథ్యంలో బెల్లంకొండవారి పాలెం గ్రామ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తిని కులంపేరుతో దోసకాయలపాడు వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలి భర్త దాడి చేయగా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కులదూషణ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెల్లంకొండవారిపాలెంకు చెందిన దోసకాయలపాడు ఎంపీటీసీ గూడా సరస్వతి భర్త ప్రభాకరరెడ్డి సోమవారం రాత్రి దోసకాయలపాడులోజరుగుతున్న కోలాట కార్యక్రమాన్ని తిలకిస్తున్నారు. అదే గ్రామానికి చెం దిన ఎస్సీ కులస్తుడు వడ్డే వేణుపాల్ కోలాటం వద్ద కన్పించారు. వీరికి పాత కక్షలు ఉండడంతో ప్రభాకరరెడ్డి మద్యం మత్తులో దుర్భాషలాడారు. దీంతో వాగ్వివాదం జరిగింది. ఎంపీటీసీ భర్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహంతో వేణుగోపాల్‌ను కులంపేరుతో దూషించి చెప్పుతోకొట్టాడు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

బాధితుడికి వెంకట్ సాయం


నగదు సాయం అందిస్తున్న వెంకట్


ముండ్లమూరు, జనవరి 16 : మండలంలోని రమణా రెడ్డి పాలెం గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబరు రాయపూడి వెంకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్, వెంకయ్య ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన భార్యకు రూ.15వేల సాయాన్ని అందజేశారు. వారి తోపాటు జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, సర్పంచ్ కోటేశ్వరమ్మ, రామకృష్ణ, ప్రసాద్ ఉన్నారు.

మారెళ్ల సేవలు మరువలేనివి

కనిగిరి, జనవరి 16: దివంగత ఉపాధ్యాయుడు మారెళ్ల ప్రసాద్ విద్యాపరంగా చేసిన సేవలు మరువలేనివని ఉపాధ్యాయుడు శ్రీరాం మురళి అన్నారు. గత ఏడాది పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన మారెళ్ల ప్రసాదరావు ప్రతిభాపురస్కారాల ప్రదానం కార్యక్రమంలో మాట్లాడారు. బొమ్మిరెడ్డిపల్లి హైస్కూల్‌లో పనిచేస్తూ కరోనాతో ఉపాధ్యాయుడు మారెళ్ల ప్రసాద్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన బోధనలో ఎంతో ప్రతిభాశాలి అన్నారు. ఆయన వద్ద విద్య నేర్చుకున్న ఎంతో మంది నేడు ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. అలాంటి వ్యక్తి లేని లోటు తీర్చలేనిదన్నారు. ఆయనకు గుర్తుగా బొమ్మిరెడ్డిపల్లి గ్రామ అభ్యుదయ సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. టెన్త్‌లో 550పైగా మార్కులు సాధించిన అభ్యుదయ సమితి మారెళ్ల పేరుతో ప్రతిబా పురస్కారాలను అందించడం ఆనందంగా ఉందన్నారు. టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన కనిగిరి గోమతి స్కూల్‌కు చెందిన బాలికలు మూలె సుస్మితకు రూ.10వేలు, తూము కీర్తికి రూ.5వేల నగదు, జ్ఞాపిక ను అందచేశారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డిపల్లి గ్రామ అభ్యుదయ స మితి సభ్యులు బొల్లా నారాయణస్వామి, పాలూరి హరిప్రసాద్‌రెడ్డి, ఉ పాధ్యాయులు గంటా వెంకటరెడ్డి, తిరులయేలు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిన యువ ఓటర్లు

పీసీపల్లి, జనవరి 16 : వచ్చే ఎన్నికల్లో తొలి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్న పీసీపల్లికి చెందిన 20మంది నూతన ఓటర్లు మంగళవారం జనసేన పార్టీలో చేరారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పీసీపల్లిలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీని ప్రారంభించేందుకు కనిగిరి నియోజకవర్గ జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికూటి నాగరాజు, జనసేన పార్టీ కార్యదర్శి రహిముల్లా ముఖ్య అతథిగా పాల్గొన్నారు. విజయనగర్ కాలనీకి చెందిన కల్యాణ్, రాజ్‌కుమార్, దినేష్, అవినాష్, ఐజాక్, రాహుల్, శివాజీ చక్రవర్తి, సాత్విక్, అభిషేక్, సూర్యప్రకాష్, ఉదయ్, చందుతో పాటు మొత్తం 20మంది యువ ఓటర్లు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బండారు రాజు, వెంగళరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను వేసి నాయకులు ఆహ్వానించారు.


జనసేన పార్టీలో చేరిన యువ ఓటర్లు

వాలీబాల్ ఆటను ప్రారంభించిన నాయకులు

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పీసీపల్లిలో నిర్వహిస్తున్న మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, జనసేన పార్టీ నాయకుడు నాగరాజులు ప్రారంభించారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జట్లకు మొదటి బహుమతిని పెదవరిమడుగు గ్రామానికి చెందిన మోతుకూరి భీమయ్య రూ.15,000, ద్వితీయ బహుమతిని ముప్పవరపు మాచర్ల రూ.10వేలు, తృతీయ బహుమతిని జనసేన పార్టీ నాయకుడు బండారు రాజు రూ.5వేల నగదు బహుమతిని అందించనున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





216 జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన బరుల్లో తలబడుతున్న కోడి పుంజులు



సింగరకొండలో తెప్పోత్సవం

సందడిగా సంక్రాంతి

- ఊరూరా పండుగ వేడుకలు
- క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆలయాల్లో స్వామివార్లకు పూజలు
- నేడు తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు

బాపట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలు జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు వేడుకగా జరిగాయి. ఆదివారం భోగి మొదలు మంగళవారం కనుమ పండుగ వారకు పల్లెలు, పట్టణాలు పండుగశోభతో కళకళలాడాయి. భోగిమంటలు వేసుకోవడం, పిండివంటలు చేసుకోవడం, పిల్లలకు భోగి పండ్లు పోయడం, బొమ్మల కొలువులతో పలువురు ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు. ఉపాధి, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారంతా పండుగ వేళ స్వస్థలాలకు తరలివచ్చారు. స్వగ్రామాలకు వచ్చిన వారు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి వేడుకలు నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులకు పల్లెలు వేదికగా మారిపోయాయి. వివిధ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ యువత ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సంప్రదాయంగా ఎడ్ల పందాలు, వివిధ ఆటల పోటీలతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలతో కొత్త కళను సంతరించుకున్నాయి. ఆయా గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అలంకారాలు జరిగాయి. కొన్ని గ్రామాల్లో గ్రామదేవతలకు గ్రామోత్సవాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన వారు బుధవారం తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయప్పస్వామి దేవాలయాల్లో సోమవారం రాత్రి మకర జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. పడిపూజ జరిపారు. మంగళవారం కనుమ సందర్భంగా రైతులు పశువులను అలంకరించి పూజలు చేశారు. ఆలయాల్లో గోపూజలు ఘనంగా జరిగాయి.

ఎడ్ల పందాలు.. కబడ్డీ పోటీలు

సింగరకొండలో నిర్వహించిన తెప్పోత్సవం తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. బాపట్ల పరిధిలోని బీమావారిపాలెంలోని కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్ల బండి ప్రదర్శన పోటీలు ఆకర్షణగా నిలిచాయి. కర్లపాలెం మండలంలోని గణపవరంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో వేడుకగా మకర సంక్రాంతి పండుగను జరిపారు. పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్ల వారిపాలెంలో జాతీయ స్థాయి ఎడ్ల పందాల పోటీలు జరిగాయి. నిజాంపట్నంలో జరిగిన ముగ్గుల పోటీలకు లోక్‌సభ సభ్యుడు మోపిదేవి హాజరయ్యారు. కొండమంజులూరులో రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యే రవికుమార్ హాజరై క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

అన్నంబొట్ల వారిపాలెంలో జరుగుతున్న ఎడ్ల పోటీలు



- తీరంలో యథేచ్ఛగా పందాలు
- బరుల వద్ద ఎల్ఈడీ, ఫ్లడ్‌లైట్లు రూ.కోట్లలో చేతులు మారిన నగదు
- పేకాట, గుండాట, మద్యం అమ్మకాలు
- పోలీసుల ప్రేక్షక పాత్ర
- జాతీయ రహదారిపై పార్కింగ్.. చోదకుల ఆగ్రహం
- జూదరులను ఉత్సాహపరిచేందుకు రికార్డింగ్ డాన్సులు
- ఎంపీ మోపిదేవి.. మంత్రి నాగార్జున ఇతర నేతలు వీక్షణ
- ముస్సాపురంలో ఓ మహిళా నేత ఆధ్వర్యంలో బరి.. భారీగా పందాలు

కాదన్నా.. కోడ్ఢీ

పోలీసులు కాదన్నా.. కోళ్లు కత్తులు దూశాయి. కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించినా.. నిర్వాహకులు బరితెగించారు. రూ.కోట్లు చేతులు మారాయి. కోడి పందాల నిర్వహణలో వైసీపీ నేతలు పంతం నెగ్గించుకున్నారు. ఆదివారం పలు చోట్ల వైసీపీ ద్వితీయ శ్రేణి నేతల కనుసన్నల్లో ప్రారంభమైన పందాలు మంగళవారం వరకు యథేచ్ఛగా సాగాయి. బరుల నిర్వాహకులుగా మారిన వైసీపీ ద్వితీయశ్రేణి నేతలకు కాసుల వర్షం కురిపించాయి. పందాలు వేసేందుకు, చూసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు అటు కృష్ణా, ఇటు ప్రకాశం జిల్లావాసులే కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి కూడా పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి కోళ్ల కొట్లాటలను ప్రదర్శించగా, ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో రాత్రిళ్లు కూడా పందాలు జోరుగా సాగా యి. గుండాట, పేకాట, మట్కాలాంటి ఇతర జూద క్రీడలు అడ్డే లేకుండా జరిగాయి. పండుగ ముందు హడావిడి చేసిన పోలీసులు మూడు రోజుల పాటు ప్రేక్షకపాత్రకే పరిమితమ య్యారు. కొన్నిచోట్ల పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే బరులు ఏర్పాటు చేసి పందాలు వేసినా అటువైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు.



కొల్లూరు : పెసర్లంకలో..



పెసర్లంక వద్ద బరిలో సాగుతున్న కోడి పందాలు

రేపల్లె, కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, జనవరి 16: సంక్రాంతి సంప్రదాయ ముసుగులో మూడు రోజులు యథేచ్ఛగా కోడిపందాలు జరిగాయి. ఆదివారం భోగితో ప్రారంభమైన కోడి పందాలు సంక్రాంతి, కనుమ రోజున తారస్థాయికి చేరాయి. కోడి పందాలను నిరోధించాల్సిన పోలీసులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మూడు రోజులు కూడా పత్తాలేకుండా పోయారు. కోడి పందాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన యంత్రాంగం పందాల బెట్టింగ్‌లను నిరోధించటంలో విఫలమైంది. సంక్రాంతి సందర్భంగా పెద్దసంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు రావడంతో కోడిపందాలు కోలాహలంగా జరిగాయి. బరుల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనసందోహం మధ్య కోడిపందాలు జోరుగా సాగాయి. బరుల వద్దే ఏర్పాటు చేసిన రింగాట, గుండాట, నెంబర్లాటల్లో కూడా భారీ స్థాయిలో పందాలు జరిగాయి. యువత ఎక్కువగా ఈ పందాల్లో పాల్గొని పందాలు కాశారు. నిర్వాహకులకు అన్ని కేసుల మద్యం ఎక్కడ నుంచి వచ్చాయో అంతుబట్టడం లేదని మందుబాబులే అన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వేమూరు మండలం వరహాపురం గ్రామంలో మంగళవారం జోరుగా కోడిపందాలు జరిగాయి. ఇక పల్నాడు జిల్లా పెదకూ రపాడు మండలం ముస్సాపురంలో కూడా కోడి పందాలు యథేచ్ఛగా సాగాయి. అధికార పార్టీకి చెందిన షాడో సర్పంచ్ అయిన ఓ మహిళా నేత బరి దగ్గర ఉండి మరీ పందాలను చేపట్టారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు మండలాల నుంచి జూదరులు ఇక్కడకు కోళ్లతో తరలి వచ్చారు. ఎప్పటిలాగే పోలీసు యంత్రాంగం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీంతో యథేచ్ఛగా కోడిపందాలతో పాటు గుండాట నిర్వహించారు.

పేకాటకు ప్రవేశ రుసుం.. రూ.10 వేలు

నిజాంపట్నం, 216 జాతీయ రహదారి సమీపంలోని బరుల వద్ద కోతముక్క, లోనబయట ఆటల కోసం గుడారాలతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఇతరులు అటు రాకుండా చేశారు. అంతేగాకుండా లోపలివారు బయటకు కనపడకుండా ఏర్పాట్లు చేశారు. ఇక ఇందులో ప్రవేశానికి రూ.10 వేలు వసూలు చేశారు. ఆ మొత్తం కట్టిన వారికే లోపలకు ప్రవేశ అనుమతి ఉండేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇందులో హైటెక్ క్లబ్‌లలో ఉండే వసతులను ఏర్పాటు చేశారని సమాచారం. ప్రత్యేకంగా టేబుల్స్ వేసి భారీ స్థాయిలో పేకాట నిర్వహించారు.

నిజాంపట్నంలో 17కిపైగా బరులు

నిజాంపట్నం, 216 జాతీయ రహదారి పక్కనే బరులు ఏర్పాటు చేసి మరీ కోడిపందాలు, పేకాట, కోతముక్కాట, నెంబర్లాట నిర్వహించారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగ సందర్భంగా రెండు ప్రాంతాల్లోని 17కిపైగా వేసిన బరుల్లో కోడిపందాలు జరిగాయి. పోలీస్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయానికి సమీపంలోనే కోడిపందాలను వేసినా పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. మూడు రోజుల్లో సుమారు రూ.60-70 కోట్లు బెట్టింగ్‌లు జరిగి ఉంటాయని నిర్వాహకులు అంచనా వేశారు. వీఐపీ బరిలో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల పందాలు సాగాయి. రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు 5 బరుల్లో బెట్టింగ్‌లు నిర్వహించగా, రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 8 బరుల్లో పందాలు జరిగాయి. సోమవారం నిజాంపట్నంలో పందాలను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు వీక్షించారు. నిజాంపట్నం వద్ద బరి వద్ద వీక్షకులను, జూదరులను ఉత్సాహపరిచేందుకు మంగళవారం నెల్లూరు, విజయవాడల నుంచి 15 మంది తీసుకువచ్చి రికార్డింగ్ డాన్సులను వేయించారు. వీరి నృత్యాలకు మద్యం మత్తులోనే జూదరులు చిందులు వేశారు. 216 జాతీయ రహదారిపైనే ద్విచక్రవాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. దీంతో హైవేపై రాకపోకలకు అంత రాయం కలిగింది. దీంతో వాహన చోదకులు పార్కింగ్ ప్రాంతం లో ఉన్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక బరుల వద్దే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. బీర్లతో పాటు అన్ని బ్రాండ్ల మద్యం ఇక్కడ లభించును అని ప్రత్యేక బోర్డులను ఏర్పా టు చేసి నిర్వాహకులు అమ్మకాలు చేపట్టారు. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.300లకుపైనే అధికంగా వసూలు చేశారు. అయినా అటువైపు సెబ్ అధికారులు రాలేదు.

మంత్రి మేరుగ, మోపిదేవి సమక్షంలో..

కొల్లూరులో మూడు రోజుల పాటు సాగిన పందాల్లో వరుసగా ఒకే రోజు నాలుగు పందాలు గెలిచిన వారికి నిర్వాహకులు రోజుకో బుల్లెట్‌ను ప్రత్యేక బహుమతిగా అందజేశారు. చిన్నారులు సైతం తమ తల్లిదండ్రులతో పాటు పందెం పుంజులు తీసుకువచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కొక్క పందెం రూ.10 వేలు నుంచి రూ.5 లక్షల వరకు సాగాయి. మంగళవారం మధ్యాహ్నం మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున కోడి పందాల బరి వద్దకు వచ్చి కొంతసేపు పందాలను తిలకించారు. భట్టిప్రోలు మండలంలోని ఓలేరు వద్ద జాతీయ రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన బరుల వద్దకు గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలతో పాటు విశాఖ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి జూదరులు తరలివచ్చారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పందాలు సాగాయి. మద్యం దుకాణం ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయించారు. మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావులతో పాటుగా మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఓలేరులో జరుగుతున్న కోడిపందాలను తిలకించేందుకు విచ్చేశారు.



ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కోత ముక్క



నెంబర్లాట



నిజాంపట్నంలో బరి వద్ద మద్యం విక్రయాల స్టాల్



బరిలో ప్రత్యేక బహుమతిగా ఉంచిన బుల్లెట్ వాహనం



పందెం కొట్టి.. కోడిని చేత బట్టి

రైతు కంట్లో కారం



మిర్చి ధర డమాల్

- క్వింటాల్ రూ.14 వేలు దిగువకు
- పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి
- కారణాలు లేకుండానే తగ్గించిన వ్యాపారులు
- ఇప్పుడు విక్రయిస్తే ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం

గుంటూరు సిటీ, జనవరి 16: తుఫాను.. తెగుళ్లు.. పడిపోయిన ధరలు.. మిర్చి రైతుల కంట్లో కారం కొట్టాయి. తుఫాన్ ప్రభావంతో దిగుబడులు తగ్గిపోయాయి. వర్షాభావం, తెగుళ్లతో పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో మిర్చి ధర పాతాళానికి పడిపోయింది. కారణాలు లేకుండానే వ్యాపారులు ధరలు పూర్తిగా తగ్గించేశారు. సీజన్ ఆరంభంలో తాలు కాయలే (తెల్ల కాయలు) క్వింటా రూ.13 వేల వరకు పలికింది. మంచి కాయలు క్వింటా రూ.17 వేల వరకు పలికాయి. ఇప్పుడు మంచి కాయలు ఆర్మూరు రకం క్వింటా రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు కొంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఆర్మూరు రకాన్నే సాగు చేశారు. ఈ రకం తాలుకాయలు క్వింటా రూ.7 వేల వరకు పలుకుతోంది. తేజ రకం కూడా రూ.18 వేలు మాత్రమే. రైతు చేతికి పంట వచ్చే సమయానికి ధర పతనం కావటం రైతులకు కన్నీరు తెప్పిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మిర్చి ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరకు పంటను విక్రయిస్తే పెట్టుబడులు కూడా రాకపోగా ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. గుంటూరు యార్డు దాకా తీసుకు వచ్చినా ఆశించిన స్థాయిలో ధర పలకక పోవడంతో ఊర్లలోనే వచ్చిందే చాలనుకుని అమ్మేసుకుంటున్నారు. మిర్చి రైతు కంట కన్నీరు కారుతున్నా మద్దతు ధర కల్పించే విషయంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉండడం విమర్శలకు తావిస్తోంది.

తుఫాను.. తెగుళ్లు

గత ఏడాది మిర్చికి మంచి ధర పలికింది. ఈ ఏడాది కూడా ధర అంతే ఉంటుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు మిర్చి సాగుకు మొగ్గు చూపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ సారి చెప్పుకోదగ్గ స్థాయిలో మిర్చి సాగుచేశారు. అత్యధిక స్థాయిలో పల్నాడు జిల్లాలో 57,585 హెక్టార్లలో మిర్చి సాగుచేశారు. అయితే తుఫాను తాకిడికి గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మిర్చి పంట బాగా దెబ్బతింది. పల్నాడులో మాత్రం తుఫాను తాకిడి ఉన్నప్పటికీ పంటకు చెప్పుకోదగ్గ నష్టం జరగలేదు. కానీ కొత్త కొత్త తెగుళ్లు ఆశించాయి. తెగుళ్ల ప్రభావం దిగుబడిని పూర్తిగా తగ్గించేసింది. ఎప్పుడూ ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే పొలాలు ఇప్పుడు 20 క్వింటాళ్లకే పరిమితమయ్యాయి. తెగుళ్ల ప్రభావంతో పెట్టుబడి భారీగా పెరిగింది. కోత కూలీ కాకుండానే ఒక్కో ఎకరానికి రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు.

భారంగా మారిన కోత కూలి

పంటకు సరైన మద్దతు ధర లేక దిగాలు ఉన్న రైతును కోత కూలి మరింత కుంగదీస్తోంది. ప్రస్తుతం కోత కూలి కింద రోజుకు ఒక్కొక్కరికి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. క్వింటా మిర్చి కోసినందుకు కూలి కింద రూ.5000 వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. తేజ రకం మిర్చిని సాగుచేసిన వారికి సన్న కాయలు కావడంతో కోత కూలి ఎక్కువగా ఉంటుంది.

తాలు కాయలే అధికం

తుఫాను తర్వాత పల్నాడు జిల్లాలో మిర్చి రైతు లకు కొత్త అనుభవం ఎదురైంది. ఒకే చేలో ఒకే విత్తనం నాటినా కొన్ని చోట్ల తాలు కాయలు ఎక్కువగా కనపడుతున్నాయి. పక్క పక్క పొలంలోనే ఇటువంటి మార్పు కనపడుతోంది. తాలు కాయలు ఎక్కువ అయితే రైతు మరింత నష్ట పోవాల్సిందే. ఒక ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే అందులో 5 క్వింటాళ్ల వరకు తాలుకాయలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

అప్పుడు అమ్ముకోక.. ఇప్పుడు అమ్ముకోలేక..

మంచి ధర వస్తుందన్న ఆశతో కొందరు రైతులు మిర్చిని శీతల గిడ్డంగిల్లో ఉంచారు. సీజన్ ఆరంభంలో తేజ కాయలు క్వింటా రూ.25 వేల వరకు వెళ్ళింది. పంట దిగుబడి తక్కువగా వస్తున్నందున ధర ఇంకా పెరుగుతుందన్న అంచనా తో అప్పుడు చాలామంది అమ్ముకోలేదు. ఇప్పుడు అదే తక్కువ పడుతుండటంతో దిక్కుతోచని పరిస్థితిలో మిర్చి రైతులున్నారు.

వైసీపీ దాడి

వినుకొండలో ఉద్రిక్తత

- పోలీసులు దగ్గరుండి ఉసిగొల్పారన్న జీవీ
- బలగాలతో ఆస్పత్రి వద్ద పోలీసుల పహారా





గాయాలతో టీడీపీ నాయకుడు అక్బర్‌బాషా ,చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్

వినుకొండటౌన్, జనవరి 16: పాతకక్షల నేపథ్యంలో పథకం ప్రకారం వైసీపీ నాయకులు కాపుకాసి టీడీపీ నాయకులపై మంగళవారం దాడి చేశారు. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. ఆరు నెలల క్రితం నరసరావుపేట వరవకట్టకు చెందిన టీడీపీ నాయకుడు ఇమ్రాన్‌ఖాన్‌కు వినుకొండకు చెందిన వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు కేసులు నమోదు చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఇమ్రాన్‌ఖాన్‌ను రాజీ చర్చలకు వినుకొండకు పిలిచారు. ఈ క్రమంలో వైసీపీకి చెందిన బొల్లా అనుచరుడు పీఎస్‌ఖాన్ తన వర్గీయులతో కలిసి ఇమ్రాన్‌ఖాన్‌పై దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, అక్బర్‌బాషా, ఆలీ, కరిముల్లా, బాజీ తదితరులు సంఘటనా స్థలికి చేరుకుని గాయపడిన ఇమ్రాన్‌ను వైద్యశాలకు తరలించేందుకు యత్నించారు. ఈ సమయంలో అక్కడ కాపుకాసిన వైసీపీ వర్గీయులు, షమీమ్, ఆయూబ్‌ఖాన్‌లే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. దీంతో షమీమ్, అక్బర్‌బాషాలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఆస్పత్రి వద్ద పోలీసుల బందోబస్తు

వైసీపీ నాయకుల దాడి తెలిసి పట్టణంలోని ముస్లింలు పెద్దసంఖ్యలో ఆస్పత్రి వద్దకు చేరి ఆందోళన చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్పీ ఆదేశాలతో ఆస్పత్రి వద్దకు నరసరావుపేట డీఎస్పీ మహేష్ వివిధ పోలీస్‌స్టేషన్ల పోలీసులతో చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద ఆందోళనకారులతో డీఎస్పీ చర్చలు జరిపారు. ఫిర్యాదు చేస్తే సమగ్ర విచారణ జరిపి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ముస్లింలు ఆందోళన విరమించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆస్పత్రి వద్ద పహారా కాశారు.

బొల్లా దాడి చేయించారు : ఆయూబ్‌ఖాన్

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తమపై దాడి చేయించారని ఆయూబ్‌ఖాన్ ఆరోపించారు. గంజాయి మత్తులోని యువకులు తాము చెప్పేది వినకుండా కర్రలతో, రాళ్లతో దాడి చేశారన్నారు. టీడీపీ వారిని చెదరగొట్టిన పోలీసులు వైసీపీ వారిని ఉసిగొల్పడంతోనే తీవ్రస్థాయిలో దాడి జరిగిందన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న జీవీ ఆంజనేయులు, ముస్లింలు

దాడిని ఖండించిన జీవీ

వైసీపీ వర్గీయుల దాడిని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఖండించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బొల్లా భయాందోళనను సృష్టించేందుకు దాడులకు తెగబడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే బొల్లాకు బుద్ధి చెబుతారని తెలిపారు.


అనంతవరంలో సందడి చేసిన సినీ నటి లయ

అనంతవరంలో సినీ నటి లయ సందడి

యద్దనపూడి(మార్టూరు), జనవరి 16: ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న నేటి సమాజంలో ఐదుగురు అన్నదమ్ములు కలిసి ఉండాలనే కోరికతో పల్లెటూరులో అపార్ట్‌మెంట్‌ను నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈ అన్నదమ్ముల కుటుంబాలు కలిసిమెలిసి ఉండటంపై అందరూ ప్రత్యేకంగా చర్చించుకుంటూ ఉంటారు. అయితే, మండలంలోని చి లుకూరి వారిపాలెంలో సినీ దర్శకుడు అనిల్ రావిపూడి నివాసానికి సోమవారం వచ్చిన సినీ నటి లయ ఈవిషయాన్ని తెలుసుకొని స్వయంగా అనంతవరం గ్రామానికి వచ్చి ఉమ్మడి కుటుంబంలోని సభ్యులుతో, ముఖ్యంగా మహిళలతో కొద్దిసేపు గడిపారు. కుటుంబ సభ్యులను అభినందించారు. గ్రామంలోని గుదే తారకరామారావు, గుదే పాడు రంగారావు, గుదే శ్రీనివాసరావు, గుదే వెంకటసుబ్బారావు, గుదే హరిప్రసాదరావు సొంత అన్నదమ్ములు. వారందరూ పెద్ద భవంతిని నిర్మించుకొని అక్కడే నివాసం ఉంటున్నారు.

పెదఅంబడిపూడిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వవిద్యార్థులు

బల్లికురవ, జనవరి 16: ఎంత ఉన్నత స్థితిలో ఉన్న చిన్నతనంలో చదువుకున్న పాఠశాలను, చదువుచెప్పిన గురువును మరిచిపోలేమని పూర్వ విద్యార్థులు తెలిపారు. సోమవారం మండలంలోని పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాలలో 1998-1999 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సంక్రాంతి పండుగ సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాత గుర్తులను నెమరవేసుకొని అందరి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అప్పట్లో తమకు చదువుచెప్పి ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్న ఉపాధ్యాయులు నారాయణ, షరీఫ్, సాంబయ్య, సుబ్బారెడ్డి, సాంశివరెడ్డిను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పీవీ రాయుడు, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, విజయ్, అనిత, రాధిక, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


తెప్పోత్సవంలో విహరిస్తున్న చెన్నకేశవ స్వామి

మార్టూరు, జనవరి 16: సంక్రాంతి పండుగ సంబరాలను మండలంలోని గ్రామా లలో ఘనంగా జరుపుకున్నారు. రాజుపాలెం గ్రామంలో శ్రీకోదండ రాముని దేవస్థా నంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామోత్సవం చేశా రు. చెరువులో భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించారు. అదేవిధంగా యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో శ్రీభూసహిత చెన్న కేశవ స్వామి వారిని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఊరచెరువులో తెప్పోత్సవం నిర్వహించారు.

చినగంజాంలో.. చినగంజాం, జనవరి 16: మండలంలో సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించారు. మున్నంవారిపాలెం గ్రామంలోని లక్ష్మణ సీతా రామస్వామి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి మున్నంవారిపాలెం, చినగంజాం, మూలగానివారిపాలెం గ్రామ ప్రధాన వీధులలో ఊరేగించారు. తదనంతరం బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని చెరువులో తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే, పలు గ్రామాల్లో పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

కశ్యాపురంలో తెప్పోత్సవం

పంగులూరు, జనవరి 16. మండలంలోని కశ్యాపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం సాయంత్రం తెప్పోత్సవం నిర్వహించారు. ఊరేగింపుగా తరలివచ్చిన దేవతామూర్తులకు మహిళా భక్తులు హారతులిచ్చి భక్తిని చాటుకున్నారు.

దామచర్లను కలిసిన నాయకులు


జనార్దన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ, జనవరి 16 : మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను టీడీపీ మండల నాయకులు సోమవారం కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 18వ తేదీన దొనకొండలో భారీ స్థాయిలో నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని దామచర్లను వారు ఆహ్వానించారు. కా ర్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, వీవీకే చౌదరి, తోటా కేటేశ్వరరావు, బత్తుల గా లయ్య, షేక్ సుభాని, ఫణిదపు

అభివృద్ధి, సంక్షేమానికి పుట్టినిల్లు టీడీపీ


సూపర్ సిక్స్ పథకాలపై వేసిన ముగ్గు

పామూరు, జనవరి 16 : అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి టీడీపీ పుట్టినిల్లు లాంటిదని ఆ రెండూ పార్టీకి కళ్లలాంటివని టీఎన్ఎస్వీ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు అన్నారు. మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ వేడుకల కోసం సొంత ఊళ్లకు వచ్చిన వారిని టీ డీపీ నేతలు కలిసి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే చేసే అ భివృద్ధిని, నాలుగన్నరేళ్ల వైసీపీ అరాచక, అవినీతి పాలనను వివరించారు. మహిళాశక్తి, సూ పర్‌సిక్స్ పథకాలపై ముగ్గుల రూపంలో వేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోకా మాట్లాడుతు టీడీపీ ఆరు పథకాలతో కలిగే ప్రయోజనాలపై చైతన్యం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల కష్టాలు తీర్చేందుకు చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబును, కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పందెం కోడ్ఢీ


పందెం కోసం కోడితో రెడీగా ఉన్న వ్యక్తులు

- జిల్లావ్యాప్తంగా జూదం
- యథేచ్ఛగా బరుల ఏర్పాటు
- సంక్రాంతికి మారిన సంప్రదాయం
- కోడికి రూ.500, కత్తికి రూ.500 వసూలు
- కొన్ని చోట్ల ముక్కుపిండి ప్రవేశ రుసుం
- వందల మంది చేరి ఆడుతున్నా పోలీసుల ప్రేక్షకపాత్ర
- అధికార పార్టీ నేతల అండతోనే
- లక్షల్లో చేతులు మారిన పైనం
- భారీగానే నడిచిన పేకాట శిబిరాలు

జిల్లాలో పందెం కోళ్లు తొడకొట్టాయి. లక్షల్లో డబ్బులు చేతులు మారాయి. ఇంతస్థాయిలో బరులు ఏర్పాటు కావడం ఇదే తొలిసారి. పలు గ్రామాల్లో ఆది, సోమ, మంగళవారాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. అధికారపార్టీకి చెందిన నాయకుల అండతో పందెంరాయుళ్లు రెచ్చిపోయారు. మేముండగా మీకెందుకు భయం.. ఏం జరిగినా మేం చేసుకుంటాం.. మీరు మమ్మల్ని చూసుకోండి అంటూ పెద్ద నేతలు అభయమివ్వడంతో మూడు రోజులుగా జిల్లాలోని పలు గ్రామాల్లో గోదావరి స్థాయిలోనే బరులు నడిచాయి. పండుగకు ముందురోజు కోడి పందేలు, పేకాట ఆడితే కఠినచర్యలు తీసుకుంటామని చేసిన పోలీసుల హెచ్చరికలను ఎవరూ లెక్కచేయలేదు. తమ అనుయాయులతో ఎక్కడికక్కడ యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట శిబిరాలను నేతలు దగ్గరుండి ఏర్పాటు చేశారు.

ఒంగోలు(క్రైం), జనవరి 16: సంప్రదాయం ఆటలు కాదని జిల్లాలో కోడి పందేలు, పేకాట తదితరాలతో సంక్రాతి పండుగ జోరుగా హుషారుగా సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కడ చూసిన బరులను బాహాటంగా ఏర్పాటు చేసి పందేలు వేయడం విశేషం. పైపెచ్చు మద్యం ఏరులై పారింది. ప్రధానంగా ఒంగోలు నగరానికి సమీపంలోనే పందేలను యథేచ్ఛగా నిర్వహించారు. వేల మంది అక్కడకు చేరినా కనీసం పట్టించుకునేవారు కరువయ్యారు. ఎస్పీ మలికగర్గ్ కోడి పందేలు వేస్తే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేసినా పందేల నిర్వాహకులు లెక్కపెట్టలేదు. ఆధికారపార్టీ నాయకుల అండదండలు ఉండటంతోనే బరితెగించి బరులు నిర్వహించారు. అంతేకాదు నేరుగా చోటామోటా నాయకుల కనుసన్నలలో కోడిపందేలు వేయడం గమనార్హం. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పందేలు వరుసగా మూడు రోజులు వేయడం పెద్దఎత్తున పైపందేలు నడవడం, లక్షల్లో నగదు చేతులు మారడం చోటుచేసుకుంది. ఉదాహరణకు కొత్తపట్నం మండలం గౌడ్లపాలెంలో మూడు రోజులపాటు కోడి పందేలు జోరుగా సాగాయి. చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో బరి ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారులకు తెలిసినప్పటికీ మిన్నకుండిపోవడం చర్చనీయంశంగా మారింది. అంతేకాదు వరసగా బరులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పైపందేలు వేస్తుంటే చూస్తూ ఉండిపోవడం నిస్సహయతా లేక పచ్చజెండా ఊపడమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అంతేకాదు బరులు వేసేవారి నుంచి పోలీసులకు ప్యాకేజీలు ముట్టాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

లక్షల రూపాయలలో పైపందేలు

కోడి పందేల కంటే పైపందేలు లక్షల్లో నడిచాయి. బరి వద్ద సకల సౌకర్యలు ఏర్పాటు చేశారు. అక్రమంగా మద్యం విక్రయించడం, అందుకు అనుమతి ఇచ్చినందుకు రోజుకు రూ.10వేలకుపైనే బరి నిర్వాహకుడికి ఇచ్చినట్లు సమాచారం. అంతేకాదు బిర్యానీలు, మటన్, చికెన్ వంటకాలు బండ్లపై పెట్టుకుని విక్రయించేవారు రూ.10వేలు చెల్లించాలి. ఇతర వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి. ఇలా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా బరులు మారినా, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పండుగకు ముందు రోజు ఎస్పీ మలికగర్గ్ ఓ ప్రకటన విడుదల చేశారు. కోడి పందేలు వేస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అయితే మూడు రోజులు వరుసగా ఒకేచోట పందేలు అధికారబలంతో నిర్వహిస్తే ఏమి చర్యలు తీసుకున్నారనేది ప్రశ్నార్థకమే. అసలు సమాచారం ఇచ్చిన వారికి ఎదురైన మర్యాద ఏమిటి.. ఇలా అనేకం చర్చనీయాంశంగా మారాయి. అంతేకాదు కోడి పందేలలో పై పందేలు వేసి లక్షలు పోగొట్టుకున్న వారు అనేక మంది ఉన్నారు.

పశ్చిమ ప్రాంతంలోనూ భారీగా..

జిల్లాలో పశ్చిమ ప్రాంతాలతోపాటుగా మైదాన ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాలలో కోడి పందేల జోరు సాగింది. ముందుగా పందెంరాయుళ్లకు సమాచారం ఇచ్చి పందేలు వేయడం విశేషం. అయితే 'పండుగ కదా పోనివ్వడి' అని పోలీసు అధికారులు చెప్పడం చూస్తే కోడి పందేలకు పోలీసులే పచ్చజెండా ఊపారా అనే అనుమానాలు ఉన్నాయి. సింగరాయకొండ మండలం పాకల సమీపంలోని పట్టపుపాలెం, ఒంగోలు రూరల్ మండటం కనపర్తి, కొత్తపట్నం మండలం గౌండ్లపాలెం, మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు, చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడు ఇలా అనేక ప్రాంతాల్లో కోడి పందేలు భారీ ఎత్తున సాగాయి. వందలమంది రోజంతా అక్కడే తిష్ట వేసి పందేలను తిలకించారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే జిల్లావ్యాప్తంగా పేకాట శిబిరాలు కూడా మూడు రోజుల పాటు కోలాహలంగా సాగాయి. అక్కడ కూడా భారీ ఆటలు నడిచాయని, లక్షల్లో నగదు చేతులు మారాయని సమాచారం.

అధికార పార్టీ నాయకుల అండతో.

పీసీపల్లి, జనవరి 16 : మండలంలోని లక్ష్మక్కపల్లి, భట్టుపల్లి, ఇర్లపాడు పరిసర ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. కోడిని తెచ్చిన వ్యక్తి నుంచి రూ.500, కత్తి కడితే రూ.500 చొప్పున నిర్వాహకులు వసూలు చేశారు. పందేలు జరుగుతున్న సమయంలో చూసేందుకు వెళ్లిన వారు పందెం కాసి వేలల్లో నష్టపోయినట్లు చెప్తున్నారు. కొన్ని బరుల వద్ద ప్రవేశ రుసుం పేరుతో నగదు వసూలు చేసినట్లు సమాచారం. లక్షల్లో పందేలు సాగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. బరుల వ్యవహారాన్ని కొంత మంది సోషల్ మీడియాలో పెట్టడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం పీసీపల్లి ఎస్ఐ జి.కోటయ్య సిబ్బందితో భట్టుపల్లి సమీపంలో జరుగుతున్న పందెం వద్దకు వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేవలం రెండు కోళ్లు, రూ.2,250ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వెలిగండ్లలో జోరుగా కోడి పందేలు

వెలిగండ్ల, జనవరి 16 : పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా అధికార వైసీపీ నాయకులు కోడి పందేలను జోరుగా నిర్వహించారు. పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని చెప్పిన పోలీసు, రెవెన్యూ అధికారులు పరోక్షంగా చూసీచూడనట్లు వ్యవహరించడంతో అధికార వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో గ్రామాలు పందేలు యథేచ్ఛగా సాగాయి. వెదుళ్లచెరువు, రాళ్లపల్లి, కవ్వంపాడు గ్రామాల శివారులో మూడు రోజులుగా కోడి పందేలు, జూదం జరిగినా అటువైపు పోలీసులు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్థులు అంటున్నారు. లక్షలు ఇచ్చి కోడి పందేలకు అనుమతి తెచ్చుకున్నట్లు నిర్వాహకులు బహిరంగంగా చెప్తున్నారు.


పారువేట ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు

ఉత్సాహంగా సంక్రాంతి పండుగ

ఒంగోలు(కల్చరల్), జనవరి 16 : జిల్లావ్యాప్తంగా సంక్రాతి సంబరాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పండుగ సందర్భంగా పల్లె మొదలు నగరాల వరకు సందడి వాతావరణ నెలకొంది. తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతికి ఇతర రాష్ట్రాలు, దేశాలలో ఉన్న జిల్లావాసులు స్వగ్రామాలకు చేరుకోవటంతో ప్రతి ఊరిలో పండుగ వాతావరణ నెలకొంది. మరోవైపు భోగి, సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని చిన్న, పెద్ద దేవాలయాలకు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆటపాటలు, ఎడ్లు, పొట్టేళ్ల పోటీలు చూడటానికి ప్రజలు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఇక గాలిపటాలు ఎగురవేస్తూ చిన్నారులు ఆనందంతో కేరింతలు కొ ట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలలో యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేసింది. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని పలు ప్రసిద్ధ ఆలయాలతో పాటు, మార్కాపురం, భైరవకోన, త్రిపురాంతకం, మిట్టపాలెం, సింగరాయకొండ, రామతీర్థం మొదలైన ఆలయాలకు భ క్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

మద్దిశెట్టి దారెటు..?

- ప్రత్యామ్నాయ అవకాశాలపై అన్వేషణ
- అనుచరులతో స్వగ్రామంలో సమావేశం
- సోదరు లిక్కడ, తాడేపల్లిలో వేణుగోపాల్
- ఎంపీ లేదు.. ఒంగోలు ఎమ్మెల్యే అయితే పరిశీలిస్తాం
- మూడురోజుల్లో నిర్ణయం అంటూ అనుచరులకు సంకేతం
- నేడు బూచేపల్లి సమావేశంతో వేడెక్కిన రాజకీయం
- ఎర్రగొండపాలెం వైసీపీలో ఫ్లెక్సీల రగడ


ఎమ్మెల్యే మద్దిశెట్టి ఇంటికి భారీగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సిటింగ్ సీటు లేదనటం, మరో సీటు అడిగితే సానుకూలంగా స్పందించక పోవటం, చివరికి కొత్త ఇన్‌చార్జికి సహకరించమన్న విజ్ఞప్తి లేకపోవటం.. వెరసి తీవ్ర అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఎలా ముందుకు పోవాలన్న అంశంపై దృష్టిసారించారు. అటు ప్రత్యామ్నాయంగా వేరే అవకాశం ఇవ్వమని అధిష్ఠానాన్ని కోరుతూనే ఇటు నియోజకవర్గంలో అనుచరులు చేజారిపోకుండా చేసుకునే ప్రయత్నం ప్రారంభించారు. మరోవైపు వైపాలెంలో ప్రస్తుత ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఫొటోలు వరకు ఫ్లెక్సీలలో కనిపించకుండా చించివేయటం వైసీపీలో సరికొత్త వివాదానికి దారితీసింది.

స్వగ్రామంలో అనుచరులతో సమావేశం

తన స్వగ్రామమైన పామూరు మండలం లక్ష్మీనరసాపురంలో ఆయన దర్శి నియోజకవర్గంలోని అనుచరులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. అయితే చివరిక్షణంలో ఆయన హాజరుకాకుండా ఆయన తరఫున సోదరుడు శ్రీధర్, మరో సోదరుడు హాజరయ్యారు. ఎంపీ విజయసాయిరెడ్డి నుంచి వచ్చిన పిలుపుతో ఎమ్మెల్యే వేణుగోపాల్ తాడేపల్లి వెళ్లారని సమావేశానికి వచ్చిన అనుచరులతో శ్రీధర్ తెలిపారు. ముండ్లమూరు, తాళ్లూరు ఎంపీపీలతోపాటు కురిచేడులో అనధికారికంగా ఎంపీపీ పాత్ర పోషిస్తున్న నాయకుడు, దర్శి ఏఎంసీ చైర్మన్, మాజీ చైర్మన్లతోపాటు ఆయా మండలాల పార్టీ కన్వీనర్లు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు హాజరైన వారిలో ఉన్నారు. మనకు దర్శిలో తిరిగి టిక్కెట్ ఇవ్వలేదు, ఇక్కడ చూస్తే శివప్రసాదరెడ్డి నుంచి కనీస పలకరింపు కూడా లేదు. అందుకే మనందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుందాం వేచి ఉండండని శ్రీధర్ ఆ సమావేశానికి వెళ్లిన నాయకులతో స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వేణుగోపాల్ రాజకీయంగా ఎలాంటి ముందడుగు వేసినా మీరందరూ సహకరించాలి అంటూ దర్శి నియోజకవర్గాన్ని వదిలే ప్రసక్తిలేదని తేల్చిచెప్పినట్లు కూడా తెలుస్తోంది. గురు, శుక్రవారాల్లోనే ఎమ్మెల్యే నియోజకవర్గంకు వచ్చి మనందరినీ కలుస్తారని కూడా వారు చెప్పినట్లు తెలిసింది.

ఎంపీ సీటుకు అవకాశం లేదన్న సంకేతం

మరోవైపు ఒంగోలు ఎంపీ టిక్కెట్ రెడ్లకే ఇవ్వాలన్న దృఢనిర్ణయంతో జగన్ ఉన్నట్లు తెలిసింది. తనకు ఒంగోలు ఎంపీగా పోటీచేసే అవకాశం ఇవ్వమని మద్దిశెట్టి కోరినప్పుడే జగన్ ఆ విధమైన సంకేతం ఇచ్చారని తెలుస్తోంది. అదే సమయంలో ఒంగోలు అసెంబ్లీ అయితే పరిశీలిస్తానని చెప్పినట్లు తెలిసింది. అయితే ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీచేసే ఆలోచన లేదని అవకాశం ఇస్తే ఎంపీగానే పోటీచేస్తానని మద్దిశెట్టి పార్టీ నేతలకు సమాచారం పంపారు. పార్టీలో ముఖ్యనేతల్లో ఒకరైన మంత్రి బొత్స మద్దతు వేణుగోపాల్‌కు ఉంది. దీంతో బుధ, గురువారాల్లో మరో ప్రయత్నం చేసి తదనంతరం తన నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో వేణుగోపాల్ ఉన్నారు. ఇదే సమయంలో మంగళవారం తాడేపల్లిలో ఒకరిద్దరు నాయకులను ఆయన కలిసినప్పుడు బూచేపల్లి నుంచి ఇంతవరకు తన సహకారం కావాలన్న విజ్ఞప్తి రాలేదని పార్టీ అధిష్ఠానం కూడా మా ఇద్దరినీ కూర్చోబెట్టి కలిసి పనిచేయండన్న సంకేతం కూడా ఇవ్వలేదని ఈ విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్నానని చెప్పినట్లు తెలిసింది. తద్వారా ప్రత్యామ్నాయ అవకాశం వైసీపీ ఇవ్వకపోతే తనదారి తాను చూసుకుంటానన్న సంకేతం మద్దిశెట్టి ఇచ్చినట్లుగానే పరిశీలకులు భావిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా వేరే ప్రధాన పార్టీలలో అవకాశం ఇస్తే పోటీకి సిద్ధపడటమా అదీ కుదరకపోతే కొంత కాలం రాజకీయాలకు దూరంగా ఉండటమా అన్న సంశయంలో ఉన్నట్లు తెలిసింది. అలా ఉండాల్సి వచ్చినా దర్శిలోని అనుచరులకు అండగా ఉండాలన్న భావనతో ఉన్నారని బూచేపల్లికి మాత్రం సహకరించకూడదన్న అభిప్రాయంతో ఉన్నారని తెలుస్తోంది.

నేడు బూచేపల్లి సమావేశం

కాగా బుధవారం దర్శిలో బూచేపల్లి పార్టీ సమావేశం ఏర్పాటుచేసి మద్దిశెట్టి అనుచరులను కూడా పిలిచారు. మంగళవారం సమావేశానికి వెళ్లిన వారికి కూడా ఈ సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానాలు వెళ్లాయి. విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి ప్రజలను తీసుకెళ్లే పేరుతో బూచేపల్లి ఈ సమావేశం ఏర్పాటుచేశారు. మద్దిశెట్టి ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లినవారిలో అత్యధికులు బూచేపల్లి ఏర్పాటుచేస్తున్న సమావేశానికి వెళ్ల కూడదని నిర్ణయించుకున్నారు.

వైపాలెంలో ఫ్లెక్సీల రగడ


వైపాలెంలో చంద్రశేఖర్ ఫ్లెక్సీని చించివేసిన గుర్తుతెలియని వ్యంకక్తులు

వైపాలెంలో నూతన ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఫొటోలను ఫ్లెక్సీలలో చించివేయటంతో ఈ నియోజకవర్గంలోని వైసీపీలో అంతర్గతంగా ఉన్న కుమ్ములాటలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల ఆయన మంత్రి సురేష్ లేకుండానే నియోజకవర్గంలోకి వెళ్లి పార్టీ నాయకుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైపాలెంలో ఒకరోజు మకాంవేసి నాయకులను కలిశారు. ఆ సందర్భంగా ఆయనకు స్వాగతం పలికే ఫ్లెక్సీలను వైపాలెంలో ఏర్పాటుచేశారు. అందులో మంత్రి సురేష్ కార్యాలయానికి వెళ్లేమార్గంలో ఉన్న ఐదింటిని గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. అదీ సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లోని ఫ్లెక్సీలలో ఇతర నాయకుల ఫొటోలకు ఇబ్బంది లేకుండా కేవలం చంద్రశేఖర్‌వి మాత్రమే చించివేశారు. దీంతో ఆ నియోజకవర్గ వైసీపీలో అంతర్గతంగా నెలకొన్న పోరు బయటపడింది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో కొత్త మలుపు తిరిగే అవకాశం కూడా లేకపోలేదు.

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

- వేతనాల పెంపుపై హామీ కాదు.. జీవో ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళనలు
- 36వ రోజుకు చేరిన సమ్మె


ధర్నా శిబిరం వద్ద గారెలు వండుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు నగరం, జనవరి 16: వేతనాల పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల పట్ల రాష్ట్రప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ వద్ద ఉన్న అంగన్‌వాడీల శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. మంగళవారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 36వ రోజుకు చేరింది. 24గంటల నిరవధిక దీక్షలు కూడా కొనసాగుతున్నాయి. సోమవారం పొదిలిలో అంగన్‌వాడీల శిబిరంలో మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒంగోలులో అంగన్‌వాడీల ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు వేతనాలు పెంచమని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం ఎంత పెంచుతుందో చెప్పటం లేదన్నారు. జూలైలో పెంచుతామని ప్రభుత్వం ఎన్నికల హామీలా చెబుతుందే గాని ఎంత పెంచుతుందో చెప్పటం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా అంగన్‌వాడీలకు నిర్దిష్టమైన హామీని ఇవ్వాలన్నారు. పండుగులను కుటుంబసభ్యులతో కాకుండా బజారులో జరుపుకునే దుస్థితిని అంగన్‌వాడీలకు ప్రభుత్వం కల్పించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి అంగన్‌వాడీల ఉసురు తగలకుండా ఉండాలంటే వెంటనే ముఖ్యమంత్రితో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని శ్రీనివాసరావు ప్రభుత్వానికి సూచించారు.కాగా అంగన్‌వాడీలు మంగళవారం జిల్లావ్యాప్తంగా తమ నిరసన కార్యక్రమాలను కొనసాగించారు. ఒంగోలులో శిబిరం వద్ద గారెలు తయారుచేసి తమ నిరసనను తెలియజేయగా గిద్దలూరు, పొదిలి తదితర ప్రాంతాల్లో వినూత్నంగా ఒంటి కాలిపై నిలబడి తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారు. ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ఒంగోలులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్ తదితరులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్సు అండ్ వర్కర్సు యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నపూర్ణ, సుబ్బమ్మ, ప్రశాంతి, నిర్మల, హేమీమా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి

- 30 ఏళ్లుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్
- విజేతలుగా నిలిచిన చెన్నై జట్లు

మేదరమెట్ల , జనవరి 16: గ్రామీణ ప్రాంతంలో 30 ఏళ్లుగా ఎంతో ఖర్చుతో కూడుకున్న క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆటలలో గెలుపు ఓటమిలు సహజమని, క్రీడాస్ఫూర్తే ముఖ్యమని అన్నారు. మంగళవారం రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ శ్రీ భమర సంక్రాతి కప్ 2024 ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, సినీనటుడు రఘుబాబు, శ్రీభ్రమర ఎండీ గల్ల రామచంద్రరావు, గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ చెన్నై హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ప్రతి సంవత్సరం పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు. శ్రీభమర ఎండీ గల్ల రామచంద్రరావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడం, క్రీడకారులను ప్రోత్సాహించడం తమకెంతో ఆనందమన్నారు. సినీనటుడు రఘుబాబు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధిలో నాగేశ్వరరావు పాత్ర ఎంతో ఉందన్నారు. గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షడు రమణమూర్తి మాట్లాడుతూ అంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరుపున స్టేడియం అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు.

సంక్రాంతి కప్ 2024 పోటీలలో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో సౌత్ సీసీ చెన్నై జట్టు, జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎ క్సైజ్ చెన్నై జట్టు, శ్రీసీసీ చెన్నై జట్టు నిలిచాయి విజేతలకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, భ్రమర ఎండీ గల్లా రామచంద్రరావు, సినీ నటులు రఘుబాబు, రమణమూర్తి, తిలక్, మురళీకృష్ణ తదితరులు చేతుల మీదుగా ట్రోఫి, నగదు బహుమతులు అందజేశారు.

సత్తా చాటిన చెన్నై జట్లు

రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భ్రమర సంక్రాంతి కప్ 2024 పోటీలలో మంగళవారం జరిగిన ఫైనల్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. మంగళవారం ఉదయం మూడో స్థానం కోసం జరిగిన పోటీలలో శ్రీసీసీ చెన్నై జట్టు విజేతగా నిలిచింది. సాయంత్రం జరిగిన ఫైనల్ పోటీల్లో సౌత్‌జోన్ సీసీ చెన్నై, జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జట్లు పోటీపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్‌సీసీ చెన్నై జట్టు నిర్ణీత 12



సౌత్‌జోన్ చెన్నై జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్, భ్రమర ఎండీ రామచంద్రరావు, సినీనటుడు రఘుబాబు



పంగులూరు: బళ్ళారి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీ నందిగం సురేష్, హనిమిరెడ్డి

ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ ఆరు వి కెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. 11 పరుగుల తేడాతో సౌత్ జోన్ సీసీ చెన్నై జట్టు విజేతగా నిలిచింది.

విజేత బళ్లారి జట్టు

పంగులూరు, జనవరి 16: మండలంలోని కొండమంజులూరులో జాతీయస్థాయి ప్రీమియర్ లీగ్ టీ20 క్రికెట్ పోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. సాయంత్రం జరిగిన ఫైనల్ పోటీలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బళ్ళారి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. 189 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసి ఓటమి పాలయింది.

బళ్ళారి జట్టు విజేతగా నిలువగా, శ్రీకాకుళం జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. ఉదయం మూడవ స్థానం కోసం జార్ఖాండ్, లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్ల మధ్య జరిగిన పోటీలో కామారెడ్డి జట్టు గెలు పొందింది. విజేతలకు ఎంపీ నందిగం సురేష్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేసీసీ ఛైర్మన్ కరణం స్వామి, కార్యదర్శి వెంకన్నబాబు, బీవీ కృష్ణారెడ్డి, సర్పంచ్ కొలకలూరి ప్రభాకర్, పులికం కోటిరెడ్డి, రవిబాబు, జంపని రాజేష్, వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న ప్రజల చిరకాల వాంఛ

- 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



కారంచేడు శివాలయంలో స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న పురందేశ్వరి

కారంచేడు(పర్చూరు), జనవరి 16: అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రజల చిరకాల వాంఛ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రధాని మోదీకి భగవంతుడు ఈసువర్ణ అవకాశాన్ని కల్పించారన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కారంచేడు వచ్చారు. తొలుత తెలుగు ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ తలపెట్టిన ఆలయాల పరిశుభ్రతలో భాగంగా సోమవారం గ్రామంలోని శివాలయంలో పార్టీ శ్రేణులతో కలసి స్వచ్ఛ భారత్ నిర్వహించారు.

ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పార్టీ పిలుపు మేరకు ఆలయాల పరిశుభ్రత కార్య క్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. అందులో భాగంగా ఆలయాన్ని శుభ్ర పరిచి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఇలాంటి మహత్తర కార్యక్ర మంలో బీజేపీ శ్రేణులతో పాటు, మనవళ్ళు, మనువరాలు పాల్గొనటం అనందంగా ఉందన్నారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, జనవరి 16: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మానానికి దేవదాయ రిటైర్డ్ ఈవో మేకా వెంకటేశ్వరరావు కుమారుడు అజయ్‌ఘోష్, రమాదేవి దంపతులు సోమవారం రూ.1,01,116 నగదును అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈవో మేకా వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేత

అద్దంకి, జనవరి 16: జనసేన పార్టీ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని 6వ వార్డులో మన ఊరు- మన ఆట కార్యక్రమంలో భాగంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ కాశీచరణ్, గోరంట్ల సాయి, అచ్యుత పున్నారావు, రామారావు, మురళీ, సుబ్బారావు, అనిల్, గోపి, వాసు, విజయ్ కార్తీక్, వెంకటరావు, సురేష్, చంద్ర పాల్గొన్నారు.

సీనియర్ మహిళా న్యాయవాది ఫణీంద్రాదేవి మృతి

అద్దంకి, జనవరి 16: అద్దంకి పట్టణంలో సీనియర్ మహిళా న్యాయవాది చిట్టాబత్తిన పణీంద్రాదేవి(76) మంగళవారం అనారోగ్యంతో విజయవాడలో మృతి చెందారు. సీనియర్ న్యాయవాది చిట్టాబత్తిన కనకసేనరావు జ్ఞాపకార్థం సతీమణి ఫణీంద్రాదేవి కమేేశ్వరస్వామి దేవాలయంలో సృజన సాహితీ పమావేశాలు నిర్వహణకు పురాన కాలక్షేప మండపం నిర్మాణం చేశారు. ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కుమారులు అమెరికాలో, కుమార్తె విజయవాడలో స్థిరపడ్డారు. ఆమె అంత్య క్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఫణీంద్రాదేవి మృతదేహం వద్ద పలు సాహితీ సంస్థలు ప్రతినిధులు, న్యాయవాదులు నివాళులర్పించారు.

మకరజ్యోతిని తిలకించిన భక్తులు

అద్దంకి, జనవరి 16: మకర సంక్రాంతి సందర్భంగా శింగరకొండ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద సోమవారం మకరజ్యోతి పూజా కార్య క్రమాలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి దేవాలయం ఎదురు అద్దంకి కొండపై ఏర్పాటు చేసిన మకరజ్యోతిని భక్తులు తిలకించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, తిరుపతిరెడ్డి గురుస్వామి, రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహాల గ్రామోత్సవం

బల్లికురవ, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో దేవతామూర్తుల విగ్రహాల గ్రామోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని కొణిదెన చెన్నకేశవస్వామి దేవాలయ ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అలాగే, మండలంలోని గుంటుపల్లి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, అంబడిపూడి, చెన్నుపల్లి, తదితర గ్రామాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా దేవాలయాల్లో ఉన్న దేవతామూర్తులు ప్రజల ఇళ్ల ముంగిటకు రావటంతో భక్తులు బిందెలతో నీళ్లపోసి హారతులు ఇచ్చారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'

పంగులూరు. జనవరి 16: వైసీపీ గెలుపునకు నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. పంగులూరులో వైసీపీ నేత స్వయంపు హనుమంతరావు నేతృత్వంలో జరిగిన పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతినేత పాటుపడాలని, ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని హనిమిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో కోటపాడు మాజీ సర్పంచ్ గోపాలరెడ్డి, గుడిపూడి రామానావు, అజీజ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో చీరాల క్రీడాకారుడి ప్రతిభ

చీరాల, జనవరి 16 : ఆల్ ఇండియా అంతర్ యూనివర్శిటీ బ్యాడ్మింటన్ పోటీలలో చీరాలకు చెందిన నోమేర్ ప్రతిభ కనబరిచి ప్రత్యేకత చాటుకున్నారు. ఈనెల 15వ తేది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అంతర్ యూనివర్శిటీల బాడ్మింటన్ పోటీలలో కేఎల్ యూనివర్శిటీ క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి రెండోస్థానంలో నిలిచారు. ఈ జట్టులో కీలకస్థానం పోషించిన నోమేర్ చీరాలకు చెందిన క్రీడాకారుడు. దీంతో పలువురు బ్యాడ్మింటన్ క్రీడాకారులు, అభిమానులు నోమేర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

చీరాల, జనవరి 16 : తెలుగేదేశం పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతలు వీరే!

మార్టూరు, జనవరి 16: మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన కబడ్డి పోటీలలో 23 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కోలలపూడి హిందూ గౌడ యూత్ జట్టు ప్రథమ స్థానాన్ని పొందగా రూ.20 వేలు, మార్టూరు శ్రీకృష్ణా యూత్ రెండవ స్థానాన్ని పొందగా రూ.15 వేలు నగదు, రామకూరు యూత్ జట్టు మూడవస్థానం పొందగా రూ. 10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్‌కుమార్, ఆర్. యేసయ్య, యడవల్లి సాంబశజవరావు, రాంబాబు, గాలి నాగేశ్వరరావు, నాగార్జున, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం అభినందనీయం

పంగులూరు, జనవరి 16: మండలంలోని నూజెళ్ళపల్లిలో నూతనంగా హిందూ శ్మశానవాటికను నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దాతల దాతృత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ శ్మశానవాటికను మంగళవారం రవికుమార్, దాతలు, వారి కుటుంబ సభ్యులతో కలసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన మద్దినేని ఆంజనేయులు సమకూర్చిన 23 సెంట్ల స్థలంలో అదే గ్రామానికి చెందిన మద్దినేని కృష్ణచైతన్య రూ.40 లక్షల సొంత నిధులతో వారి తండ్రి శ్రీమన్నారాయణ జ్ఞాపకార్థం నిర్మించారు.

కార్యక్రమంలో సర్పంచ్ మద్దినేని పార్వతమ్మ, మాజీ జడ్పీటీసీ కేవీ సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, ఏడుకొండలు, డాక్టర్ జయకిషోర్, మద్దినేని లక్ష్మణరావు, కోటేశ్వరరావు, నాగేంద్రప్రసాద్, రామచంద్రయ్య, ప్రధాన దాత కృష్ణచైతన్య, ఆంజనేయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పర్చూరు: బండ లాగుతున్న ఎడ్లు

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 16: పర్చూరు మండలం అన్నంబొట్ల వారిపాలెంలో ఎడ్ల బలప్రదర్శనలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో మంగళవారం న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన పోటీల్లో 11 జతల ఎడ్లు పాల్గొన్నాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు. తొలుత బరిలోకి దిగిన కృష్ణాజిల్లా, మల్లిపల్లి గ్రామానికి చెందిన అక్కినేని ముకుల్ చౌదరి ఎడ్లు నిర్ణీత సమయం ముగిసే సరికి 4009.2 అడుగుల దూరం లాగాయి. ప్రకాశం జిల్లా, దుర్గా గ్రామానికి చెందిన డీవీకే బుల్స్ 4806.10 అడుగుల దూరం లాగి ప్రస్తుత పోటీల్లో ముందంజలో ఉన్నాయి. గుంటూరు జిల్లా, లింగాయపాలెం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కోల్డ్ స్టోరేజ్ ఎడ్లు 3906.2 అడుగులు, పల్నాడు జిల్లా రూబినగుంట్లకు చెందిన ఎడ్లు 3624.9 అడుగలు దూరం లాగాయి.

అలాగే, గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శనలో మొత్తం 8 జతల ఎడ్లు పాల్గొన్నట్లు నిర్వాహకుడు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన ఎడ్లు నిర్ణీత సమయం ముగిసే సరికి 3600 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా, కాకుమానుకు చెందిన ఎడ్ల జత 4093.3 అడుగుల దూరం లాగి ప్రస్తుత పోటీలో ముందంజలో ఉన్నాయి.

తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడుదల



ఏబీసీకి విడుదలైన సాగర్ నీరు

బల్లికురవ, జనవరి 16: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా సాగర్ డ్యాం నుంచి నీటిని విడుదల చేశారు. మంగళవారం ఉదయానికి జిల్లా సరిహద్దు అయిన అద్దంకి బ్రాంచ్ కాలువ(ఏబీసీ) 18 వ మైలు వద్దకు 300 క్యూసెక్కుల నీరు విడుదలయింది. అద్దంకి, పర్చూరు ప్రాంతాల పరిధిలో పలు మండలాల్లో ఉన్న సుమారు వంద మంచి నీటి చెరువులను నింపేందుకు నీటిని విడుదల చేశారు. 11 రోజుల వరకే సాగర్ డ్యాం నుండి తాగునీరు విడుదల అయ్యే అవకాశం ఉందని అధికారులకు సమాచారం అందింది. దీంతో నీరు వృథా కాకుండా ఉండేందుకు అధికారులు ఏబీసీపై పర్యవేక్షణ చేపడుతున్నారు. 18వ మైలు వద్ద మూడు వందల క్యూసెక్కులు నీటి విడుదల జరగగా, బల్లికురవ మండల పరిధిలోని 33వ మైలు వద్దకు రెండు వందల క్యూసెక్కుల నీరు చేరుతుంది. దిగువ బాగాన ఉన్న మంచి నీటి చెరువులకు నీరు చేరే సరికే అయిదు రోజులు పడుతుంది. 11 రోజులు మాత్రమే నీరు వస్తే చెరువులకు చేరే అవకాశం ఉండదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికే పలుగ్రామాలలో చెరువులు నీరులేక ఒట్టిపోయి ఉన్నాయి. వచ్చిన నీటిని రెవెన్యూ, ఎన్ఎస్పీ, అర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా చెరువులను నింపే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళాకారులను పోత్సహించాలి

పర్చూరు, జనవరి 16: కళాకారులను పోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు అన్నారు. పర్చూరులోని ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం రాత్రి రాష్ట్రస్థాయిలో డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదుతోపాటు, షీల్డ్‌లను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త నర్రా వెంకట్, రొటేరియన్ కోటా శ్రీనివాసరావు, యద్దనపూడి హరిప్రసాద్, నటరాజ్ శ్రీనివాసరావు, లంకా ప్రసాద్, వీరూ, తులసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

చీరాల, జనవరి 16: నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల తుఫాన్ నేపథ్యంలో నష్టపోయిన పేదలకు మంగళవారం మార్పు సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.1500 విలువైన నిత్యాసర సరుకుల కిట్లను సంస్థ ప్రతినిధి మార్పు గ్రెగోరి తదితరుల చేతుల మీదుగా అందజేశారు. మున్సిపల్ పరిధిలోని సెయింట్ఆన్స్ స్కూల్ సమీపంలోని రోశయ్యకాలనీ, వేటపాలెం మండలం పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ తానాకాలనీ, చీరాల ఇంజనీరింగ్ కళాశాల వెనుకనున్న ఎస్టీ కాలనీలలో మొత్తం 221 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1500 విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పత్తిపాటి శ్రీమన్నారాయణ, మెత్రాసన ల్యాండ్ ఇన్‌చార్జ్ రెవరెండ్ ఫాదర్ జ్యోతిరాజ్, రెవరెండ్ ఫాదర్ ఏసురత్నం, రెవరెండ్ ఫాదర్ కరుణాకర్, కౌన్సిలర్ సల్లూరి సత్యానందం, రైటైర్డ్ ప్రిన్సిపాల్ మార్పు విన్సెంట్‌పాల్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు చేగూడి సురేష్, మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కోటిదాసు, ఏఎంసీ డైరెక్టర్ కనపర్తి బజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, జనవరి 16: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొనటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన నటరాజ సుబ్రహ్మణ్యం అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ(ఏడీబీ) ఎదురు మంగళవారం సాయంత్రం నామ్ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొనటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం బంధువులు ప్రయివేట్ వాహనంలో నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.

కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరు అరెస్ట్

చినగంజాం. జనవరి 16: మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జీడిచెట్టపాలెం గ్రామ శివారులో మంగళవారం కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కె.సురేష్ తెలిపారు. వారినుంచి రూ.500 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాపయ్యనగర్ గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మహిళపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తెప్పోత్సవమా.. వైసీపీ ఉత్సవమా!

- ఎమ్మెల్యేను ఆహ్వానించని అధికారులు
- భవనాసిలో అధికారపార్టీ నేతల హడావిడి

అద్దంకి, జనవరి 16: అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సిన లక్ష్మీ నరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల తెప్పోత్సవం అధికార పార్టీ నాయకుల హడావుడి మధ్య వైసీపీ ఉత్సవంలా సాగింది. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను భవనాసి చెరువులో విహరింప చేసేందుకు ఏర్పాటుచేసిన పడవలపై వైసీపీ నేతలు ఆశీనులయ్యారు. దేవాలయ నిబంధనల మేరకు రెండు దేవాలయాల పాలకమండళ్ళ సభ్యులు, పూజారులు, భజంత్రీలు, దేవాలయ అధికారులతో పాటు ముఖ్యమైన ప్రజా ప్రతినిధులు మాత్రమే స్వామి వార్ల తెప్పోత్సవం పడవపై ఉండేవిధంగా అవసరమైన ఏర్పాట్లుచేయాలి. అయితే, అధికారులు నిబంధనలు పూర్తిగా తుంగలోతొక్కి వైసీపీ నేతలకు మాత్రమే అవకాశం కల్పించారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులలో కొంతమందిని తెప్పోత్సవంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించకపోవటంపట్ల కినుక వహించారు. ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం పాలకమండలి గడువు ముగిసినా ఇంకా కొత్త పాలకమండలి నియామకం జరగలేదు.

ఈనేపథ్యంలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు, రెండు దేవాలయాల అధికారులతో నిర్వహించాల్సి ఉంది. ఎంతో కన్నుల పండువగా నిర్వహించే శింగరకొండ తెప్పోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఆహ్వానించకపోవటం విమర్శలకు తావిస్తుంది. ఎంపీ సురేష్ స్వామివార్ల ఊరేగింపులో పాల్గొని తెప్పోత్సవానికి హాజరుకాకుండానే వెళ్ళిపోయారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డితో పాటు అద్దంకి పట్టణ, మండలంలోని పలువురు వైసీపీ నాయకులు స్వామివార్ల తెప్పోత్సవంలో ఆసీనులు కావటం విమర్శలకు తావిస్తుంది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కావాల్సిన తెప్పోత్సవం సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభం కావటంతో భక్తులకు ఎదురుచూపులు తప్పలేదు. వైసీపీ నేతల హడావుడితో తెప్పోత్సవం పూర్తయ్యే వరకు ఉండకుండానే భక్తులు కొద్దిసేపటికే వెళ్ళిపోయారు. ఈవోలు సుభద్ర, కోటిరెడ్డి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ నర్రావులు ఏడుకొండలు, వైసీపీ నేతలు కోట శ్రీనివాసకుమార్, కాకాని రాధాకృష్ణమూర్తి, అవిశన ప్రభాకరరెడ్డి, సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



భవనాసి చెరువులో స్వామివార్ల తెప్పోత్సవంలో ఆశీనులైన వైసీపీ నేతలు

నాటకం సజీవం

- సినీ దర్శకుడు గోపీచంద్ మలినేని
- అనంతవరంలో ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 16: నాటకం ఎవరినైనా కదిలిస్తుంది.. దానికి చావు లేదు, బతికే ఉంటుందని సినీ దర్శకుడు గోపీచంద్ మలినేని అన్నారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈనెల 11న ప్రారంభమయిన ఎన్టీఆర్ కళా పరిషత్ నాటిక పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకులు అనిల్ రావిపూడి, గోపిచంద్ మలినేని, సినీ నటుడు అజయ్‌ఘోష్‌ను కళా పరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా గోపీచంద్ మలినేని మాట్లాడుతూ నాటకరంగాన్ని ప్రోత్సహిస్తున్న కళాపరిషత్‌ను అభినందించారు. స్వర్గీయ ఎన్టీఆర్ అంటే తనకు ఎంతో భక్తిపూర్వకమైన దేవునితో సమానమన్నారు. సినీ దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ సినిమాలు, టీవీ సీరియళ్ల పెరిగిన నేపథ్యంలో కళా పరిషత్ నాటికలను తిలకించడానికి వచ్చిన ప్రేక్షకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కళాపరిషత్‌లకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సభకు డాక్టరు కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించగా, కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, పెడవల్లి కల్యాణచక్రవర్తి, గుదే తారకరామారావు, కొరటాల వంశీ, పెడవల్లి వెంకటేశ్వర్లు, నిమ్మల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమం అనంతరం మూడు నాటికలను ప్రదర్శించారు.

ఉత్తమ ప్రదర్శనగా ఇంద్ర ప్రస్థం నాటిక

ఐదు రోజులపాటు జరిగిన కార్యక్రమంలో 13 నాటికలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటికను ఎంపిక చేశారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా తెలుగు కళాసమితి విశాఖ పట్టణం వారు ప్రదర్శించిన నిశబ్దమా నీ ఖరీదెంత, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారు ప్రదర్శించిన కాపలా నాటికను ఎంపిక చేశారు. ఇంద్ర ప్రస్థం నాటిక ఉతమ దర్శకత్వం, ఉత్తమ నటుడు అవార్డులను దక్కించుకుంది. న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్ విజయవాడ వారు ప్రదర్శించిన కపిరాజు నాటికను ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా ఎంపిక చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎం.సుమన్, పమిడి ఘంటం సుమ, పి.పాండురంగారావు వ్యవ హరించారు.



గోపీచంద్ మలినేనిని సత్కరిస్తున్న అనిల్ రావిపూడి, కళా పరిషత్ సభ్యులు



పర్చూరు: అమృత హస్తం నాటికలోని ఓసన్నివేశం

సందేశాత్మకంగా నాటికల పోటీలు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 16: ఆలోచనలను రేకెత్తించే విధంగా పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో నాటిక పోటీలు సాగుతున్నాయి. సమాజంలో జరుగుతున్న ఇతివృత్తాలను నాటిక ప్రదర్శనల ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపుతున్నారు. గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న నాటిక పోటీల్లో భాగంగా సోమవారం రాత్రి ముఖ్యఅతిథిగా ప్రముఖ రంగస్థల నటుడు జెట్టి హరిబాబు పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటి జీవితాల్లో వెలుగులు నింపే నాటికలంటే తనకు ఎంతో ఇష్టమని అన్నారు. తొలుత ప్రదర్శించిన ఆమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి అమృత హస్తం నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అప్యాయత, అనురాగాలతో ఉండాల్సిన ఒకే తల్లికి పుట్టిన అన్నాచెల్లెళ్ళ ప్రేమానురాగాలు కాలక్రమేన ఎలా తరగిపో తున్నాయో అనే అంశాన్ని కళాకారులు తమ కళా ప్రదర్శన ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశారు.

ద్వితీయ ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారి కాపలా నాటిక రక్షణ వ్యవస్థను మేల్కొల్పే విధంగా సాగింది. మూడవ నాటికగా వెన్నెలొచ్చింది నాటిక ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.

మహిళా కబడ్డీ విజేత ప్రకాశం జట్టు

పంగులూరు, జనవరి 16: రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలలో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని కొండమంజులూరులో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగిన లీగ్ కమ్ నాకౌట్ మహిళా కబడ్డీ పోటీలలో ప్రకాశం, కృష్ణా, గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు పాల్గొన్నాయి. మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీలలో గుంటూరు, ప్రకాశం జట్లు తలపడ్డాయి. ప్రకాశం జట్టు విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో గుంటూరు, తృతీయ స్థానంలో కృష్ణా జట్టు, నాలుగో స్థానంలో విజయనగరం జట్టు నిలిచింది. విజేతలకు తెలుగుమహిళ ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు రావులపల్లి పద్మజ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు, బొప్పూడి నాగేశ్వరరావు, శరత్‌బాబు, వెంకటసుబ్బయ్య, సుధాకర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచేవరకు పోరు


- 36వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

చినగంజాం, జనవరి 16: వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలుచేసే వరకు పోరాటం ఆగదని అంగన్‌వాడీ మండల నాయకులు ఎ.హైమావతి, కె.రంగనాయకమ్మ, పి.జయలక్ష్మి, కె.యానాదమ్మ హెచ్చరించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 36వ రోజుకి చేరింది. ప్రభుత్వం మొండివైఖరి వీడి అంగన్‌వాడీల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు జీవీ ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. పొర్లు దండాలు పెట్టుతూ అంగన్‌వాడీలు, ఆయాలు నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


పిండి వంటలతో నిరసన.. అద్దంకిటౌన్, జనవరి 16: అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 36వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ధర్నా శిబిరం వద్దనే పిండి వంటలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, పి.తిరుపతి రెడ్డి, జి.శారద, మనోలత, రావమ్మ, మహాలక్ష్మి, జాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో.. బల్లికురవ, జనవరి 16: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ఆటపాటలతో ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుండా మొద్దునిద్ర పోతుందని వారు విమర్శించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, భారతి, శ్రీదేవి, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో.. చీరాల, జనవరి 16: ఎస్మాను రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో భాగంగా 36వ రోజు మంగళవారం కోలాటాలు ఆడుతూ, గాలిపటాలు ఎగురవేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుండా, అణచివేత ధోరణి అవలంభిస్తే తగిన విధంగా స్పందిస్తామన్నారు. కార్యక్రమంలో పి.రేఖ, ఎం. వసంతరావు, జి.సుజీవన, సులోచన, బుల్లెమ్మాయి, తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం: పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు



సోమశిలలో 29.906 టీఎంసీల నీరు నిల్వ



అనంతసాగరం: సోమశిల జలాశయంలో మంగళవారం నాటికి 29.906 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి ఎలాంటి ప్రవాహం రాకపోగా, దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 16 : కనుమ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి నెల్లూరు మైపాడుగేటు ఘాట్‌లో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి వైభవంగా తెప్పోత్సవం జరిగింది. నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామివార్లను ఊరేగింపుగా తీసుకువచ్చి కేసీపీ కల్యాణ మండపంలో విడిది చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథులుగా నగర ఎమ్మెల్యే డాక్టర్ పీ అనీల్‌కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వంగాల శ్రీనివాసులు రెడ్డి, ఈవో తాతా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



నెల్లూరు మైపాడు గేట్ వద్ద జాఫర్‌సాహెబ్ కాలువ ఘాట్‌లో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి తెప్పోత్సవం (అంతర్‌చిత్రంలో) తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు



బుచ్చి : జొన్నవాడలో కామాక్షితాయి పారువేట ఉత్సవం

కనుల పండువగా
తెప్పోత్సవం

- వైభవంగా కనుమ వేడుకలు
- ఘనంగా పారువేట
- ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు
- పెద్దలకు వస్త్రాల సమర్పణ

● తరలివచ్చిన దేవతలు

కాగా నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, నవాబు పేట ఆలయాలు, రాజరాజేశ్వరి, మూలాపేట శివాలయం, వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణ. ధర్మరాజులస్వామి, ఇరుకళల పరమేశ్వరి, తల్పగిరి రంగనాథస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరి, పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వరుడు, భావనారాయణస్వామి, అయ్యప్పస్వామి, గొలగమూడి వెంకయ్యస్వామి, ఉడయవర్లు తదితర ఆలయాల్లోని స్వామి అమ్మవార్లు తరలివచ్చి కొలువుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు, నగర ప్రముఖులు, రాజకీయ నాయకులు స్వామివార్లను దర్శించుకున్నారు. పారువేట ఉత్సవానికి రాజరాజే శ్వరి రైస్ ఇండస్ట్రీస్ అధినేత కొలపర్తి రమేష్ ఉభయకర్తగా వ్యవహరిం చారు.

● సంప్రదాయబద్ధంగా కనుమ

కనుమ పండుగను మంగళవారం జిల్లా ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాడి పంటలు, పశుసంపదకు సంబంధించిన ఈ పండుగను వైభవంగా జరుపుకున్నారు. పల్లెల్లో రైతులు తమ పశువులకు శుభ్రంగా స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో సుందరంగా అలంకరించారు. కొమ్ములను వివిధ రంగులతో తీర్చిదిద్దారు. పశువుల పాకల్లో పొంగళ్లు పెట్టి సూర్యనారాయణుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లోని గోమాతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పెంచలకోన, తల్పగిరి రంగనాథ స్వామి, వేదగిరి నరసిం హకొండ, కొండ బిట్ర గుంట, జొన్నవాడ తదితర ఆలయాల్లో కనుమ పారువేటను ఘనంగా నిర్వహించారు.



సీతారామపురం : మంగళవారం జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ

● ఆనందోత్సాహాలతో సంక్రాంతి

జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సోమవారం సంక్రాంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటా పొంగళ్లు పొంగించారు. అరిసెలు, లడ్డూలు, మురుకులు, పప్పు చక్కలు తదితర సంప్రదాయ పిండివంటలను నైవేద్యాలుగా సమర్పించి పెద్దలకు వస్త్రాలు పెట్టి పూజలు చేశారు. బంధుమిత్రుల విందులు, వినోదాలతో సరదాగా గడిపారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. పోలీసులు ఆంక్షలు ఉన్నా కోడి పందేలు మాత్రం యథావిధిగా జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలను రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజాప్రతినిధులు వారి స్వగృహాలు, సొంత గ్రామాల్లో బంధుమిత్రులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పండుగ సంబరాలను స్వగ్రామం పొదలకూరు మండలం తోడేరులో జరుపుకున్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు నెల్లూరులోని తమ స్వగృహంలో పండుగ సంబరాలను జరుపుకున్నారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు కూడా సంక్రాంతి వేడుకలను తమ తమ స్వగృహాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల ముగ్గులు పోటీలు జరిగాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



ఉలవపాడు : మంగళవారం రాత్రి నిర్వహించిన శ్రీదేవి,భూదేవి సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

● ఘనంగా పెద్దల పండుగ

నెల్లూరు నగరంలోని బోడిగాడి తోట లో సోమవారం పెద్దల పండుగ ఘనం గా జరిగింది. నగరం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా మొక్కలు పంపిణీ చేశారు. నెల్లూ రు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ తదితరులు కూడా సంక్రాంతి రోజున ప్రజల మధ్య తిరుగుతూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



నెల్లూరు బోడిగాడితోటలోని సమాధులను పూజించి, పెద్దలను స్మరించుకుంటున్న నగర వాసులు



కావలి : గ్రామోత్సవంలో కలుగోళ శాంభవి

నేడు ఏటి పండుగ

సంక్రాంతి 4వరోజు ఏటి పండుగతో నెల్లూరులో పెద్ద పండుగ సంబరాలు ముగుస్తాయి. బుధవారం జరిగే ఏటి పండుగ కోసం పెన్నాలో నగర పాలక సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. భోగి రోజున ముత్తైదువులు గౌరమ్మ(గొబ్బిళ్ల)ను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అనంతరం గొబ్బిలను పెన్నాలో ఓలలాడించడం (నిమజ్జనం) చేసేందుకు వస్తారు. దీన్నే ఏటి పండుగ అంటా రు. పతంగులు ఎగురవేయడం, ఆటపాటలతో ఆ ప్రాం తం కోలాహలంగా ఉంటుంది. ఏటి పండుగకు వచ్చే భక్తులను ఆశీర్వదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవార్లు తరలివస్తారు.

● మకరజ్యోతి దర్శనం

నగరంలోని అయ్యప్పగుడిలో సోమవారం సాయంత్రం మకరజ్యోతి దర్శనం నేత్రానందంగా జరిగింది. మకర జ్యోతి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు, కమిటీ కార్యదర్శి కేవీ రత్నం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అక్కడా... ఇక్కడా...
ఒక్కరే!

- ఇరిగేషన్‌లో ఒక్కో ఇంజనీరుకు రెండేసి బాధ్యతలు
- పెరుగుతున్న పనిభారం, ఆపై అవినీతి
- ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే కారణం
- కీలక పోస్టులకు భారీ డిమాండ్
- భర్తీకి వేడుకున్నా పట్టించుకోని ప్రభుత్వం

నెల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఒక పోస్టును నిర్వహించడమే చాలా కష్టంగా ఉండగా, ఒక్కొక్క అధికారికి రెండేసి పోస్టులు కట్టబెడితే వారి పరిస్థితి ఎలా ఉంటుంది..? ఇరిగేషన్ శాఖలో ఈ పరిస్థితి కారణంగా ఇంజనీర్లపై పనిభారం పెరగడంతో పాటు అవినీతి కూడా పెరుగుతోంది. ముఖ్యంగా కొన్ని కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జులుగా కూర్చుకునేందుకు కొందరు అధికారులు రాజకీయ నాయకులు చెప్పిందల్లా చేస్తున్నారు. అసలు పనివదిలేసి ఈ ఇన్‌చార్జి పోస్టులపైనే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఏ శాఖలో లేని సమస్య ఇరిగేషన్ శాఖలో కొన్నేళ్లుగా తీవ్రతరమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే రెండేసి పోస్టులకు కారణమని ఇంజనీర్లు చెబుతున్నారు. జిల్లాలో రెగ్యులర్ ఇరిగేషన్‌తో పాటు సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టుల్లో ఈ ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. ఎస్‌ఈ స్థాయి నుంచి జేఈ స్థాయి వరకు పలువురికి రెండేసి పోస్టులున్నాయి. కొందరు ఒకేసర్కిల్‌లో రెండో పోస్టు బాధ్యతలను నిర్వర్తి స్తుండగా, మరికొందరు పక్క సర్కిల్‌లో పనిచేస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా పక్క జిల్లాల్లోనూ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఫలితంగా వీరు వారి రెగ్యులర్ సీట్లలో ఎక్కువ సేపు కూర్చోవడం లేదు. ఇది రైతులకు, ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది.

● 30 మందికి వరకు అదనపు బాధ్యతలు

తెలుగుగంగ ఎస్‌ఈగా ఉన్న హరినారాయణ రెడ్డి కడప జిల్లా సీఈగా వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్ సర్కిల్ కావలి ఈఈగా పనిచేస్తున్న కృష్ణమోహన్ అదే సర్కిల్ ఎస్‌ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలుగుగంగలో రాపూరు ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డికి సోమశిల సర్కిల్ ఎస్‌ఈ బాధ్యతలను అప్పగించారు. తెలుగుగంగ రెండో డివిజన్ ఈఈగా పని చేస్తున్న విజయకుమార్‌రెడ్డి చిత్తూరు ఇరిగేషన్ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా పనిచేస్తున్నారు. ఇరిగేషన్ సర్కిల్ ఆత్మకూరు డీఈ-1గా పని చేస్తున్న అధికారి అదే డివిజన్ ఈఈగా కూడా పని చేస్తుండగా, ఆత్మకూరు డివిజన్-2లో జేఈగా పనిచేస్తున్న ఇంజనీర్ ఆ డివిజన్‌కు డీఈగా ఉన్నారు. నెల్లూరు సబ్ డివిజన్ డీఈ టీజీపీ మూడో డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్నారు. కావలి డీఈగా పనిచేస్తున్న అధికారి డ్రైనేజీ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలు కూడా చూస్తున్నారు. నారాయణరెడ్డిపేట సెక్షన్ జేఈ పొదలకూరు డీఈగా పని చేస్తుండగా, కుల్లూరులోని ఓ జేఈ అక్కడే డీఈగా కూడా రెండో పోస్టును నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లాలోని సుమారు ముప్పై మంది వరకు జేఈ, డీఈ, ఈఈ, ఎస్‌ఈలు రెండేసి పోస్టుల్లో కొనసాగుతున్నారు.

● ఆగిన ఉద్యోగోన్నతులు

కొన్నేళ్ల నుంచి ఇరిగేషన్ శాఖలో ఉద్యోగోన్నతలు నిలిచిపోయాయి. జోనల్ సిస్టమ్ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉండగా, ఆ విధానాన్ని పక్కనపెట్టి వర్టికల్ సీనియారిటీ విధానంలో పదోన్నతి కల్పించారు. ఇది వివాదంగా మారడంతో విషయం కోర్టు మెట్లెక్కింది. అప్పటి నుంచి ప్రభుత్వ స్థాయిలో ఒక నిర్దిష్ట విధానాన్ని అమలు చేయలేకపోతున్నారు. దీంతో ఇంజ నీర్లకు ఉద్యోగోన్నతులు రాకపోవడం, పైస్థా నాల్లో ఉన్న వారు రిటైర్డ్ అవుతుండ డంతో ఆ స్థానాల్లో ఇన్‌చార్జులుగా నియమిస్తూ వస్తున్నారు. కాగా కొన్ని కీలకమైన పోస్టులకు భారీ డిమాండ్ ఉంది. ఆ స్థానాల్లో ఎఫ్‌ఏసీ తెచ్చుకునేందుకు, కొనసాగేందుకు కొందరు అధికా రులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.



సమస్యలు పరిష్కరించండి

- నేతలకు అంగన్‌వాడీల వినతి
- ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి
- కలెక్టరేట్ వద్ద దీక్షలో సీఐటీయూ

నెల్లూరు (వైద్యం) జనవరి 16: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు, సీఐటీయూ నేతలు మంగళవారం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అలాగే నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌కు అర్జీ ఇచ్చారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తా నని వేమిరెడ్డి వారికి హామీ ఇచ్చా రు. ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి మీ సమస్యలను తీసుకు వెళతామని తెలియచేశారు. అలాగే విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగా రెడ్డిని కూడా నాయ కులు కలిసి వినతి పత్రం ఇచ్చారు.

● కలెక్టరేట్ వద్ద దీక్ష

అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మె 36వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. ఇప్పటికే ఐదు దఫాలుగా ముఖ్యనేతలతో ప్రభుత్వం చర్చలు జరిపినా సమస్యల పరిష్కారంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. పండుగలలోనూ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని, వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని వేతనాలు పెంచాలని కోరారు. లేకుంటే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, నాయకురాళ్లు కామాక్షమ్మ, రజని, మల్లెమ్మ, రమాదేవి, సుమతి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల ప్రారంభం

వలేటి వారి పా లెం, జనవరి 16: వలేటివారి పాలెం మండలంలోని కాకుటూరు బస్టాండు సెంటరులో కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర స్థాయి ఎడ్లపందేలు ప్రారంభమయ్యాయి. పోటీలను నాగేశ్వరరావుతో పాటు టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలకు జూనియర్ విభాగంలో 11 ఎడ్ల జతలు, సీనియర్ విభాగంలో 15 ఎడ్లజతలు పాల్గొన్నాయి. 18 క్వింటాళ్ల బరువు కలిగిన బండను 20 నిమిషాలలో ఎక్కువ దూరం లాగిన ఎడ్లజతకు మొదటి బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు ఎడ్ల పోటీలు పూర్తయిన అనంతరం బుధవారం రాత్రి బహుమతులు అందజేయనున్నారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, పొడపాటి నరసింహం, పొడపాటి సుధాకర్ పాల్గొన్నారు.



వలేటివారిపాలెం మండలం కాకుటూరులో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఇంటూరి నాగేశ్వరావు

జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీ

- ప్రారంభమైన ఎన్నికల సన్నాహాలు

నెల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలువురు తహసీల్దార్‌లు బదిలీ అయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తహసీల్దార్‌లను పక్క జిల్లాలకు బదిలీలు చేస్తూ రాష్ట్ర భూ పరిపాలనా చీఫ్ కమిషనర్ ఇంతియాజ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సీతారత్నంను లింగసముద్రం తహసీల్దార్‌గా, బాపట్ల కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పీ.కృష్ణకాంత్‌ను కందుకూరు తహసీల్దార్‌గా, బాపట్ల ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీచరణ్‌ను మర్రిపాడు తహసీల్దార్‌గా, గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న ఎస్‌కె.ఇస్మాయిల్‌ను విడవలూరు తహసీల్దార్‌గా, గుంటూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావును వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అలాగే నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న చంద్రారెడ్డిని వరికుంటపాడు తహసీల్దార్‌గా, రేపల్లె ఆర్డీవో కార్యాలయ ఏవో జాన్‌పీటర్‌ను దగదర్తి తహసీల్దార్‌గా, చీరాల ఆర్డీవో కార్యాలయ ఏవో నరసింహారావును ఆత్మకూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బాపట్ల ఆర్డీవో కార్యాలయ ఏవో గోపీకృష్ణను చేజర్ల తహసీల్దార్‌గా, ప్రకాశం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని నెల్లూరు కలెక్టరేట్ లాండ్ రికార్డ్ తహసీల్దార్‌గా, ప్రకాశం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న చిరంజీవిని మనుబోలు తహసీల్దార్‌గా, మార్కాపురంలో కేఆర్‌ఆర్‌సీలో పనిచేస్తున్న శ్రీనివాసరావును కలువాయి తహసీల్దార్‌గా, ప్రకాశం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను కొండాపురం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణ ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు



సంగం : చెన్నవరపాడులో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి గ్రామోత్సవం



కలిగిరి : గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కందుకూరు, జనవరి 16: సంక్రాంతి పర్వదినాన్ని కందుకూరు ప్రాంతంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి సందర్భంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేశారు. క్రికెట్, కబడ్డీ పోటీలు, చిన్నారులకు స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్ లాంటి పోటీలు నిర్వహించి గ్రామ కమిటీల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కందుకూరు సమీపంలోని కాకుటూరు వద్ద ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం కనుమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలోను సంక్రాంతి సందర్భంగా వివిధరకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వలేటివారిపాలెం: మండలంలోని కాకుటూరులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలలో సుమారు 173 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీలలో కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన శివరాత్రి సులోచన మొదటి బహుమతి వాషిగ్ మిషన్, రెండవ బహుమతి దామా ఉమామహేశ్వరి ఫ్రిజ్, మూడవ బహుమతి ఉలవపాడుకు చెందిన ఓసూరు పద్మావతి ఎల్‌ఈడీ టీవీ గెలుపొందారు. అంతేగాకుండా ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలకు నాగేశ్వరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, టీడీపీ నాయకులు పొడపాటి నరసింహం, పొడపాటి సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర స్వగ్రామమైన ఇస్కపల్లిలో అందుబాటులో ఉండడంతో మండలం లోని నాయకులంతా ఆయన్ను కలుసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, దువ్వూరు శేఖర్‌రెడ్డి, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, అరగల రమణయ్య, గోళ్ల వెంకటేశ్వర్లు, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా పశువులకు అలంకరణ చేశారు. సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో భక్తులు కోలాటం నిర్వహించారు.

ఉలవపాడు : సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలు పల్లెల్లో ఘనంగా జరుపుకున్నారు. రంగుల హరివిల్లు ముగ్గుల పోటీలలో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో సంక్రాంతి పండుగ రోజు ముగ్గుల పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎద్దు సుష్మలత, వెలిచర్ల పుష్పశ్రీ, దామతోటి మహాలక్ష్మీలకు బహుమతులు అందచేశారు. అదేవిధంగా ఉలవపాడు ఎస్సీ కాలనీలో కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఆత్మకూరు: నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. గ్రామ దేవతలకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. అలాగే క్రికెట్, ముగ్గుల పోటీలతో పాటు గొబ్బెమ్మల ఆటపాటలను సాగించారు. సోమవారం పెద్దపండుగను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్పలో వెలసి ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పభక్తులు మకరజ్యోతిని వెలిగించి పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, అలఘనాథస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. శ్రీకృష్ణసేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణమందిరం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య విజేతలకు బహుమతులు అందజేశారు.

సంగం: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. సోమవారం నాడు సంక్రాంతి పండుగను ఇంటిల్లపాది భక్తి శ్రద్ధలతో పూజలు చేసి జరుపుకున్నారు. అలాగే రాళ్లచెలిక వీవర్స్ కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకుని సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, చెక్‌పోస్టు కాలనీలో మాతా పరమేశ్వరీదేవి ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గునుపూడి ట్రేడర్స్ నిర్వాహకులు గిరి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ మానుకు పూజలు

మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ వేప మానుకు సోమవారం సంక్రాంతి (పెద్ద పండుగ)ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాలకు వలస వెళ్లినవారు గ్రామానికి వచ్చారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా వేపమానును గజపూల మాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరభద్రేశ్వరస్వామి గ్రామోత్సవం

మండలంలోని చెన్నవరపాడులో మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి వీరభద్రేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉదయగిరి: మండలంలో సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మకర రోజు పెద్దల సమాధుల వద్ద వస్త్రాలు ఉంచి కాయాకర్పూరం సమర్పించి ఆశీర్వాదాలు పొందారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సంక్రాంతి పండుగ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పెద్దల పండగను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు వారి వారి పెద్దల సమాధుల వద్ద ఇష్టమైన పదార్థాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కనుమ రోజున పశువులకు పూజలు నిర్వహించడంతో పాటు పంట పొలాల్లో శీతకుండలు ఏర్పాటు చేశారు.

అట్టహాసంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

అనంతసాగరం: మండలంలోని కమ్మవారిపల్లి ధర్మపల్లెమ్మ ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఏడు జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎద్దులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బిట్రగుంట : బోగోలు మండలం తాళ్ళూరు పంచాయతీ చైతన్య నగర్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ట్రాక్టర్ ట్రక్ వెనక్కు నడిపే పోటీలు జరిగాయి. మొదటి బహుమతి రూ. 3వేలు బిక్కం శ్రీనివాసులురెడ్డి, రెండో బహుమతి 2వేలు పోలుబోయిన వేణుగోపాల్, కుంచ మహేష్‌రెడ్డి మూడవ బహుమతి వెయ్యి రూపాయలు గెలుపొందారు. చైతన్యనగర్ యూత్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందచేశారు.

సీతారామపురం: జనసేన పార్టీ ఉదయగిరి నియోజక వర్గ నాయకులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో సీతారామపురం స్థానిక ఎల్ వీ ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జనసేన పార్టీ మన ఊరు- మన ఆట అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి ముగ్గులను పరిశీలించి విజేతల పేర్లను ప్రకటించారు.. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన పార్టీ నాయకులు పాలిశెట్టి శ్రీనివాసులు,అల్లు రవీంద్ర, విఠల నారాయణ, భుమన ఓముల్ రెడ్డి, ఏడుకొండలు, కోళ్ల నారాయణ పాల్గొన్నారు.

కలిగిరి, జనవరి 16: మండల ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన గోదాదేవి కల్యాణ వేడుకల్లో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా గాలిపటాలను ఎగురవేశారు. అన్నదాతలు పాడిపశువులను అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా గ్రామదేవతలకు పొంగళ్ళు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కందుకూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు



వలేటివారిపాలెం: కాకుటూరులో ముగ్గుల పోటీల విజేతకు మొదటి బహుమతి అందజేస్తున్న ఇంటూరి నాగేశ్వరావు

వైభవంగా కలుగోళ శాంభవి గ్రామోత్సవం

కావలిటౌన్, జనవరి 16: కావలి పట్టణ గ్రామదేవతగా కొలువుదీరిన కలుగోళ శాంభవి అమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి ఆలయం వద్ద ప్రారంభమైన గ్రామోత్సవం పట్టణ పురవీధుల్లో మంగళవాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో కనులపండువగా జరిగింది. మంగళవారం రాత్రి గ్రామోత్సవం తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

జిల్లాస్థాయి చెడుగుడు పోటీల ప్రారంభం

బిట్రగుంట, జనవరి 16: బోగోలు మేజర్ పంచాయతీ కుమ్మర వీధిలో యూత్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగు జిల్లా చెడుగుడు పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు బోగిరి ప్రభాకర్, మేకల కిరణ్, ఎం మురళీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల విజేతలకు బహుమతులు

బిట్రగుంట, జనవరి 16: బోగోలు మండలం బిట్రగుంట లిటిల్ ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో జరిగిన అంతర్ రాష్ట్ర సంక్రాంతి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీల్లో బిట్రగుంట సుధా మెమోరియల్ జట్టు విజయం సాధించింది. వారికి పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్, సుగుణ దంపతులు లక్ష రూపాయల నగదు, ట్రోఫీ అందచేశారు. రన్నర్స్ త్రిపుర జట్టుకు 50వేల రూపాయల నగదు, ట్రోఫీని జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్ర(మను) చేతుల మీదుగా అందచేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు, ఉమెన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్ఏ నవీద్ పాల్గొన్నారు. రఫ్రీలుగా మోజెస్ చిట్టిబాబు, దీపు, బాచి, ఏటీమోహన్, కిరణ్, నైనిల్, స్టీఫెన్‌కుమార్, ఏ అంతోని వ్యవహరించారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

ఉలవపాడు, జనవరి 16: మండల కేంద్రం ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి మంగళవారం సాయంత్రం తెప్పోత్సవం కనులపండువగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తెప్పోత్సవం తిలకించారు. ఆలయ ధర్మకర్తలు సుధీష్ చంద్రారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయం ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక ఎస్సై బాజీరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు.

తెప్పోత్సవంలో ఎస్సీ సర్పంచి కి అవమానం

ఉలవపాడు గ్రామంలో మంగళవారం జరిగిన శ్రీ వేణుగోపాల స్వామి తెప్పోత్సవంలో సర్పంచ్ మానికల నాగలక్ష్మికి అవమానం జరిగింది. స్వామివారి కోనేరు వద్ద ఆలయ ధర్మకర్తలకు కుర్చీలు వేశారు. అక్కడికి వచ్చిన సర్పంచు కుర్చీలు ఖాళీగా కనిపించడంతో తనకు కేటాయించిన కుర్చీలనుకొని కూర్చుండిపోయింది. ఇంతలో ఆలయ సిబ్బంది ధర్మకర్తల కోసం వేసిన కుర్చీలని పైకి లేవాలని చెప్పడంతో చేసేది ఏమిలేక అక్కడే నిలబడిపోయింది. ఈ విషయాన్ని దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ప్రసాదును అడగ్గా ధర్మకర్తలకు వేసిన కుర్చీలలో సర్పంచు కూర్చొని ఉందని, ఎలా జరిగిందో ఎవరు పైకిలేవమని చెప్పారో తెలియదని, విచారించి కనుక్కుంటానని చెప్పారు.

మృతుడి కుటుంబానికి కాకర్ల ట్రస్ట్ చేయూత

జలదంకి, జనవరి 16: జలదంకి మండలం కమ్మవారిపాలెంకు చెందిన నవులూరి వెంకటస్వామి ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందాడు. విషయాన్ని టీడీపీ నేత, కాకర్ల ట్రస్ట్ చైర్మన్ సురేష్ దృష్టికి గ్రామ టీడీపీ నాయకులు తీసుకువెళ్లారు. దీంతో సురేష్ తన ట్రస్ట్ తరపున ఆర్థికసాయం కింద పంపిన నగదును గ్రామ ఉపసర్పంచ్ పరిమి ప్రతాప్, టీడీపీ నాయకులు కరియావుల అప్పలయ్యనాయుడు, పరిమి శ్రీహరిలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎల్‌ఆర్ అగ్రహారంలో రక్తదాన శిబిరం



రక్తదానశిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకులు

జలదంకి, జనవరి 16: మండలం లోని ఎల్.ఆర్ అగ్రహారం గ్రామంలో మనఊరు పిలుస్తోంది ట్రస్ట్ సభ్యులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ బృం దం దాతల నుంచి రక్తాన్ని సేకరించింది. రక్తదానం చేసిన యువకులను ట్రస్ట్ సభ్యులు గాలి శ్రీనివాసులు, గొట్టిపపాటి మురళీ, సైనికోద్యోగి క్రిష్ణ అభినందించారు. అనంతరం గ్రామంలో ట్రస్ట్ తరపున మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

జలదంకి మండలం కేశవరం ఎస్సీకాలనీలో సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు సీసీ రోడ్డుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన నిధులతో ఈ రోడ్డు నిర్మించడం జరుగుతోందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణాది రవిచంద్ర, మాజీ సర్పంచ్ లేటి సుధీర్, వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అల్లూరు, జనవరి 16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అల్లూరులోని కెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత కందల రాజారెడ్డి, జోసెఫ్, కమల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి ఘనంగా ఏర్పాట్లు : ఇంటూరి

కందుకూరు, జనవరి 16: కందుకూరులో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 18న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక వెంగమాంబ ఫంక్షన్‌హాలులో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో ఆయన మాట్లాడుతూ 18వ తేదీఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ముందుగా ఏరియా హాస్పటల్ సెంటర్‌లో ఉన్న దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెంగమాంబ ఫంక్షన్‌హాలుకు చేరుకుని వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానశిబిరం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కాగా, ఈనెల 17న సాయంత్రం 4 గంటలకు వలేటివారిపాలెం మండలం పోకూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పార్టీ నాయకురాలు ఉన్నం నళినీదేవి మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, ఎన్వీ సుబ్బారావు, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, జి మోషే, చిత్తారి మల్లిఖార్జున, షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్ : స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

ఆత్మకూరు, జనవరి 16 : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతూనే ఉంది. మంగళవారం విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయూ నాయకులు జీ లక్ష్మీపతి, జీ శివప్రసాద్, నాగేంద్ర శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పీ రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కే రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కావలి టౌన్, జనవరి 16: పట్టణ 18వ వార్డులో శానం కృష్ణ, ప్రణీత దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ముస్లింలకు కనుమ విందు అందించి వార్డు మహిళలందరికీ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణ కుమార్తె వేదసంహిత, సతీమణి ప్రణీత తదతరులు పాల్గొన్నారు.

ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ దాతృత్వం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మెట్టుకూరు కుటుంబ సభ్యులు

అనంతసాగరం, జనవరి 16: మండలంలోని లింగంగుంటలో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కుటుంబ సభ్యులు గ్రామంలోని 530 కుటుంబాలకు సంక్రాంతి సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఏటా దుస్తులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మాధవరెడ్డి తదితరులు

కావలి, జనవరి 16: వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత తప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వ్యక్తిగత వికాసం శిక్షకులు, డాక్టర్ మాధవరెడ్డి తెలిపారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలను డీఎం శ్రీనివాసులతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రమాదరహిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు సాయిప్రసాద్, డిపో అసిస్టెంట్ ఇంజనీర్ ఖాజామొహిద్దీన్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టాలు

● వాహనదారుల అవస్థలు



కుడుమలదిన్నెపాడుసమీపంలో చప్టా వద్ద కనిపించని దిమ్మెలు

కలిగిరి, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో బ్రిడ్జిలు దెబ్బతిని చప్టాలు ప్రమాద కరంగా ఉండటం వలన రాత్రివేళల్లో వాహనాలపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమ్మవారిపాలెం, వెలగపాడు, పాతనాపురం, కుడుమలదిన్నెపాడు, చిన అన్నలూరు దూబగుంట గ్రామాల వద్ద నిర్మించిన చప్టాలవద్ద మార్జిన్‌లను గుర్తించడానికి సిమెంటు దిమ్మెలు గాని, ఇనుప బద్దీలు గాని రక్షణగా లేకపోవడం, చప్టాల వద్ద వేసిన సిమెంటురోడ్డు దెబ్బతిని ఉండటంతో భయం భయంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చప్టాల వద్ద రోడ్డు మరమ్మతులు నిర్వహించి, దిమ్మెలు నిర్మాణం చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను వాహనదారులు కోరుతున్నారు.

మొగలిచెర్లలో పడకేసిన పారిశుధ్యం

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మొగిలిచెర్లలో మాలకొండ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీరు

లింగసముద్రం, జనవరి 16 : మండలంలోని మొగిలిచెర్లలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామం నుంచి మాలకొండ, పామూరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. గ్రామంలోని కెనరాబ్యాంకు పక్కనే ఉన్న ఈ రోడ్డు పైకి కొందరు తమ ఇళ్లలోని వ్యర్థపు నీటిని వదులుతున్నారని, ఈనీరు రోడ్డుపై నిలవడంతో పాటు అర్అండ్‌బీ రోడ్డుపై నుంచి బస్టాండ్ సెంటర్, స్థానిక పాఠశాల మీదుగా సమీపంలోని పొలాల్లోకి వెళుతున్నట్టు గ్రామస్థులు పేర్కొంటున్నారు. రోడ్డు కిరువైపులా ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ రోడ్డు దోమలకు నిలయంగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. మాలకొండ, దత్తాత్రేయస్వామి దేవాలయాలకు వెళ్లే భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ మురుగు నీరు నిల్వ ఉన్న చోట మంచినీటి పైపులైన్ కూడా లీకౌతోందని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కేజీ వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

అనంతసాగరం, జనవరి 16: గుంతలు పడి అధ్వాన్నంగా ఉన్న ఆత్మకూరు - సోమశిల రోడ్డుపై కొందరు కేజీ వీల్స్‌తో రహదారిపై రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ట్రాక్టర్‌కు కేజీ వీల్స్‌తో ప్రధాన రహదారులపై ప్రయాణం చేయరాదన్న నిబంధనలు ఉన్నా పాటించకుండా విచ్చలవిడిగా తిరుగుతుండడంతో సోమశిల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లు రహదారిపై రాకపోకలు సాగించకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు వాపోతున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మాశిలామణి

వింజమూరు, జనవరి 16 : మండలంలోని అరుంధతీయవాడలో ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోచిపాతల ఆనంద్‌మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ మాశిలామణి వృద్ధులు, వికలాంగులు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజలు ముందుకు నడపాలని అందుకు నావంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు 35 సంవత్సరాల నుంచి పేద, ధనిక తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అరుంధతివాడలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లెల తిరుమలేసుమాదిగ, గోచిపాతల సాంబశివరాలుమాదిగ, ఎంఎస్పీ నాయకులు గంగపట్ల వెంగళరావు పాల్గొన్నారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

వలేటివారిపాలెం, జనవరి 16 : మండలంలోని శాఖవరం - కొండసముద్రం గ్రామాల సమీపంలోని పొలాలలో వలేటివారిపాలెం, లింగసముద్రం ఎస్ఐలు బాలమహేంద్రనాయక్, బాజీబాబులు తన సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేశారు. 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ. 1,90,670 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు వలేటివారిపాలెం ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు

కోడి పందెంరాయుళ్లు...

ఉలవపాడు, జనవరి 16: మండలంలోని చాగొల్లు గ్రామం శివారు ప్రాంతం మామిడి తోపుల్లో నిర్వహిస్తున్న కోడిపందెం శిబిరంపై మంగళవారం పోలీసులు దాడిచేసి ఏడుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు కోళ్లను, రూ. 6400 స్వాధీనం పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు.

డీఆర్‌కు ఘన నివాళి



డీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జనవరి 16: విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) వర్ధంతి సందర్భంగా మంగళవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, గోపి కృష్ణ, గంరంధం ప్రసన్నాంజనేయులు పేరూరి కొండలరావు, హరినారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళం

కందుకూరు, జనవరి 16: పట్టణంలోకి కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద భవనానికి శ్రీసంస్కృతి స్కూల్ యాజమాన్యం రూ. 2,00,016 విరాళం అందజేసింది. స్కూల్ డైరెక్టర్, విప్పగుంట గ్రామవాసి కొంకా లక్ష్మీనరసింహం, ఆయన కుమారుడైన స్కూల్ చైర్మన్ కొంకా చంద్రశేఖర్‌లు ఈమొత్తాన్ని కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నల్లబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న భక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న వెంకటేశ్వరస్వామి భక్తులు

ఉదయగిరి రూరల్, జనవరి 16: మండలంలోని గండిపాళెం గ్రామంలో మంగళవారం వెంకటేశ్వరస్వామి భక్తులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి నామస్మరణ, సంకీర్తనలు చేసుకుంటూ గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టి భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ ఈనెల 18న ప్రకాశం జిల్లా పామూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టి కలియుగ వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా భిక్షాటన కార్యక్రమం చేపట్టామన్నారు.